ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 29.09.2026 | సంపుటి : 13 సంచిక : 70 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# మేం ద్రవిడులం.. వాళ్లు ఆర్యులు

## మేం హరహర మహదేవ్ అంటాం
## వాళ్లు జైశ్రీరాం అంటారు

- నాడు సైమన్ కమిషన్‌కు గో బ్యాక్.. నేడు ఎస్ఐఆర్‌కు గో బ్యాక్
- తెలంగాణ ఇచ్చింది రాజకీయ లబ్ధి కోసం కాదు.. ప్రజల ఆత్మగౌరవం కోసం
- బీజేపీలో చేరితే నాయకుడివవుతావన్నారు.. కేసీఆర్‌తో కలిస్తే మంత్రి అవుతావన్నారు
- కాంగ్రెస్‌లో చేరి కేసీఆర్‌ను ఓడించా..
- ఆ పార్టీనే నాకు అన్నీ ఇచ్చింది
- ఎస్ఐఆర్‌తో పేదల ఓటు హక్కును తొలగించే ప్రయత్నం
- అస్సాం దినపత్రిక ప్రతిదిన్ కాన్‌క్లేవ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** మేం ద్రవిడులం.. వాళ్లు ఆర్యులు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మేం హర హర మహాదేవ్ అంటామని, వాళ్లు జై శ్రీరామ్ అంటారని అన్నారు. రామాలయంలో చందా చోరీ జరిగిందని ఆయన ఆరోపించారు. నాడు సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా 'గో బ్యాక్' నినాదం దేశాన్ని ఏకం చేసిందని, నేడు ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా 'ఎస్ఐఆర్ గో బ్యాక్' నినాదంతో దేశం ఏకం కావాల్సిన పరిస్థితి వచ్చిందని రేవంత్‌రెడ్డి అన్నారు. న్యూఢిల్లీలో ప్రతిదిన్ మీడియా నెట్‌వర్క్ నిర్వహించిన 'ది కాంక్లేవ్ 2026'లో 'ఇండియాస్ నెక్ట్స్ చాప్టర్' అంశంపై ఆయన మాట్లాడారు. దక్షిణాది వాళ్లం ద్రవిడులమని, ఉత్తరాది వాళ్లు ఆర్యులని రేవంత్‌రెడ్డి అన్నారు. మేం శివభక్తులమని, వాళ్లు రామభక్తులని వ్యాఖ్యానించారు. మేం హర హర మహాదేవ్ అంటామని, వాళ్లు జై శ్రీరామ్ అంటారని అన్నారు. రామాలయానికి వచ్చిన చందాలో చోరీ జరిగిందని ఆరోపించారు. నాడు సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా మిగతా 2లో..

దేశంలో ప్రస్తుతం నార్త్ వర్సెస్ సౌత్ కాదు.. గుజరాత్ వర్సెస్ దేశం అన్నట్లుగా ఉంది. యూపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మోదీ.. నిధులు మాత్రం గుజరాత్‌కు మళ్లిస్తున్నారు. జనాభా మేరకు సీట్లు పెంచితే పెద్ద రాష్ట్రాలకు మేలు.. చిన్న రాష్ట్రాలకు నష్టం. మేం పేదల వైపు ఉంటే.. భాజపా సంపన్నుల వైపు ఉంది. పేదల ఓటు హక్కు తొలగించేందుకే ఎస్ఐఆర్ తీసుకొచ్చారు. బ్రిటిషర్లు సైమన్ కమిషన్ తెచ్చినట్లు.. ఈసీని మోదీ వాడుకుంటున్నారు. తనకు వ్యతిరేకంగా ఉన్న ఓట్లు తొలగించాలని మోదీ ప్రయత్నిస్తున్నారు. మొత్తం అధికారాలను ఢిల్లీలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు ఇచ్చారు. మరి బీఎల్‌ఏలు, బీఎల్‌వోలు, కలెక్టర్లు ఎందుకు? 'ఎస్ఐఆర్ గో బ్యాక్' అని నినదిస్తూ దేశమంతా ఏకం కావాలి" - సీఎం రేవంత్‌రెడ్డి



# 'ఓటు చోరీ'కి తెరపడితే.. బీజేపీ పాలనకూ తెరపడినట్టే

## ఎన్నికల ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటాన్ని రాహుల్ ముందుండి నడిపిస్తున్నారు


- సీఈసీ, భాజపా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయి
- రాహుల్ గాంధీ తదుపరి ప్రధాని అవుతారు
- తెలంగాణలో రెండోసారీ కాంగ్రెస్ ప్రభుత్వమే
- సాగునీటిపై బీఆర్ఎస్ చేస్తున్నదంతా అసత్య ప్రచారమే
- కష్టకాలంలోనూ కాంగ్రెస్ జెండాను వీడని కార్యకర్తలే పార్టీకి అసలైన బలం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**మిర్యాలగూడ(జనంసాక్షి):** దేశంలో "ఓటు చోరీ"కి తెరపడిన రోజే కేంద్రంలో బీజేపీ పాలన అంతానికి నాంది పలికినట్టేనని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. భారత ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన పోరాటం ఇప్పుడు నిర్ణాయక దశకు చేరుకుందని పేర్కొన్నారు. మిర్యాలగూడలో జరిగిన బహిరంగ సభలో ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ ఎన్నికల వ్యవస్థకు పెను ముప్పుగా మారిన "ఓటు చోరీ"పై రాహుల్ గాంధీ ధైర్యంగా, దృఢసంకల్పంతో ముందుండి పోరాడుతున్నారని చెప్పారు. అధికారాన్ని శాశ్వతం చేసుకోవాలనే ఉద్దేశంతో బీజేపీ ప్రజాస్వామ్య సంస్థలను మిగతా 2లో..

## రాహుల్ గాంధీ హెచ్చరించిన ఓట్ల చోరీ నిజమైంది

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి కాంగ్రెస్ భారీ నిరసన
- ఈసీ కార్యాలయానికి రాజ్యాంగం పుస్తకం పట్టుకొచ్చిన డిప్యూటీ సీఎం భట్టి
- ఖైరతాబాద్ ఉప ఎన్నికలో దిమ్మతిరిగే ఫలితం: దానం నాగేందర్


2లో..



# నేపాల్‌లో మళ్లీ వరదలు

- పొంగి ప్రవహిస్తున్న నదులు..
- మూడు రోజుల్లో 24మంది మృతి

**ఖాట్మండు(జనంసాక్షి):** నేపాల్‌ను మళ్లీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. వారం రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో అనేక ప్రాంతాల్లో వరద పోటెత్తింది. భారీ వర్షాల కారణంగా మూడు రోజుల్లో 24మంది ప్రాణాలు కోల్పోగా.. మిగతా 2లో..

# పేదల భూములు కొల్లగొడితే ఊరుకునేదిలేదు



- బుల్లెట్‌ట్రైన్ ప్రాజెక్టు పేరుతో రియల్‌ఎస్టేట్ దందా కుదరదు
- బహదూర్‌గూడ భూములు ప్రభుత్వానివైతే.. పోలీసుల పహారా ఎందుకు?
- ఇందిరమ్మ రాజ్యం అంటే.. పెద్దల భూములు ముట్టకుండా పేదల భూములు తీసుకోవడమా? : కేటీఆర్

**హైదరాబాద్(జనంసాక్షి):** బహదూర్‌గూడ భూములు ప్రభుత్వానివే అయితే.. పోలీసుల పహారా ఎందుకని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. 420 హామీలు ఇచ్చి.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆయన విమర్శించారు. రైతులకు పట్టాలు ఇస్తామని చెప్పి.. ఇప్పుడు భూములు తీసుకుంటున్నా రని విమర్శించారు. రంగారెడ్డి జిల్లా బహదూర్‌గూడకు చెందిన రైతులతో తెలంగాణ భవన్‌లో ఆయన సమావేశమయ్యారు. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకు భూములు కోల్పోయే రైతులతో మాట్లాడారు."బహదూర్‌గూడ రైతుల సమస్య గతంలో కేసీఆర్ దృష్టికి తెచ్చిఉంటే.. 10 నిమిషాల్లో పరిష్కరించేవారు. ఇందిరమ్మ రాజ్యం అంటే.. పెద్దల భూములు ముట్టకుండా పేదల భూములు తీసుకోవడమా? బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు పేరుతో పేదల భూములు కొల్లగొడితే ఊరుకునేది లేదు. ఈ పేదల తరఫున పోరాడేందుకు బీఆర్ఎస్ ఉంది. భూములు కొనడం.. అమ్మడమే.. రేవంత్‌రెడ్డికి తెలిసిన ఏకైక విద్య. ఫార్మాసిటీకి సేకరించిన భూములను రైతులకు తిరిగి ఇస్తామని గతంలో అన్నారు. మిగతా 2లో..

## భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే
# భూముల రీసర్వే

- ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి
- 120 ఏళ్ళ కింద భూ సర్వే జరిగింది.. మళ్ళీ మేము ఇప్పుడు నిర్వహిస్తున్నాం
- అలసత్వం ప్రదర్శించే అధికారులపై చర్యలు తప్పవు : మంత్రి పొంగులేటి
- ప్రజల అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి: మంత్రి జూపల్లి కృష్ణారావు

**వనపర్తిబ్యూరో(జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియ భూ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపే మార్గమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి ఐడీఓసీ సమావేశ మందిరంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని రెవెన్యూ, గృహ నిర్మాణం, భూముల సర్వే తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తన సహచర మంత్రులైన ఎక్సైజ్, పర్యాటక శాఖ మిగతా 2లో..




## గ్రేటర్ మున్సిపోల్స్, స్థానిక సంస్థల్లో సత్తాచాటాలి

అందుకు తగిన విధంగా సిద్ధం కావాలి

పార్టీ కేడర్‌కు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పిలుపు

**హైదరాబాద్(జనంసాక్షి):** రాబోయే స్థానిక సంస్థలు, జిల్లా, మండల పరిషత్ ఎన్నికల్లో సత్తా చాటాలని.. అందుకు తగిన విధంగా సిద్ధం కావాలని పార్టీ కేడర్‌కు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. రానున్న కాలంలో పార్టీ నేతలు, క్యాడర్ నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేస్తున్నారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఉమ్మడి మహబూబ్‌నగర్, ఉమ్మడి మెదక్ జిల్లాల మిగతా 2లో..



# స్పేస్‌ఎక్స్ అరుదైన ఘనత

తొలిసారి భూకక్ష్యలోకి స్టార్‌షిప్ ప్రయోగం

భూమిచుట్టూ ఆరు సార్లు పరిభ్రమణం చేయనున్న వ్యోమనౌక

చంద్రుడిపై మానవసహిత అంతరిక్షయాత్రకు కీలక ముందడుగు

2లో..

# అమెరికాతో మళ్లీ యుద్ధానికి సిద్ధమే

## ట్రంప్ వ్యాఖ్యలకు ఇరాన్ స్ట్రాంగ్ కౌంటర్..!

**టెహ్రాన్(జనంసాక్షి):** ఇరాన్ శాంతి ప్రణాళికను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించడంతోపాటు బెదిరింపు ధోరణిలో వ్యాఖ్యలు చేయడంతో పశ్చిమాసియా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియని అనిశ్చితి నెలకొన్నది. ఈ క్రమంలో ఇరాన్ కూడా స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. అమెరికాతో తాము అంతిమ యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ అంతర్జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రకటించారు. అమెరికాతో యుద్ధాన్ని తిరిగి ప్రారంభించేందుకు తాము పూర్తి సిద్ధంగా ఉన్నామని, ఒకవేళ అది అంతిమ యుద్ధానికి దారితీసినా తాము ఎదుర్కొంటామని అరాగ్చీ అన్నారు. అదే సమయంలో చర్చలకూ తాము సిద్ధమేనని, ఏది జరగాలన్నది ట్రంప్ చేతిలోనే ఉందని అరాగ్చీ చెప్పారు. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచే ప్రతిపాదనలను ట్రంప్ బహిరంగంగా తిరస్కరించడంపై ఆయన స్పందించారు. ఈ అంశంపై దౌత్యమార్గాల ద్వారా తమకు ఎలాంటి కమ్యూనికేషన్ లేదని చెప్పారు. అక్రమంగా ఫ్రీజ్ చేసిన తమ డబ్బులు, ఆస్తులు తమకు కావాలని అరాగ్చీ డిమాండ్ చేశారు. తమ చమురును తాము అమ్ముకోగలిగే పరిస్థితి ఉండాలన్నారు. ఘర్షణలు మిగతా 2లో..



# హైదరాబాద్‌లో 'బిల్ట్రస్ట్' గ్లోబల్ కేపబిలిటీ సెంటర్

- రూ.450 కోట్ల పెట్టుబడి... కొత్తగా వేయి మందికి ఉద్యోగాలు
- 2,600 మంది బీ2బీ సరఫరాదారులు, 14 మిలియన్ల కొనుగోలు దారులకు సేవలు:మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్(జనంసాక్షి):** జాతీయ, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జీసీసీ) ఏర్పాటుకు హైదరాబాద్‌ను తమ గమ్యస్థానంగా ఎంచుకుంటున్నాయి. తాజాగా ఈ జాబితాలో మిగతా 2లో..




# 'ఎండీఆర్'పై స్టేకు సుప్రీం నో

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దిల్లీ: యూపీఏ లావాదేవీలపై ఎండీఆర్ విధించే అంశంలో కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. అదే సమయంలో ఎండీఆర్ విధింపుపై స్టే విధించేందుకు మిగతా 2లో..

## యూపీఐ ఛార్జీలపై కేంద్రానికి ధర్మాసనం నోటీసులు



తెలంగాణ 'స్థానికత' అంశం..

## నాలుగేళ్ల విద్యాభ్యాసం తప్పనిసరి : సుప్రీం

ఆరో తరగతికి త్రిభాషా విధానం నుంచి

## మినహాయింపు ఇవ్వాలి:సుప్రీం

2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
29.09.2026

# హైదరాబాద్‌లో 'బిల్ట్రస్ట్' గ్లోబల్ కేపబిలిటీ సెంటర్

ప్రముఖ బిజినెస్ టూ బిజినెస్ (బీ2బీ) క్యాష్ జనరేషన్ ప్లాట్‌ఫాం 'బిల్ట్రస్ట్' కూడా చేరింది. మాదాపూర్ రహేజా మైండ్ స్పేస్ లో 40వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.450 కోట్ల పెట్టుబడి అంచనా వ్యయంతో అభివృద్ధి చేసిన 'బిల్ట్రస్ట్ టెక్నాలజీ సెంటర్'ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆనతికాలంలోనే హైదరాబాద్ జీసీసీలకు హబ్ గా మారిందన్నారు. గతేడాది 75 కు పైగా కొత్త జేసీసీలు ఇక్కడ ప్రారంభమయ్యాయని... ఇది దేశంలోనే అత్యధికమని వివరించారు. ఈ ఏడాది 100 జీసీసీలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జీసీసీలను కేవలం బ్యాక్ ఆఫీస్ ఆపరేషన్లకు మాత్రమే పరిమితం చేయకుండా... గ్లోబల్ వాల్యూ సెంటర్లుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. హైదరాబాద్ లో ఏఐ-ఫస్ట్ జీసీసీని ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన 'బిల్ట్రస్ట్'కు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈ సంస్థ 2,600 మంది బీ2బీ సరఫరాదారులు, 14 మిలియన్లకు పైగా కొనుగోలుదారులకు సేవలు అందిస్తోందన్నారు. ఈ సంస్థ గ్లోబల్ ఆపరేషన్స్, టెక్నాలజీ, ఆర్అండ్ డీ విభాగాల అనుసంధానంలో ఈ టెక్నాలజీ సెంటర్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఇక్కడ దశలవారీగా కొత్తగా వేయి మంది హై స్కిల్డ్ వర్క్ ఫోర్స్ కు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. హైదరాబాద్ లో టెక్ ట్యాలెంట్ కు కొదవ లేదని, వారిని పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్రంలోని ప్రముఖ విద్యా సంస్థలు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, టాస్క్, టీ హబ్ తదితర సంస్థలతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని బిల్ట్రస్ట్ ప్రతినిధులను మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. కార్యక్రమంలో బిల్ట్రస్ట్ సీఈఓ గ్రాంట్ హల్లరాన్, ఇండియా జీసీసీ కంట్రీ హెడ్ ఫర్హాద్ హెచ్. బారియా తదితరులు పాల్గొన్నారు.

## 'ఎండీఆర్'పై స్టేకు సుప్రీం నో..

నిరాకరించింది. అక్టోబర్ 15 నుంచి ఎండీఆర్ విధించాలని కేంద్రం నిర్ణయించిన సంగతి తెలిసిందే. రూ.2 వేలు దాటిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్‌ను విధిస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఎండీఆర్‌ను రద్దు చేయాలంటూ న్యాయవాది అంజన్‌దత్తా వ్యాజ్యం వేశారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. నాలుగు వారాల్లో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రంతో పాటు ఆర్‌బీఐ, ఎన్‌పీసీఐకి నోటీసులు జారీ చేసింది. అదే సమయంలో అక్టోబర్ 15 నుంచి అమల్లోకి రాబోయే ఎండీఆర్ ఛార్జీలపై ఎలాంటి మధ్యంతర స్టే విధించలేమని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. ఎండీఆర్ ఛార్జీల వల్ల 96 శాతం వినియోగదారులపై ఎలాంటి ప్రభావం ఉండదని కేంద్రం తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎన్.వెంకటరామన్ విచారణ సందర్భంగా ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.

## నాలుగేళ్ల విద్యాభ్యాసం తప్పనిసరి

న్యూఢిల్లీ(జనంసాక్షి):తెలంగాణ 'స్థానికత' అంశంపై సుప్రీంకోర్టు మరోసారి స్పష్టత ఇచ్చింది. తెలంగాణలో స్థానిక రిజర్వేషన్‌కు నాలుగేళ్ల రూల్ తప్పనిసరి అని తెలిపింది. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం నడుచుకోవాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. గతంలో జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ఇచ్చిన తీర్పును పునరుద్ఘాటించింది. తెలంగాణ స్థానిక రిజర్వేషన్‌కు నాలుగేళ్ల విద్యాభ్యాసం తప్పనిసరి నిబంధనను సవాల్ చేస్తూ జెల్ల అంకిత దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. నిబంధన ఏకపక్షంగా ఉందన్న వాదనను జస్టిస్ పీఎస్ నరసింహ ధర్మాసనం కొట్టివేసింది. ఎంబీబీఎస్ అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో విద్యాభ్యాసం చేస్తేనే స్థానికత వర్తిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో గతంలో తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవోను మరోసారి సమర్థించింది.

## ఆరో తరగతికి త్రిభాషా విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలి

న్యూఢిల్లీ(జనంసాక్షి):సీబీఎస్ఈ బోర్డు పరిధిలో ప్రస్తుతం 6వ తరగతి చదువుతున్న విద్యార్థులకు త్రిభాషా విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలని సుప్రీం కోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. ఈ ఏడాది 7, 8, 9వ తరగతి విద్యార్థులకు కల్పించినట్లుగానే ఈ విధానం నుంచి ఆరో తరగతికి కూడా మినహాయింపు ఇవ్వాలని ఆదేశించింది. 2027 ఏప్రిల్ 1 నుంచి త్రిభాషా విధానాన్ని అమలు చేయాలని సూచించింది. సీబీఎస్ఈ త్రిభాషా విధానంలోని అంశాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలు జారీ చేసింది. అకస్మాత్తుగా సీబీఎస్ఈ భాషా విధానం మార్చడంపై సుప్రీం కోర్టు పలు ప్రశ్నలు లేవనెత్తింది. ఇప్పటికే ఇతర భాషలు ఎంచుకున్న విద్యార్థులు మధ్యలో మరో భాషకు మారాలంటే ఇబ్బంది పడే అవకాశం ఉందని అభిప్రాయపడింది.

## బస్సులు, పార్క్‌లను ప్రమాదకర జోన్లుగా ఎలా ప్రకటించగలం?

**అత్యాచార ఘటనలపై సుప్రీంకోర్టు**

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశ రాజధాని దిల్లీ, దాని పరిసర ప్రాంతాల్లో ఇటీవల కాలంలో వెలుగుచూసిన సామూహిక అత్యాచార ఘటనలపై సోమవారం సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. ఈ ఘటనలను సర్వోన్నత న్యాయస్థానం సుమోటోగా విచారణకు తీసుకుని.. కీలక వ్యాఖ్యలు చేసింది. ఆస్తాకుంజ్ పార్క్‌లో, స్వరూప్ నగర్‌లో, గ్రేటర్ నోయిడా నుంచి దిల్లీ వెళ్తున్న బస్సులో గ్యాంగ్‌రేప్ ఘటనలు వెలుగుచూశాయి. ఈ వరుస ఘటనలతో దేశ రాజధాని ఉలిక్కిపడింది. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు సుమోటోగా విచారణను ప్రారంభించింది. "2012 నాటి నిర్భయ కేసుతో పోలిక తీసుకురాకుండా ఉండలేకపోతున్నాం. ఆ కేసు నుంచి ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ప్రజాభద్రతకు హామీ ఉన్నప్పటికీ, గౌరవంగా జీవించే హక్కును రాజ్యాంగం ప్రసాదించినప్పటికీ.. ఈ లైంగికదాడులు జరుగుతూనే ఉన్నాయి పెట్రోలింగ్, నిఘా సరిగాలేదని చెప్పి.. రోడ్లు, బస్సులు, మెట్రో స్టేషన్లు, సబ్‌వేలు, పార్క్‌ల వంటివాటిని అధిక ప్రమాద జోన్లుగా ప్రకటించలేం" అని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆస్తాకుంజ్ ఘటనలో లైంగిక వేధింపులపై విద్యార్థినుల నుంచి ఫిర్యాదులు వచ్చినప్పటికీ పట్టించుకోలేదంటూ వచ్చిన వార్తా కథనాన్ని ఈ సందర్భంగా కోర్టు ప్రస్తావించింది.

# మేం ద్రవిడులం.. వాళ్లు ఆర్యులు




దేశవ్యాప్తంగా 'సైమన్ గో బ్యాక్' ఉద్యమం సాగిందని, నేడు ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో ఓటు హక్కును తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపిస్తూ 'ఎస్ఐఆర్ గో బ్యాక్' నినాదం ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చిందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల సంఘం తీరుపై తీవ్ర విమర్శలు చేసిన రేవంత్‌రెడ్డి, ఓటర్ల జాబితాల నుంచి భారీగా ఓట్లు తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఇది కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన సమస్య కాదని, దేశ ప్రజాస్వామ్యానికి సంబంధించిన సమస్య అని అన్నారు. తెలంగాణను సోనియాగాంధీ ప్రజల ఆత్మగౌరవం కోసం ఇచ్చారని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అందుకే తాను బీజేపీలో కాకుండా కాంగ్రెస్‌లో చేరానని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కాంగ్రెస్‌కు రాజకీయంగా నష్టం జరిగినా, ప్రజల ఆకాంక్షలను గౌరవించి రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పనకు తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు అందిస్తున్నామని చెప్పారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాదిరాష్ట్రాలకు అన్యాయం జరగకుండా ప్రస్తుత స్థానాలను మరికొంత కాలం కొనసాగించాలని కోరారు. జనాభా నియంత్రణను పాటించిన దక్షిణాది రాష్ట్రాలు భవిష్యత్తులో రాజకీయ ప్రాతినిధ్యం కోల్పోకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు సమానంగా అభివృద్ధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, నాడు సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా వచ్చిన 'గో బ్యాక్' నినాదం తరహాలోనే నేడు 'ఎస్ఐఆర్ గో బ్యాక్' నినాదం వినిపించాలని అన్నారు.

## భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే భూముల రీసర్వే

మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి హాజరై సమీక్షించారు. ఈ సమావేశంలో మహబూబ్నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి లోకేష్ కుమార్, రిజిస్ట్రేషన్లు, స్టాంప్స్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ఎండీ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉమ్మడి జిల్లాలోని మండలాల వారీగా భూముల రీ సర్వే ప్రక్రియపై తహసిల్దార్లు, సర్వేయర్లతో ఒక్కొక్కరిగా సమీక్షించి, పురోగతిపై ఆరా తీశారు. అదేవిధంగా సర్వే ప్రక్రియపై రైతుల నుంచి వ్యక్తమవుతున్న అనుభవాలపై ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దాదాపు 120 ఏళ్ల క్రితం భూముల సర్వే నిర్వహించారని, మళ్లీ ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించాలనే లక్ష్యంతో సమగ్ర రీసర్వే ప్రక్రియను చేపట్టిందని తెలిపారు. ఈ ప్రక్రియను అధికారులు అత్యంత ప్రాధాన్యతతో, పూర్తి బాధ్యతతో నిర్వహించాలని ఆదేశించారు. భూముల రీసర్వే ద్వారా భూముల హద్దులు, యాజమాన్యానికి సంబంధించిన సమస్యలతో పాటు సాదా బైనామా వంటి దీర్ఘకాలిక సమస్యలకు కూడా పరిష్కారం లభించే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో రీసర్వేను పకడ్బందీగా నిర్వహించి ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో తొలి దశలో రీసర్వే ప్రక్రియ చేయడంతో పాటుగా, రాష్ట్రంలోని 413 నక్షాలో లేని గ్రామాలను సైతం రిసర్వే నిర్వహిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ముందుగా గ్రామాల సరిహద్దులను పక్కాగా నిర్ధారించుకుని, ఆ తర్వాత భూముల సర్వేను పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. తహసీల్దార్ స్థాయి నుంచి జిల్లా కలెక్టర్ వరకు అధికారులందరూ క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే ప్రక్రియను తప్పనిసరిగా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. రీసర్వే కోసం ఆధునిక రోవర్లను అన్ని జిల్లాలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. నిర్దేశిత ప్రణాళిక ప్రకారం, నాణ్యతతో రీసర్వే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని, నవంబర్ 15వ తేదీలోపు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే విషయంలో అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అటవీ అధికారులు భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలి. రీసర్వే ప్రక్రియకు సంబంధించి రైతులకు ఎప్పటికప్పుడు సమగ్ర సమాచారాన్ని అందించాలని, సర్వే విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఏవైనా సందేహాలు ఉంటే క్షేత్రస్థాయిలోనే వాటిని నివృత్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినా, అవినీతికి పాల్పడినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో రీసర్వే ప్రక్రియ ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకు అనుగుణంగా అధికారులు రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. లైసెన్స్డ్ సర్వేయర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీకి మించి ఎకరానికి రూ.60 చొప్పున చెల్లిస్తున్నామని, ప్రతి 15 రోజులకు ఒకసారి చెల్లింపులు చేస్తున్నామని తెలిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చే అర్జీలను జిల్లా అధికారులు క్రమబద్ధమైన విధానంలో పరిశీలించి పరిష్కార మార్గాలు చూపాలని సూచించారు. ప్రతి నెలలో ఒక్కో మండలానికి ఒక రోజును కేటాయించి, ఆ మండలానికి సంబంధించిన ప్రజా సమస్యలపై సమీక్ష నిర్వహించాలని తెలిపారు. సాధ్యమైన సమస్య లను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకో వాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్య లు, అర్జీల స్వీకరణ కోసం ప్రత్యేక వాట్సాప్ నంబ ర్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు తెలియజేయాలని అన్నారు.

## అమెరికాతో మళ్లీ యుద్ధానికి సిద్ధమే

తగ్గించేలా చర్చలతో పరిష్కారాలు ఉండాలని అభిప్రాయపడ్డారు. అలాంటప్పుడు తాము హర్మూజ్‌ను తెరిచేందుకు సుముఖంగానే ఉంటామని అరాగ్చీ పేర్కొన్నారు. అమెరికాకు చెందిన కింగ్‌ఫిష్ డ్రోన్ గూఢచర్యానికి పాల్పడుతోందని, దానిని తాము స్వాధీనం చేసుకున్నామని ఇరాన్ ప్రకటించింది.

## స్పేస్‌ఎక్స్ అరుదైన ఘనత

వాషింగ్టన్(జనంసాక్షి):ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన 'స్పేస్‌ఎక్స్' సంస్థ కీలక అంతరిక్ష ప్రయోగం చేపట్టింది. తన భారీ రాకెట్ 'స్టార్‌షిప్'ను తొలిసారి భూకక్ష్య దిశగా ప్రయోగించింది. స్టార్‌లింక్‌కు సంబంధించిన 26 ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టడంతోపాటు భూమి చుట్టూ రాకెట్ ఆరు చక్కర్లు కొట్టేలా ఈ ప్రయోగాన్ని చేపట్టింది. చంద్రుడిపై మానవసహిత యాత్రకు 'నాసా' సిద్ధమవుతున్న వేళ.. ఈ ప్రయోగం కీలక ప్రాధాన్యం సంతరించుకుంది. భారత కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం అమెరికాలోని టెక్సాస్ తీరం నుంచి 'స్టార్‌షిప్' నింగిలోకి దూసుకెళ్లింది. కాసేపటికే వ్యోమనౌక నుంచి సూపర్ హెవీ బూస్టర్ విడిపోయింది. అనంతరం రాకెట్ భూకక్ష్యవైపు తన ప్రయాణాన్ని కొనసాగించింది. దాదాపు 10 గంటలపాటు ఈ ప్రయోగం కొనసాగే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా.. మూడేళ్లలో ఇది 14వ స్టార్‌షిప్ ప్రయోగం. దీనికి ముందు జరిగిన ప్రయోగాల్లో భాగంగా స్టార్‌షిప్.. హిందూ మహాసముద్రం వరకే పరిమితమైంది.

## నేపాల్‌లో మళ్లీ వరదలు

15మందికి పైగా గల్లంతయ్యారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో అటవీ ప్రాంతాలలోని అనేక నివాసాలు నేలమట్టమయ్యాయి. రోడ్లు, వంతెనలు, ఇతర మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఒక వీడియోలో ఇళ్లకు సమీపంలో ఉన్న కొండచరియలలోని సగభాగం క్షణాల్లో కూలిపోయిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. అనేక గ్రామాలను వరదలు ముంచెత్తుతుండడంతో వందలాది మంది ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

**పొంగి ప్రవహిస్తున్న నదులు..**

వర్షాల వల్ల నేపాల్‌లోని కాళి, గండకి, నారాయణి, టినౌ నదులు పొంగి ప్రవహిస్తున్నట్లు నేపాల్ జాతీయ విపత్తు ప్రమాద తగ్గింపు, నిర్వహణ సంస్థ వెల్లడించింది. సున్ కోశి, బుధి గండకి, మహాకాళి నదులలో నీటి మట్టాలు హెచ్చరిక స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. దీంతో మధ్య, పశ్చిమ, తూర్పు ప్రాంతాల ప్రజలకు అధికారులు వరద హెచ్చరికలు జారీ చేశారు. ప్రభావిత ప్రాంతాలలో వందలాది ఇళ్లు దెబ్బతిన్నాయని.. సుమారు 1,500 మంది ప్రజలు నిరాశ్రయులయ్యారని అధికారులు పేర్కొన్నారు. వంతెనలు కొట్టుకుపోవడంతో పలు ప్రాంతాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కాళీ గండకీ నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండడంతో స్యాంగ్జాలోని బెల్తారీలో ఉన్న 144-మెగావాట్ల జలవిద్యుత్ ప్రాజెక్టుకు చెందిన మిర్మీ డ్యామ్ మూడు గేట్లను పూర్తిగా ఎత్తేశారు. విద్యుత్ ఉత్పత్తిని నిలిపేశారు.

## ఢిల్లీకి పొంచిఉన్న కాలుష్యముప్పు

**పార్కింగ్ ఛార్జీలు రెట్టింపు..**

**ఉద్యోగులకు వర్క్‌ఫ్రమ్‌హోమ్..!**

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఏటా శీతాకాలం వస్తోందంటే చాలు.. దేశ రాజధాని దిల్లీ నగరం ఉక్కిరిబిక్కిరవుతుంది! పొగమంచు తీవ్రతకు ఎదురుగా ఉన్న వాహనాలు కనిపించవు. కాలుష్య తీవ్రతకు శ్వాససంబంధిత సమస్యలతో ఆసుపత్రుల్లో చేరేవారి సంఖ్య పెరిగిపోతుంటుంది. ఈ నేపథ్యంలో ఈసారి కాలుష్య ప్రభావాన్ని కట్టడి చేసేందుకు దిల్లీ ప్రభుత్వం ముందుగానే ప్రణాళికను సిద్ధం చేసింది. దానిలో భాగంగా పలు సూచనలు చేసిన దిల్లీ ప్రభుత్వం.. నవంబర్ 1 నుంచే వీటిని అమలు చేయనున్నట్లు ప్రకటించింది. నవంబర్ ఒకటి నుంచి ఆయా సంస్థలు.. ఆఫీసుకువచ్చి పనిచేసే సిబ్బందిని సగానికి తగ్గించి, వారికి ఇంటినుంచి పనిని అప్పగించనున్నాయి. నవంబర్ ఒకటి నుంచి ఫిబ్రవరి 28 వరకు ఈ నిబంధన అమల్లో ఉంటుంది. వాహనాల నుంచి వెలువడే ఉద్గారాలు, పంజాబ్, హరియాణా సహా పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగలబెట్టడం, నిర్మాణ కార్యకలాపాల వల్ల గాల్లోకి లేచే దుమ్ము , ధూళీ దిల్లీలో కాలుష్యానికి కారణమవుతున్నాయి వాటితోపాటు పరిశ్రమల నుంచి వెలువడే పొగ, హానికారక వాయువులు, దీపావళి సమయంలో బాణసంచా కాల్చడం, శీతాకాలంలో ఉష్ణోగ్రతలు తగ్గడం వంటివి కొన్నినెలల పాటు ఆ నగరవాసుల్ని ఊపిరాడనీయకుండా చేస్తాయి.



# 'ఓటు చోరీ'కి తెరపడితే.. బీజేపీ పాలనకూ తెరపడినట్టే

బలహీనపరుస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసమున్న ప్రతి పౌరుడు, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త రాహుల్ గాంధీ నాయకత్వంలో సాగుతున్న ఈ పోరాటంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఎన్ని ఎన్నికల ఎదురుదెబ్బలు తగిలినా, ఎన్ని రాజకీయ సవాళ్లు ఎదురైనా దేశంలోని మారుమూల గ్రామాల వరకు కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీపై అచంచల విశ్వాసంతో నిలిచారని ఉత్తమ్ కొనియాడారు. వారి చెమట, కష్టం, త్యాగాల పునాదులపైనే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. మిర్యాలగూడ వంటి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ఘన విజయాలు అందించిన కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు. తెలంగాణలో, ముఖ్యంగా ఉమ్మడి నల్గొండ జిల్లాలో కాంగ్రెస్‌కు ప్రజలు ఎప్పుడూ బలమైన విజయాలను అందించారని గుర్తుచేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంపై దేశ ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉందని, ఆయన తదుపరి ప్రధానమంత్రి కావాలని దేశం కోరుకుంటోందని చెప్పారు. "రాహుల్ గాంధీ భారత తదుపరి ప్రధానమంత్రి అవుతారు. తెలంగాణలోనూ కాంగ్రెస్ వరుసగా రెండోసారి అధికారంలోకి రావడం ఖాయం" అని ఉత్తమ్ ధీమా వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోని నియోజకవర్గాల నుంచే తాను ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికయ్యానని గుర్తు చేశారు. సాగునీటి విషయంలో తనపై బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, రాజకీయ దురుద్దేశంతోనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్రల్లోనూ నైరుతి రుతుపవనాలు బలహీనపడి వర్షపాతం, జల లభ్యత తగ్గాయని వివరించారు. క్లిష్ట పరిస్థితులు ఉన్నప్పటికీ నాగార్జునసాగర్ జలాలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత జాగ్రత్తగా వినియోగిస్తోందన్నారు. రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకోవడంతో పాటు వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా అవసరమైన నిల్వలను కాపాడుతున్నామని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పంపిణీ చేసిన ముతక బియ్యాన్ని చాలా మంది లబ్ధిదారులు వినియోగించకపోవడంతో అది అక్రమ మార్కెట్‌కు తరలిపోయేదని ఉత్తమ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పరిస్థితిని పూర్తిగా మార్చిందన్నారు. రాష్ట్రంలోని దాదాపు 3.42 కోట్ల మంది లబ్ధిదారులకు ప్రతి వ్యక్తికి నెలకు ఆరు కిలోల చొప్పున ఉచితంగా సన్నబియ్యం అందిస్తూ ప్రజాపంపిణీ వ్యవస్థలో విప్లవాత్మక మార్పు తీసుకొచ్చామని చెప్పారు. నాగార్జునసాగం మిర్యాలగూడ ప్రాంతంలో కొనసాగుతున్న ఆరు ఎత్తిపోతల పథకాలను ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం అదనపు నిధులు కేటాయించిందని తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని 2028 జూన్ నాటికి పూర్తి చేసి ఉమ్మడి నల్గొండ జిల్లాలోని లక్షలాది ఎకరాలకు సాగునీరు అందిస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు.

## 'రాహుల్ గాంధీ హెచ్చరించిన ఓట్ల చోరీ నిజమైంది'

హైదరాబాద్(జనంసాక్షి): దేశంలో గత కొన్నేళ్లుగా కుట్రపూరితంగా పౌరుల ఓటు హక్కును కాలరాస్తూ 'ఓట్ల చోరీ' జరుగుతోందని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పదే పదే చేసిన హెచ్చరికలు నేడు నిజమని తేలిపోయాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ (సావెఖీ) పేరుతో పౌరుల ఓట్లను తొలగిస్తున్న తీరుపై ఇతర కమిషనర్లే స్వయంగా అంగీకరించడం దేశ ప్రజాస్వామ్యానికి పట్టిన దురదృష్టకర పరిణామమని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సిఈసి) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ఏఐసీసీ పిలుపునిచ్చిన నేపథ్యంలో, టీపీసీసీ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని బిఆర్‌కే భవన్ వద్ద ఉన్న రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ శ్రేణులు భారీ నిరసన ప్రదర్శన చేపట్టాయి. ఈ కార్యక్రమంలో చేతిలో భారత రాజ్యాంగ ప్రతిని పట్టుకుని పాల్గొన్న భట్టి విక్రమార్క, ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ పునరంకితమై ఉందని చాటారు. అనంతరం పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మరియు మాజీ ఎంపీ అజారుద్దీన్‌లతో కలిసి ఆయన ఎన్నికల కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.?ఈ సందర్భంగా మీడియాతో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, దేశంలో రాజ్యాంగాన్ని, పౌరుల ఓటు హక్కును కాపాడటానికి రాహుల్ గాంధీ మొదటి నుంచీ పోరాడుతున్నారని ప్రత్యేకంగా గుర్తుచేశారు. ఓట్ల చోరీపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను నేడు స్వయంగా ఎన్నికల కమిషనర్లే ఒప్పుకోవాల్సి వచ్చిందని, ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువైన ఓటు హక్కునే కాలరాస్తే ఇక ఈ దేశంలో ప్రజాస్వామ్యం ఎక్కడ ఉందని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని విశ్వసించే రాజకీయ పార్టీలన్నీ విభేదాలను పక్కనపెట్టి కాంగ్రెస్‌తో చేతులు కలపాలని, రాజ్యాంగంపై నమ్మకం లేని వారు మాత్రమే ఈ ఉద్యమానికి దూరంగా ఉంటున్నారని విమర్శించారు. భారత ప్రజాస్వామ్యంపై, పౌరుల హక్కులపై కాంగ్రెస్‌కు సంపూర్ణ విశ్వాసం ఉందన్న ఆయన, ప్రతీ పౌరుడికీ వారి ఓటు హక్కు దక్కేంత వరకు పోరాటాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు.

**ఖైరతాబాద్ ఉప ఎన్నికలో దిమ్మతిరిగే ఫలితం: దానం నాగేందర్**

హైదరాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రభావం ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఉండదని మాజీ మంత్రి దానం నాగేందర్ అన్నారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలంటూ నెక్లెస్ రోడ్డులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో దానం నాగేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. "ఖైరతాబాద్ ఉప ఎన్నికలో దిమ్మతిరిగే ఫలితం వస్తుంది. ఎవడు కొడితే మైండ్ బ్లాక్ అవుతుందో అలా ఉంటుంది. ఈసీని అడ్డుపెట్టుకొని భాజపా ఓటు చోరీ చేస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు చోరీతోనే కిషన్‌రెడ్డి గెలిచారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలి. 'సర్' లోపాల అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవాలి"అని దానం అన్నారు.

## పేదల భూములు కొల్లగొడితే ఊరుకునేది లేదు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఫార్మాసిటీ భూములు తిరిగి ఎందుకు ఇవ్వలేదు?" అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

**పట్టాలివ్వకపోతే ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ రాళ్లతో కొట్టుమన్నడు.. రైతులతో కేటీఆర్**

బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్‌లో భూములు కోల్పోతున్న బహదూర్‌పల్లి రైతులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ఏమన్నాడు.. మీకు పట్టాలివ్వకపోతే రాళ్లతో కొట్టుమన్నడు. రేవంత్ రెడ్డి ఏమో ఎమ్మెల్యేలు పార్టీ మారితే రాళ్లతో కొట్టుమన్నడు. రైతుల భూములకు పట్టాలు ఇవ్వకపోతే రాళ్లతో కొట్టమని అన్నాడు. మరి ఇప్పుడు ఎవరిని కొట్టాలే.. రేవంత్ రెడ్డిని రాళ్లతో కొట్టాలా.. ప్రకాశ్ గౌడ్‌ను కొట్టాల్నా అని కేటీఆర్ అడిగారు. మీ ఇండ్ల మీదికి ఏదో పక్క దేశం మీద దండయాత్రకు పోయినట్టు 4వేల మంది పోలీసోళ్లను పంపిండు. నిజంగా నీతి, నిజాయితీ ఉంటే నీ దగ్గర, ప్రభుత్వం దగ్గర కాగితాలుంటాయి. 4 వేల మంది పోలీసులను పంపే అవసరం ఏముందని ప్రశ్నించారు. నిజంగా గవర్నమెంట్ దగ్గర కాగితాలుంటే భూమి వాళ్లదే అనే మాట వాజీబు అయితే అంతమంది పోలీసులను పంపుతావ్ అని ఫైర్ అయ్యారు. బుల్లెట్ ట్రైన్ విషయంలో మనకేం ఎలాంటి వ్యతిరేకత లేదు.. బుల్లెట్ ట్రైన్ రావాల్సిందే.. వచ్చేటప్పుడు వస్తది.. కానీ ఆ పేరు మీద రియల్ ఎస్టేట్ దందా చేస్తే ఊరుకునేది లేదని కేటీఆర్ హెచ్చరించారు. మీకు పక్కాగానేను పార్టీ తరఫున ఇచ్చే మాట సంవత్సరమున్న తర్వాత కేసీఆర్ వస్తారు. మీ అందరి దయతోని వస్తడు.. మీకు మీ పట్టాలు మీకిచ్చి మీ బహదూర్‌గూడలోనే మీటింగ్ పెట్టి ఇదే కార్తీక్ రెడ్డి ఎమ్మెల్యేగా మీకు పట్టాలిస్తడు.. ఏ కార్తీక్ రెడ్డి అయితే ఇవాళ హైకోర్టుకు పోయి మీకు న్యాయం చేసిండో.. ఇదే కార్తీక్ రెడ్డి చేతుల మీదుగా మీకు పట్టాలిప్పించే బాధ్యత నాదన్నారు.

## గ్రేటర్ మున్సిపోల్స్, స్థానిక సంస్థల్లో సత్తాచాటాలి

నేతలతో భేటీ అయ్యారు. గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, గ్రేటర్ వరంగల్, ఖమ్మం కార్పొరేషన్‌లు, సిద్దిపేట సహా ఇతర మున్సిపాలిటీల్లో పోటీ చేసి సత్తా చాటాలని నేతలకు సూచించారు. నిజామాబాద్, కొడంగల్‌లో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలకు సంబంధించి ప్రజల నుంచి ఎలాంటి ఫీడ్ బ్యాక్ వచ్చిందో అడిగి తెలుసుకున్నారు. ప్రధాన ప్రతిపక్షంగా టీఆర్ఎస్ ఎలాంటి పాత్ర పోషించాలని ప్రజలు కోరుకుంటున్నారు, ఇంకా ఎలాంటి కార్యక్రమాలు ఉంటే బాగుంటుందని భావిస్తున్నారో ఆ దిశలోనే పయనిద్దామని సూచించారు. టీఆర్ఎస్ చేస్తున్న పోరాటాలతోనే ప్రభుత్వంలో కదలిక వస్తుందని కవిత చెప్పారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో అగ్ని ప్రమాదం జరిగి ఐదుగురు చిన్నారులు మృతి చెందిన ఘటనలో తెలంగాణ రక్షణ సేన స్పందించిన తీరుతోనే ప్రభుత్వం దిగివచ్చిందని గుర్తు చేశారు. ఏళ్లకేళ్లుగా రిమ్స్ హాస్పిటల్ ను పట్టించుకోని ప్రభుత్వం తక్షణ చర్యల కోసం రూ.11 కోట్లు రిలీజ్ చేసిందని చెప్పారు. రిమ్స్ హాస్పిటల్ సమస్యలపై రివ్యూ చేసి చేపట్టాల్సిన పనులపై కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారన్నారు. తాను ఆస్పత్రిని విజిట్ చేసి బాధిత కుటుంబాలను పరామర్శించి అండగా నిలిచిన తర్వాతనే ప్రభుత్వం దిగివచ్చి మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించిందన్నారు. కాగా.. గ్రేటర్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో త్వరలోనే హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారుప్రభుత్వం తీరుతో విద్యార్థులకు నష్టంప్రభుత్వం తీరుతో తెలంగాణ మెడికల్ విద్యార్థులకు నష్టం జరుగుతున్నదని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తెచ్చిన జీవో కారణంగా తెలంగాణ బిడ్డలు రక్షణలు కోల్పోయే ప్రమాదం ఉన్నదని పేర్కొన్నారు. ఈ విపత్తుకు వ్యతిరేకంగా తెలంగాణ సమాజమంతా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మెడికల్ సీట్లకు సంబంధించి స్థానికత అంశంలో ప్రభుత్వ నిర్ణయం కారణంగా మన పిల్లలకు నష్టం జరుగుతున్నదని.. ఇతర రాష్ట్రాల పిల్లలకు మేలు జరుగుతుందని తెలిపారు. అలాంటి ఈ అంశాన్ని సరిదిద్దుకోవాల్సింది పోయి.. సుప్రీంకోర్టులో ఈ అంశాన్ని ప్రభుత్వం డిఫెండ్ చేస్తున్నదని పేర్కొనారు. మొదట జీవో 33 ఇచ్చారని.. దాన్ని ఎక్స్‌టెన్డ్ చేస్తూ జీవో 150 తెచ్చారని పేర్కొన్నారు. 1 వ తరగతి నుంచి 7 వ తరగతి వరకు ఇక్కడ చదువుకున్న వాళ్లను స్థానికులుగా భావించాలని.. కానీ, 8 నుంచి 12వ తరగతి వరకు చదువుకున్న వాళ్లు లోకల్ అనేలా జీవో తెచ్చారని ఆరోపించారు. దీన్ని కచ్చితంగా ప్రశ్నించాలని.. ఇప్పుడు మెడికల్ సీట్ల వరకే ఉన్న ఈ జీవోను అన్ని రంగాల్లోకి తెస్తారని చెప్పారు.

# 91 కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురి అరెస్ట్.....



**ఆత్మకూరు, సెప్టెంబర్ 28, (జనం సాక్షి):** ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గూడెప్పాడు క్రాస్ రోడ్ వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీల్లో సుమారు రూ.45.66 లక్షల విలువైన 91 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఆత్మకూరు సీఐ జి. బాబూలాల్ తెలిపారు. ఆదివారం ఆత్మకూర్ ఎస్ఐ పి. తిరుపతి తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురిని తనిఖీ చేయగా వారి వద్ద గంజాయి లభ్యమైంది. నిందితులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వెలుగూరి తాతారావు (28), కిలో గోపాల్ రావు (29), కిలో సతీబాబు (21)లుగా గుర్తించారు. వారి నుంచి గంజాయితో పాటు 2 స్మార్ట్ ఫోన్లు, 1 కీప్యాడ్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఎన్‌డిపిఎస్ కింద కేసు నమోదు చేసి, సోమవారం పరకాల కోర్టులో రిమాండ్ చేసినట్లు ఆత్మకూరు సిఐ పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ పి. తిరుపతితో పాటు కానిస్టేబుళ్లు అనిల్ కుమార్, కరణ్, శ్రీనివాస్ ప్రసాద్, హోంగార్డ్ కరుణాకర్ పాల్గొన్నారు.

# నస్పూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- స్పాట్లోనే ఇద్దరు మృతి
- ఆరుగురు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలింపు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో ఇద్దరి మృతి











**నస్పూర్ (జనంసాక్షి):** మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మహిళలు మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం..మందమర్రి మండలం గుడిపల్లి పొన్నారం గ్రామానికి చెందిన మహిళలు సోమవారం ఉదయం ఆటోలో మంచిర్యాలకు బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న ఆటో నస్పూర్ గేట్ మూలమలుపు వద్దకు రాగానే అదుపు తప్పింది దీంతో శ్రీరాంపూర్ వైపు వెళుతున్న లారీ ఆటోను ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు మహిళలతో పాటు డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో అగ్గు సౌందర్య (38) చింతకుంట్ల లక్ష్మి (27) అక్కడికక్కడే మృతి ఒడిలోకి చేరుకోగా తీవ్రంగా గాయపడ్డ ఆరుగురు క్షతగాత్రులను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తోగరి సుమలత (25) తోటపల్లి సోనీ (24)లు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పరిస్థితి విషమంగా ఉన్న ఆటో డ్రైవర్ సేగ్గం ప్రశాంత్, సల్లూరి అనూష లను మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ కు తరలించారు. మరో ఇద్దరు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటన విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో ఆసుపత్రికి చేరుకున్నారు. మృతదేహాలపై పడి రోధించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. కుటుంబ సభ్యులు బంధువుల అర్ధనాదాలతో ఆసుపత్రి ప్రాంగణం మారుమోగింది. ప్రమాదానికి గురైన వారంతా మంచిర్యాల పట్టణంలోనీ పలు ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్నారు. తమ పనుల కోసం ఆటోలో మంచిర్యాలకు వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాద స్థలాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డిసిపి ఎగ్గడి భాస్కర్, ఏసీపి ప్రకాష్ సందర్శించి ప్రమాదానికి కారణాలను సిపి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. రోడ్డు ప్రమాదంపై మంత్రి గడ్డం వివేక్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వీరంతా తన నియోజకవర్గానికి చెందిన వారు కావడంతో కుటుంబాలకు తక్షణసాయంగా 25 వేలు, గాయపడ్డ వారికి 10వేలు అందిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు సిసిసి నస్పూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఖాతా రామచంద్రారెడ్డి సంస్మకరణ సభను అడ్డుకోవడం అప్రజాస్వామ్యం

**పౌరహక్కుల సంఘం రాష్ట్ర గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నారాయణరావు**

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఖాతా రామచంద్రారెడ్డి సంస్మకరణ సభను అడ్డుకోవడం అప్రజాస్వామ్యమని పౌరహక్కుల సంఘం రాష్ట్ర గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నారాయణరావు ఖండిం చారు. ఛత్తీస్‌గడ్‌లోని నారాయణపూర్ జిల్లా అబుజ్మడ్ అటవీ ప్రాంతంలో గతేడాది సెప్టెంబర్ 22న మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు ఖాతా రామచంద్రారెడ్డి (63) (రాజుదాదా, ఊసెండి, వికల్ప్)తో పాటు మరో కేంద్ర కమిటీ సభ్యుడు కాదరి సత్యనారాయణ రెడ్డి (కోస)లను ఎన్ కౌంటర్లో హత్యచేసి ఏడాది కావస్తున్న నేపథ్యంలో రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు వారి స్వగ్రామం తీగలకుంటపల్లిలో 27 సెప్టెంబర్ 2026న సంస్మకరణ సభ నిర్వహణ జరుపుకోవాలని ప్రయత్నం చేయడంతో, ప్రభుత్వం అనుమతి లేదని సభను జరుపుకోనీయకుండా అడ్డుపడిందని, 10 సెప్టెంబర్ 2025న నిరాయుధులుగా ఉన్న ఖాతా రామచంద్రారెడ్డి, కాదరి సత్యనారాయణ రెడ్డి లలో ఒకరిని రాయపూర్లో, మరొకరిని బిలాస్పూర్లో పట్టుకొని 10 రోజుల పాటు తీవ్ర చిత్రహింసలకు గురి చేసి 22 సెప్టెంబరన్ 2025న ఎన్ కౌంటర్లో మరణించినట్లుగా ప్రభుత్వం ప్రకటించిందని, రామచంద్రారెడ్డి కుటుంబం వారి ప్రమేయం లేకుండానే జరిగిన పోస్టుమార్టంను పరిగణలోకి తీసుకోకుండా రీ–పోస్టుమార్టం కోసం సుప్రీంకోర్టు వరకు వెళ్ళినప్పటికి న్యాయస్థానం ఇబ్బందికరమైన వ్యాఖ్యలు చేయడం, రీ–పోస్టుమార్టంకు అనుమతి ఇవ్వకపోవడంతో అప్పటికే చనిపోయి 20 రోజులు అవుతున్న స్థితిలో శవం పూర్తిగా పురుగులు పట్టిందని, అయినప్పటికి న్యాయపోరాటానికి మరింత అవకాశం లేకపోవడంతో శవాన్ని తీసుకువచ్చి దహన సంస్కారాలు చేశారని, ఇలా ఎన్ కౌంటర్ పేరుతో బతికిఉన్న వాళ్లను పట్టుకొని చిత్రహింసలు పెట్టి కాల్చి చంపి ఎన్ కౌంటర్ ప్రకటించడం ప్రభుత్వాలు చేస్తున్న రాజ్యాంగ ఉల్లంఘనలు ఒక వైపు. మరొక వైపు న్యాయస్థానాలు కూడా బాధితుల పక్షాన నిలబడకపోవడం మరొక ఉల్లంఘన. చివరికి నిన్న కుటుంబ సభ్యులు తలపెట్టిన సంస్మరణ సభకు కూడా అనుమతీయకపోవడం మొత్తం సభా హక్కును కూడా ఉ ల్లంఘించినట్లేనని తెలిపారు. ఒకవైపు ఈ ఎన్ కౌంటర్లో ఇద్దరు మరణించినప్పటికి ఒక కుటుంబం మాత్రమే న్యాయస్థానంలో పోరాటం చేసిందని, దీనికి సంబంధించి వారిద్దరికి సంబంధించిన సంస్థ కూడా వారిని నిరాయుధులుగా ఉన్నప్పుడే అదుపులోకి తీసుకొని తీవ్ర చిత్రహింసలు చేసి చంపారని స్పష్టంగా ప్రకటన చేసిందని, దాన్ని కూడా ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకోకుండా ఎన్ కౌంటర్ హత్యాకాండను కొనసాగించి చివరికి శవానికి ఉండాల్సిన హక్కులను కూడా కాలరాచి న్యాయస్థానంలో పోరాటం చేస్తున్నప్పటికి శవాన్ని భద్రపరచాల్సిన బాధ్యత నుంచి ప్రభుత్వాలు వైదొలగాయని, దీనితో శవం కూడా కుల్లిపోయిందని, ఈ స్థితిలో ఏడాది తరువాత కుటుంబ సభ్యులు అతని సంస్మకరణ సభను నిర్వహించుకోవడం ఒక బాధ్యతగా ముందుకు వచ్చారని, కాని దానిని కూడా ప్రభుత్వాలు చేసుకోనివ్వకుండా మరింత దమన నీతిని అమలు చేశారని గుర్తు చేశారు. సామాజిక వ్యవస్థలో ఏడాది తరువాత ఎవరు మరణించినా గుర్తుగా గొప్పగా చేసుకోవడం ఆనవాయితీ అని, ప్రభుత్వాలు కనీస రాజ్యాంగాన్ని కూడా గౌరవించడం లేదని, ఇకనైనా ప్రభుత్వాలు ప్రజాస్వామ్యబద్ధంగా రాజ్యాంగ విలువలతో పాలన చేసి ప్రజల హక్కులను కాపాడాలని ఖాతా రామచంద్రారెడ్డి సంస్మకరణ సభకు తప్పకుండా అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# బీసీ సంక్షేమానికి ప్రాధాన్యం

- రూ. 60 కోట్లతో 50 వేల మందికి కాటమయ్య రక్షణ కవచాలు
- రూ. 450 కోట్లతో 1.30 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు జమ
- నవంబర్ నుంచి 'రాజీవ్ యువ వికాసం' ప్రారంభం
- ఓవర్సీస్ స్కాలర్‌షిప్ దరఖాస్తుల గడువు అక్టోబర్ 15 వరకు పెంపు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలో బీసీ సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సోమవారం ప్రజాభవన్‌లో బీసీ సంక్షేమ శాఖపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బాలామాయదేవి, ఎంజేపీ సెక్రటరీ సైదులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్, పద్మ, ఇందిరా, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సిఎం మాట్లాడుతూ.. ప్రీ–మెట్రిక్, పోస్ట్–మెట్రిక్ స్కాలర్‌షిప్ నిధులను నేరుగా బిసి, ఈబిసి, ఎస్సి, ఎస్టీ, మైనార్టీ విద్యార్థుల బ్యాంక్ ఖాతాల్లోకే (ఐడీు పద్ధతి ద్వారా) జమ చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఈ నూతన విధానం ద్వారా ఇప్పటి వరకు బిసి సంక్షేమ శాఖ పరిధిలోని బిసి, ఈబిసికి చెందిన 1.30 లక్షల మంది విద్యార్థులకు రూ.450 కోట్ల నిధులను నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. అలాగే హాస్టల్ విద్యార్థుల డైట్, కాస్మోటిక్ ఛార్జీలను సైతం ఏ నెలకు ఆ నెల ఖచ్చితంగా విద్యార్థుల ఖాతాల్లోనే జమ చేయాలని అధికారులను ఆదేశించారు.

### 60 కోట్లతో 'కాటమయ్య రక్షణ కవచాలు'

గీత కార్మికుల సంక్షేమానికి ఉద్దేశించిన 'కాటమయ్య రక్షణ కవచాలు' పథకం కింద ఇప్పటివరకు 50 వేల మందికి కిట్స్ మంజూరు కాగా, ఇప్పటికే 40 వేల కిట్లను అందించినట్లు వివరించారు. ప్రస్తుతం శిక్షణ పొందుతున్న మరో 10 వేల మందికి కూడా శిక్షణ పూర్తయ్యాక కాటమయ్య రక్షణ కవచం కిట్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ పథకం కోసం మొత్తం రూ.60 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు.

### నవంబర్‌లో 'రాజీవ్ యువ వికాసం'

రాష్ట్రంలోని బీసీ నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి, ఉన్న కల్పించే లక్ష్యంతో రూపొందించిన 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని నవంబర్ నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఈ పథకానికి సంబంధించి స్వీకరించిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ల సమక్షంలో పారదర్శకంగా పరిశీలించి అర్హులైన వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని అధికారులను సూచించారు. ఎంజేపీ (మహాత్మా జ్యోతిబా పూలే) గురుకులాల్లో ఉన్న పెండింగ్ బిల్లులను త్వరలోనే క్లియర్ చేస్తామని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు. గురుకుల విద్యాలయాలకు స్వంత భవనాలు మంజూరు చేయాలని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేయగా, ఆ అంశాన్ని పరిశీలిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ ఏడాది ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద మొదటి, రెండవ విడతల (ఇన్‌స్టాల్‌మెంట్స్) రూపంలో 180 మంది విద్యార్థులకు ?18 కోట్ల 40 లక్షల నిధులను విడుదల చేశామని చెప్పారు. అర్హులైన విద్యార్థులందరికీ అవకాశం కల్పించేందుకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువును అక్టోబర్ 15 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా, బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి కూడా త్వరలోనే నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

# ఆస్తి తగాదాలతో తమ్ముడిని గొడ్డలితో నరికి పెట్రోల్ పోసి దహనం చేసిన అన్న

- పోలీసుల దర్యాప్తు నిందితుల అరెస్ట్
- పోలీస్ అధికారులకు జైపూర్ ఏసీపీ అభినందనలు



**చెన్నూర్ సెప్టెంబర్ 28(జనం సాక్షి) :** మంచిర్యాల జిల్లాలో తీవ్ర కలకలం రేపింది. ఒడ్డు సోమనపల్లి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో వెలుగుచూసిన కుడుకుల శ్రీనివాస్ దారుణ హత్య కేసును పోలీసులు దాకచక్యంగా ఛేదించారు. సోమవారం చెన్నూరు రూరల్ సీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జైపూర్ ఏసీపీ వివరాలు వెల్లడించారు. నివాసు గుప్తా నిధులు ఉన్నాయని నిందితులుఅతనికి చెప్పి తమకు అనుకూలంగా మార్చుకున్నారు. ఈ నెల 20న సాయంత్రం శ్రీనివాస్ చెన్నూరు వస్తున్నట్లు తెలుసుకున్న రాజేష్, వెంటనే సమ్మయ్యకు సమాచారం ఇచ్చాడు. సమ్మయ్య చెన్నూరు బస్టాండ్ వద్ద శ్రీనివాస్ ను కలిసి, ఇద్దరూ మద్యం సేవించారు. అనంతరం ఒడ్డు సోమనపల్లి అడవిలో గుప్తనిధుల ఆచూకీ ఉందని, అక్కడికి వెళ్లి తవ్వుకుందామని నమ్మబలికాడు. అప్పటికే పథకం బల్ల కృష్ణ స్వామి పథకం ప్రకారం పల్సర్ బైక్పై అసనాద్ చౌరస్తా వద్ద సిద్ధంగా ఉండగా, సమ్మయ్య పెట్రోల్ బంకులో బాటిల్లో పెట్రోల్ కొనుగోలు చేశారు. రాత్రి వేళ ముగ్గురూ కలిసి ఒడ్డు సోమనపల్లి గ్రామ శివారు అడవిలోకి వెళ్లారు. అడవిలో నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో వెనుకనుంచి సమ్మయ్య వెంట తెచ్చిన గొడ్డలితో శ్రీనివాస్ మెడ, కాళ్లు, చేతులపై విచక్షణారహితంగా నరికాడు. శ్రీనివాస్ తప్పించుకునేందుకు ప్రయత్నించగా కిష్టస్వామి పట్టుకోగా, సమ్మయ్య తీవ్రంగా నరికి ప్రాణాలు తీశాడు. ఆనవాళ్లు దొరకకుండా ఉండేందుకు శవంపై పెట్రోల్ పోసి నిప్పు అంటించి పరారయ్యారు. మరుసటి రోజు (ఈ నెల 21న) చెన్నూరులో రాజేష్ను కలిసి హత్య పూర్తయినట్లు తెలపగా, రాజేష్ ఒప్పందం ప్రకారం మరో లక్ష రూపాయల నగదును వారికి ఇచ్చాడు. శ్రీనివాస్ కనిపించడం లేదని కుటుంబ సభ్యులు నీల్వాయి పోలీస్ స్టేషన్లో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదైంది. దర్యాప్తు కొనసాగుతుండగా, గోదారి సమ్మయ్య ను విచారించగా అతను ఒడ్డు సోమనపల్లి అటవీ ప్రాంతంలో శ్రీనివాస్ కాలిన మృతదేహం లభించింది. కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతిక ఆధారాల ఆధారంగా మొదట చెన్నూరు బస్టాండ్ వద్ద గోదారి సమ్మయ్యను అదుపులోకి తీసుకున్నారు. అతడిచ్చిన సమాచారంతో పారి పోయేందుకు యత్నిస్తున్న ప్రధాన సూత్రధారి కుడుకుల రాజేష్, సహ నిందితుడు బల్లా కిష్టస్వామిలను అసనాద్ చౌరస్తా వద్ద అరెస్ట్ చేశారు. విచారణలో నిందితులు నేరాన్ని పూర్తిగా అంగీకరించారు. స్వాధీనం చేసుకున్న వస్తువులు నిందితుల నుంచి సుపారీ సొమ్ము రూ.60,000 నగదు, హత్యకు ఉపయోగించిన గొడ్డలి, నిందితులు ఉపయోగించిన రెండు బైక్లు, సెల్ఫోన్, రక్తపు దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్కు తరలించారు. కేసు నమోదు అయిన కొద్దిరోజుల్లోనే మిస్సింగ్ కేసు మిస్టరీని ఛేదించి, కిరాయి హంతకులను పట్టుకున్న పోలీసు అధికారులను జైపూర్ ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు. దర్యాప్తులో ప్రతిభకనబరిచిన చెన్నూర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్. కృష్ణ, నీల్వాయి ఎస్సై నాగరాజు, కోటపల్లి ఎస్సై రాజశేఖర్, భీమారం ఎస్సై రాజేందర్, హెడ్ కానిస్టేబుళ్లు శంకర్, బుజ్జిబాబు, కానిస్టేబుళ్లు రవి, భరత్, సంపత్, వెంకన్న, రాజేందర్ లను ఏసీపీ ప్రత్యేకంగా ప్రశంసించారు.



## మొగుళ్లపల్లి తహసీల్దార్‌ను బదిలీ చేయాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

**మొగుళ్ళపల్లి, సెప్టెంబర్ 28(జనం సాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్కు సోమవారం ప్రజావాణిలో యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టిఐ భూపాలపల్లి జిల్లా కన్వీనర్, చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి పోర్టల్ కు సంబంధించిన దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. రైతులు తమ భూములకు సంబంధించిన సవరణలు, ఆన్లైన్ నమోదు కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే నాథుడు లేడని జిల్లా కలెక్టర్కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు అత్యవసరంగా అవసరమైన వేళ, సకాలంలో సర్టిఫికెట్లు జారీ కావడం లేదు. విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భూముల రిజిస్ట్రేషన్ అనంతరం జరగాల్సిన మ్యుటేషన్ (పట్టాదారు పేరు మార్పు), సక్సెషన్ (వారసత్వ బదలాయింపు) ప్రక్రియలు నెలల తరబడి ఆలస్యం అవుతున్నాయి. పరిపాలనలో జవాబుదారీతనం లేకపోవడం వల్ల సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని సమర్థులైన అధికారిని నియమించి, పెండింగ్ పనులను వేగవంతం చేయాలని ఆర్టిఐ జిల్లా కన్వీనర్ చర్లపల్లి వెంకటేశ్వర్లు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

# ప్రహరీలతో దారులు మూసేస్తున్నారు

- దారి చూపాలంటూ హైడ్రాను కోరిన నివాసితులు
- హైడ్రా ప్రజావాణికి 42 ఫిర్యాదులు



**హైదరాబాద్, సెప్టెంబరు 28 (జనంసాక్షి) :** నగర శివార్లలో ముందుగా వెలసిన కాలనీలకు రక్షణ కోసం నిర్మించుకున్న ప్రహరీలు ఇప్పుడు పక్కన కొత్తగా వచ్చిన కాలనీలకు, నివాస ప్రాంతాలకు దారి లేకుండా చేస్తున్నాయని సోమవారం హైడ్రా ప్రజావాణిలో పలువురు ఫిర్యాదు చేశారు. గతంలో చుట్టుపక్కల కాలనీలు, నివాస ప్రాంతాలు లేనప్పుడు ప్రహరీ ఉన్నా అభ్యంతరాలు ఉండేవి కాదని.. ఇప్పుడు తమకు దారి ఇవ్వక పోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. దారులు మూయకూడదని నిబంధనలు స్పష్టంగా ఉన్నా.. ప్రహరీలను తొలగించడానికి అక్కడి నివాసితులు ఇష్టపడడంలేదని.. ఇప్పుడవే ఇబ్బందిగా పరిణమిస్తున్నాయని చుట్టుపక్కల ఉన్న కాలనీల వారు వాపోతున్నారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం కుంట్లూరు విలేజ్‌లోని ప్రజయ్ గుల్‌మొహర్ కాలనీ వారు ప్రహరీలు తొలగించకపోవడంతో పక్కనే ఉన్న తమ ప్లాట్లకు వెళ్లలేకపోతున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా, రామచంద్రాపురం మండలం.. 85.20 ఎకరాలలో 596 ప్లాట్లతో లే ఔట్ వేశారు. ఇందులో 11 ఎకరాల మేర ఉన్న లే ఔట్‌లో రహదారులు, పార్కులు కబ్జా చేసి.. తమకు దారి లేకుండా చేస్తున్నారని తెల్లాపూర్ జి. బ్లాక్ ప్లాట్ ఓనర్ల సంఘం ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేసి.. తమకు దారి చూపించాలని కోరారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం శ్రీరాంనగర్ కాలనీలో విల్లాలు నిర్మించిన వారు తమ ప్లాట్‌కు దారి లేకుండా రహదారిని కబ్జా చేసేశారని అక్కడి స్థానికుడు ఫిర్యాదు చేశారు. మేడ్చల్ లోని ఏజీఎస్ లే ఔట్‌లోకి కెమికల్ వాటర్ వచ్చేస్తోంది.. సాఫీగా సాగే నాలాలో ఆటంకాలు సృష్టించడంతో తమ పరిసరాలను పారిశ్రామిక వ్యర్థ జలాలు వచ్చి ముంచెత్తుతున్నాయని హైడ్రా ప్రజావాణిలో వాపోయారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 42 ఫిర్యాదులందాయి. వీటిని హైడ్రా అడిషనల్ కమిషనర్ శ్రీ డి. ఆనంద్‌కుమార్ గారు పరిశీలించి.. పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు.

# ఏసీబీకి చిక్కిన నాంపల్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్!

- ప్రైవేట్ వ్యక్తి ద్వారా వసూళ్లు
- ఇద్దరినీ అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు



**నల్గొండ, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** ప్రజల భూ సమస్యలను పరిష్కరించాల్సిన రెవెన్యూ కార్యాలయంలో లంచం వ్యవహారం వెలుగుచూసింది. వ్యవసాయ భూమికి సంబంధించిన పంచనామా నివేదికను తహసీల్దార్‌కు సమర్పించేందుకు సైతం రూ.15 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నాంపల్లి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాళ్లబండి గోపరాజు ఏసీబీ వలకు చిక్కాడు. ప్రైవేట్ వ్యక్తి ద్వారా లంచం సొమ్ము తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకోవడం రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

### పని చేయాలంటే పైసలు చెల్లించాల్సిందేనా?

నాంపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రాళ్లబండి గోపరాజు, ఫిర్యాదు దారుడి వ్యవసాయ భూమికి సంబంధించిన పంచనామా నివేదికను తహసీల్దార్‌కు అందజేయడానికి రూ.15,000 డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఈ మొత్తాన్ని తన ప్రైవేట్ సహాయకుడిగా వ్యవహరిస్తున్న అడుళ్ల యాదగిరి ద్వారా స్వీకరించినట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయంలో నిబంధనల ప్రకారం జరగాల్సిన పనికి లంచం డిమాండ్ చేసిన వ్యవహారం అధికార యంత్రాంగంలో అవినీతి తీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

### ప్రైవేట్ వ్యక్తి వద్ద లంచం సొమ్ము స్వాధీనం

సెప్టెంబర్ 28న నల్గొండ రేంజ్ ఏసీబీ అధికారులు నిర్వహించిన దాడిలో అడుళ్ల యాదగిరి వద్ద నుంచి రూ.15 వేల లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాళ్లబండి గోపరాజు (ఏ–1), ప్రైవేట్ వ్యక్తి అడుళ్ల యాదగిరి (ఏ–2)లను అరెస్టు చేసినట్లు ఏసీబీ విడుదల చేసిన ప్రెస్‌నోట్ లో పేర్కొన్నారు. అధికారిక విధులకు విరుద్ధంగా అక్రమ ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినట్లు ఏసీబీ వెల్లడించింది. నిందితులను అవినీతి నిరోధక చట్టం కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచి న్యాయ రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపింది. కేసు దర్యాప్తులో ఉందని, ఫిర్యాదుదారుడి వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా గోప్యంగా ఉంచుతున్నట్లు స్పష్టం చేసింది.

### లంచగొండితనంపై ఉక్కుపాదం పడాల్సిందే!

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల పనులు సజావుగా సాగాలంటే పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరి. భూములకు సంబంధించిన నివేదికల కోసం ప్రజలు అధికారుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఉండకూడదు. లంచం డిమాండ్ చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ అధికారి ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు మౌనంగా ఉండకుండా ఏసీబీకి ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. టోల్‌ఫ్రీ నంబర్ 1064తో పాటు వాట్సాప్ నంబర్ 9440446106 ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

# మేము ద్రవిడులం.. వాళ్లు ఆర్యులు!

సంపాదకీయం

కొన్ని రాజకీయ వ్యాఖ్యలు కేవలం మాటలుగా మిగిలిపోవు. అవి ఒక ప్రాంతపు ఆత్మగౌరవాన్ని, ఒక రాజకీయ ప్రశ్నను దేశవ్యాప్త చర్చలోకి తీసుకొస్తాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన "మేము ద్రవిడులం.. వాళ్లు ఆర్యులు" వ్యాఖ్య అలాంటి చర్చకే తెరతీసింది. "మేము హర హర మహాదేవ్ అంటాం.. వాళ్లు జై శ్రీరామ్ అంటారు" అన్న ఆయన వ్యాఖ్య ఉత్తరాది ఆధిపత్యం..దక్షిణ రాజకీయ ప్రయోజనాల అణిచివేత పై మరోసారి చర్చకు దారితీసింది.

ఈ మాటలను కేవలం మతపరమైన వ్యాఖ్యలుగా చూడటం సరిపోదు. దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం, కేంద్ర--రాష్ట్ర సంబంధాలు, సమాఖ్య వ్యవస్థ, నియోజకవర్గాల పునర్విభజన వంటి అంశాల నేపథ్యంలో చూడాల్సి ఉంటుంది. జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాలు భవిష్యత్తులో రాజకీయ ప్రాతినిధ్యం కోల్పోయే పరిస్థితి రాకూడదన్న ఆందోళనను రేవంత్‌రెడ్డి బలంగా వినిపించారు.

"మేము ద్రవిడులం.. వాళ్లు ఆర్యులు" అన్నది చారిత్రక తీర్పు కంటే రాజకీయ వ్యాఖ్యగా చూడాలి. భారతదేశం భిన్న భాషలు, సంస్కృతులు, సంప్రదాయాల సమాఖ్య. ప్రాంతీయ ఆత్మగౌరవం అంటే దేశానికి వ్యతిరేకత కాదు. రాష్ట్రాల హక్కులు బలపడటం భారత సమాఖ్య బలపడటమే. ఇక ఎస్ఐఆర్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలు మరింత కీలకం. నాడు సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా "సైమన్ గో బ్యాక్" నినాదం దేశవ్యాప్తంగా మార్మోగిందని, నేడు ఓటర్ల జాబితాల సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల హక్కులు దెబ్బతినే ప్రమాదం ఉందన్న ఆందోళనతో "ఎస్ఐఆర్ గో బ్యాక్" నినాదం ఇవ్వాల్సి వస్తోందని రేవంత్‌రెడ్డి అన్నారు.

ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యానికి పునాది. అనర్హుల పేర్లను తొలగించడం ఎంత అవసరమో, అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా అన్యాయంగా తొలగిపోకుండా చూడటం అంతే ముఖ్యం. అందుకే ఎస్ఐఆర్‌పై ఉన్న అనుమానాలకు ఎన్నికల సంఘం పారదర్శకమైన ప్రక్రియతో, స్పష్టమైన గణాంకాలతో సమాధానం చెప్పాలి. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలోనూ ఇదే సూత్రం వర్తిస్తుంది. జనాభా నియంత్రణ సాధించిన రాష్ట్రాలు అదే కారణంగా భవిష్యత్తులో రాజకీయంగా నష్టపోకూడదు. ఈ సమస్యకు నినాదాల కంటే రాజ్యాంగబద్ధమైన పరిష్కారం అవసరం.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యపై భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు. "ద్రవిడులు--ఆర్యులు" అనే చారిత్రక వ్యాఖ్యానంపైనా చర్చ జరగవచ్చు. కానీ ఆయన లేవనెత్తిన దక్షిణాది ప్రాతినిధ్యం, సమాఖ్య హక్కులు, ఓటుహక్కు, ఎన్నికల జాబితాల పారదర్శకత వంటి ప్రశ్నలను మాత్రం విస్మరించలేం.

చివరికి ప్రశ్న ద్రవిడులెవరు, ఆర్యులెవరు అన్నది కాదు. ప్రతి రాష్ట్రానికి సమాన గౌరవం ఉందా? ప్రతి పౌరుడి ఓటుకు సమాన విలువ ఉందా? ప్రతి ప్రాంతానికి సముచిత రాజకీయ ప్రాతినిధ్యం ఉందా? అన్నదే అసలు ప్రశ్న.

నాడు "సైమన్ గో బ్యాక్" ఒక ఉద్యమానికి ప్రతీకగా నిలిచింది. నేడు "ఎస్ఐఆర్ గో బ్యాక్" నినాదం వినిపిస్తుంటే, దాని వెనుక ఉన్న ప్రజాస్వామ్య ప్రశ్నలకు సమాధానం రావాలి. విభజన కాదు.. హక్కుల కోసం స్వరం. ఆధిపత్యం కాదు.. సమాఖ్య సమతుల్యత. నినాదం కాదు.. ప్రజాస్వామ్యానికి జవాబు.

## నాడు ఓటు హక్కు కోసం, నేడు...
# ఓటు కాపాడుకోవడం కోసం పోరాటం



ప్రజాస్వామ్యంలో ఓటు కేవలం ఒక గుర్తు కాదు... అది ప్రజల రాజకీయ అధికారానికి ప్రతీక. ఒకప్పుడు భారతదేశంలో ప్రతి మనిషికి ఓటు హక్కు ఉండాలనే డిమాండ్ కోసం పోరాటాలు జరిగాయి. సామ్రాజ్యవాద పాలనలో ఆస్తి ఉన్నవారికి, పన్నులు చెల్లించేవారికి, విద్యావంతులకు, కొన్ని ప్రత్యేక వర్గాలకు మాత్రమే పరిమితమైన ఓటు హక్కును ప్రజలందరికీ అందించాలనే డిమాండ్ స్వాతంత్ర్యోద్యమంలో ఒక ముఖ్యమైన అంశంగా ఎదిగింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రాజ్యాంగ నిర్మాతలు ఆ హక్కును ప్రజాస్వామ్య భారతదేశానికి పునాదిగా చేశారు

ఈరోజు పరిస్థితి మరో ప్రశ్నను ముందుకు తెస్తోంది. "ఓటు కావాలి" అని పోరాడిన తరాల తరువాత, "మా ఓటును కాపాడండి" అని పోరాడాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? ఇదే నేటి ప్రజాస్వామ్యానికి ఎదురవుతున్న ప్రధాన ప్రశ్న? ఓటు హక్కు కోసం సాగిన చారిత్రక పోరాటం బ్రిటిష్ పాలనలో భారతీయులకు ఎన్నికల వ్యవస్థ ఉన్నప్పటికీ అది సార్వత్రిక ఓటు హక్కుపై ఆధారపడలేదు. ఎన్నికలలో పాల్గొనే అర్హత పరిమిత వర్గాలకే ఉండేది. ఆస్తి, ఆదాయం, విద్య, ఉద్యోగం వంటి అర్హతలు ఓటు హక్కును నిర్ణయించేవి. ఎన్నికల చరిత్రపై ఎన్నికల కమిషన్ ప్రచురించిన పత్రాల ప్రకారం, స్వాతంత్ర్యం తరువాత రాజ్యాంగ సభ సార్వత్రిక వయోజన ఓటు హక్కు ఆధారంగా ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. అది చిన్న నిర్ణయం కాదు.

నిరక్షరాస్యత ఎక్కువగా ఉన్న దేశం, పేదరికంతో బాధపడుతున్న సమాజం,కుల-మత-ప్రాంత-భాషా వైవిధ్యాలతో కూడిన భారతదేశంలో ప్రతి వయోజనుడికి సమాన ఓటు హక్కు ఇవ్వడం ప్రపంచ ప్రజాస్వామ్య చరిత్రలోనే ఒక మహత్తర ప్రయోగం.

1951--52లో జరిగిన తొలి సాధారణ ఎన్నికలు ఆ నిర్ణయాన్ని ఆచరణలోకి తెచ్చాయి. ఎన్నికల కమిషన్ ప్రకారం, మొదటి సాధారణ ఎన్నికల్లో లోక్‌సభకు 489 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అప్పటి నుంచి భారత ప్రజాస్వామ్యం ఒక సూత్రాన్ని అంగీకరించింది:

ప్రజాస్వామ్యంలో మనిషి విలువ అతని ఆస్తితో కాదు - అతని ఓటుతో నిర్ణయించబడాలి.

**ఓటు సమానత్వం - ప్రజాస్వామ్యానికి గుండె.**

ఒక పారిశ్రామికవేత్త ఓటు విలువ ఎంతో , ఒక కూలీ ఓటు విలువ కూడా అంతే. ఒక ధనవంతుడి ఓటు ఎంత విలువైనదో, ఒక పేద రైతు ఓటు కూడా అంతే విలువైనది. ఒక ఉన్నత విద్యావంతుడి ఓటు ఎంత ముఖ్యమో, నిరక్షరాస్యుడి ఓటు కూడా అంతే ముఖ్యమైనది. ఇదే సార్వత్రిక ఓటు హక్కు సారాంశం.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల ఎన్నికలు వయోజన ఓటు హక్కు ఆధారంగా జరుగుతాయి. ఎన్నికల కమిషన్ కూడా దీనిని స్పష్టంగా పేర్కొంటోంది.

అందువల్ల ఓటర్ల జాబితాలో ఒక అర్హుడైన పౌరుడి పేరు లేకపోవడం కేవలం పరిపాలనా తప్పిదంగా చూడలేం. అది జరిగే సందర్భంలో ఆ వ్యక్తి తన ప్రజాస్వామ్య భాగస్వామ్యానికి అడ్డంకిని ఎదుర్కొంటాడు. అప్పట్లో ఓటు కోసం పోరాటం... ఇప్పుడు ఓటును రాక్షంచుకోవడం పోరాటం, నాడు "మాకు ఓటు హక్కు ఎందుకు లేదు?" నేడు "మా ఓటు హక్కు సురక్షితంగా ఉందా?" ఇది కాలం మార్పును మాత్రమే కాదు, ప్రజాస్వామ్యంపై ఉన్న కొత్త సవాళ్లను కూడా సూచిస్తోంది. ఓటరు జాబితాలో పేరు నమోదు కావడం, పేరు కొనసాగడం, తప్పులు సరిచేయడం, ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి మారినప్పుడు వివరాలు నవీకరించడం వంటి అంశాలు ఎన్నికల ప్రక్రియలో కీలకం. ఎన్నికల కమిషన్ ప్రస్తుతం ఓటర్లు తమ పేరును పరిశీలించడానికి, నమోదు/సవరణకు దరఖాస్తు చేసుకోవడానికి, తమ దరఖాస్తు స్థితిని తెలుసుకోవడానికి సేవలను అందిస్తోంది. ఈ ప్రక్రియలలో ప్రజలకు అనుమానం కలిగే పరిస్థితి ఏర్పడితే, ఎన్నికల వ్యవస్థపై విశ్వాసం దెబ్బతినే అవకాశం ఉంటుంది.

అందుకే ఎన్నికల నిర్వహణలో నిజాయితీ మాత్రమే కాదు - నిజాయితీ కనిపించేలా పారదర్శకత కూడా అవసరం.

**SIR - ఓటర్ల జాబితాపై కొత్త చర్చ**

ప్రస్తుతం Special Intensive Revision (SIR) పేరుతో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమీక్ష దేశవ్యాప్తంగా రాజకీయ, న్యాయ చర్చకు కారణమైంది. ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో SIR-2026కు సంబంధించిన ఓటర్ల జాబితా శోధన సదుపాయాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఓటర్ల జాబితాను శుద్ధి చేయడం, నకిలీ లేదా అనర్హమైన నమోదులను తొలగించడం అనే లక్ష్యం పరిపాలనా దృష్టిలో చెప్పబడవచ్చు. కానీ అదే సమయంలో అర్హులైన ఓటర్ల పేర్లు పొరపాటున తొలగించబడకుండా చూడటం అత్యంత ముఖ్యమైన బాధ్యత. అందుకే ప్రజల కురుకునేది "నకిలీ ఓట్లను తొలగించండి - కానీ నిజమైన ఓటరును తొలగించకండి."ఇది రాజకీయ పార్టీకి సంబంధించిన డిమాండ్ కాదు. ప్రజాస్వామ్య ప్రక్రియపై విశ్వాసానికి సంబంధించిన అంశం

**ఎన్నికల కమిషన్ పాత్ర ఏమిటి?**

భారత రాజ్యాంగం ఎన్నికల కమిషన్‌కు పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలపై పర్యవేక్షణ, దిశానిర్దేశం, నియంత్రణ బాధ్యతలను అప్పగించింది. అందువల్ల ఎన్నికల కమిషన్ ఒక సాధారణ ప్రభుత్వ విభాగం కాదు. అది రాజ్యాంగ సంస్థ. దాని మీద అధికార పార్టీకి ఉన్న హక్కు ఎంతో, ప్రతిపక్షానికి కూడా అంతే. దాని మీద పట్టణ ఓటరుకు ఉన్న హక్కు ఎంతో, గ్రామీణ ఓటరుకు కూడా అంతే. దాని ముందు ధనవంతుడి ఓటు ఎంత ముఖ్యమో, పేదవాడి ఓటు కూడా అంతే ముఖ్యమైనది. అందుకే ఎన్నికల కమిషన్ తీసుకునే ప్రతి నిర్ణయం నిష్పాక్షికత, పారదర్శకత, చట్టబద్ధత, ప్రజా విశ్వాసం అనే నాలుగు ప్రమాణాల మీద నిలబడాలి.

జ్ఞానేశ్ కుమార్ నాయకత్వంపై ఎందుకు ప్రశ్నలు వస్తున్నాయి సర్ పేరుతో 13కోట్ల మంది ఓటర్లు తమ ఓట్లను కోల్పోయారు దీనికి భాద్యులు ఎవరు?

ప్రస్తుత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నాయకత్వంలో ఎన్నికల కమిషన్ తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలే దీనికి మూలం. దీని పై ప్రతిపక్ష పార్టీలు, పౌర సమాజంలోని కొన్ని వర్గాలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ముఖ్యంగా ఓటర్ల జాబితా సవరణ, SIR ప్రక్రియ, నిర్ణయాల పారదర్శకత వంటి అంశాలపై వివాదం కొనసాగుతోంది.

ఇక్కడ ఒక ముఖ్యమైన ప్రజాస్వామ్య సూత్రాన్ని గుర్తుంచుకోవాలి. ఆరోపణలు వాస్తవాలుగా మారవు; కానీ ఆరోపణలకు సమాధానం ఇవ్వడం ఒక రాజ్యాంగ సంస్థపై ఉన్న ప్రజా బాధ్యతను బలపరుస్తుంది. ఎన్నికల కమిషన్ కూడా తన నిర్ణయాలు చట్టబద్ధమైనవని, SIR ప్రక్రియకు సంబంధించిన నిర్ణయాలు సంస్థాగత ప్రక్రియలోనే తీసుకుంటున్నామని వివరిస్తోంది. కాబట్టి పరిష్కారం పరస్పర ఆరోపణల్లో లేదు.

**ఎక్కువ పారదర్శకతలో ఉంది.**

- ఎక్కువ సమాచారం ప్రజల ముందు ఉంచడంలో ఉంది.
- ఎక్కువ న్యాయపరమైన పర్యవేక్షణలో ఉంది.
- ఎక్కువ ప్రజా విశ్వాసాన్ని నిర్మించడంలో ఉంది.
- ఓటర్ల జాబితా ఎందుకు ఇంత కీలకం?
- ఎన్నికల రోజున మనం పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయాలంటే మొదటి అవసరం ఏమిటి?
- ఓటర్ల జాబితాలో మన పేరు ఉండాలి.
- EVM ఉందా లేదా అనేది తరువాతి విషయం.
- పోలింగ్ బూత్ ఉందా లేదా అనేది తరువాతి విషయం.
- మనకు ఓటు హక్కు ఉందని రాజ్యాంగం చెప్పడం మాత్రమే సరిపోదు.
- ఆ హక్కు ఆచరణలో ఉపయోగించుకునే అవకాశం ఉండాలి.

అందుకే ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యానికి ప్రవేశ ద్వారం. ఆ ద్వారం దగ్గరే ఒక అర్హుడైన పౌరుడు ఆపబడితే, అతని రాజ్యాంగ హక్కు ఆచరణలో బలహీనపడుతుంది.

**"ఓటు కాపాడండి" అంటే ఏమిటి?**

ఓటును కాపాడడం అంటే కేవలం ఈవీఎంను కాపాడడం కాదు. ఓటును కాపాడడం అంటే - ప్రతి అర్హుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడడం. అనర్హమైన నమోదులను చట్టబద్ధమైన విధానంలో తొలగించడం. పేరు తొలగించే ముందు తగిన నోటీసు, అభ్యంతరం, అప్పీల్ అవకాశాలు ఉండేలా చూడడం. రాజకీయ పార్టీలకు సమాన సమాచారం అందించడం. ఎన్నికల కమిషన్ నిర్ణయాలను ప్రజలకు వివరించడం. ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని కాపాడడం. ఎన్నికల సంస్థ రాజకీయ అధికారానికి అతీతంగా పనిచేస్తుందనే నమ్మకాన్ని నిలబెట్టడం. అంటే ఓటును కాపాడటం అంటే ప్రజాస్వామ్యాన్ని కాపాడటం. ఒకప్పుడు హక్కు కోసం పోరాటం - ఇప్పుడు హక్కు రక్షణ కోసం పోరాటం

**స్వాతంత్ర్యానికి ముందు తరాలు ఇలా ప్రశ్నించాయి:**

"ప్రజలకు పాలించే హక్కు ఎప్పుడు వస్తుంది?" స్వాతంత్ర్యం తరువాత రాజ్యాంగం సమాధానం ఇచ్చింది: "ప్రజలే సార్వభౌములు." అందుకే ఓటు హక్కు వచ్చింది. ఇప్పుడు మన తరం అడగాల్సిన ప్రశ్న "ప్రజల సార్వభౌమాధికారం ఎన్నికల ప్రక్రియలో పూర్తిగా రక్షించబడుతున్నదా?" ఇది అధికార పార్టీకి వ్యతిరేకమైన ప్రశ్న మాత్రమే కాదు. ఇది ప్రతిపక్షానికి అనుకూలమైన ప్రశ్న మాత్రమే కాదు. ఇది ప్రజాస్వామ్యానికి అనుకూలమైన ప్రశ్న. ప్రజాస్వామ్యం ఐదేళ్లకు ఒక్కసారి వచ్చే పండుగ కాదు ఎన్నికల సమయంలో ఓటు వేసి ఇంటికి వెళ్లిపోవడం మాత్రమే ప్రజాస్వామ్యం కాదు. ఓటరు జాబితాను పరిశీలించడం కూడా ప్రజాస్వామ్యమే. తన పేరు లేకపోతే ప్రశ్నించడం కూడా ప్రజాస్వామ్యమే. ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నించడం కూడా ప్రజాస్వామ్యమే. ఎన్నికల కమిషన్‌కు తన నిర్ణయాలను వివరించాల్సిన బాధ్యత గుర్తు చేయడం కూడా ప్రజాస్వామ్యమే.

**ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రజాస్వామ్యం.**

ప్రతిపక్షాన్ని ప్రశ్నించడం కూడా ప్రజాస్వామ్యం. అందుకే ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యత ఒక పార్టీకి మాత్రమే కాదు-ప్రతి పౌరుడికీ ఉంది. ఒకప్పుడు మన తల్లిదండ్రుల తరం "ఓటు కావాలి" అని పోరాడింది.

**అది హక్కు కోసం జరిగిన పోరాటం.**

నేడు మన తరం "ఓటును కాపాడాలి" అని మాట్లాడుతోంది. ఇది ఆ హక్కును రక్షించుకునే పోరాటం. రెండింటి మధ్య ఒక గొప్ప చారిత్రక సంబంధం ఉంది. ఓటు హక్కు సాధించడం ప్రజాస్వామ్య నిర్మాణం అయితే, ఆ ఓటు హక్కును కాపాడడం ప్రజాస్వామ్య పరిరక్షణ. ఎన్నికల కమిషన్‌పై ఎవరి రాజకీయ అభిప్రాయం ఏదైనా కావచ్చు. కానీ ఒక విషయంలో మాత్రం ప్రజాస్వామ్య సమాజం మొత్తం ఏకీభవించాల్సిన అవసరం ఉంది:

- అర్హుడైన ప్రతి పౌరుడి ఓటు ఉండాలి.
- ప్రతి ఓటుకు సమాన విలువ ఉండాలి.
- ప్రతి ఓటరు తన ఓటు వేయగలగాలి.
- ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు విశ్వాసం ఉండాలి.

ఎందుకంటే-నిన్న ఓటు హక్కు కోసం పోరాటం సాగింది. నేడు ఓటు హక్కును కాపాడేందుకు పోరాటం సాగుతోంది. "ఓటు రక్షణే ప్రజాస్వామ్య రక్షణ -ప్రజాస్వామ్య రక్షణే ప్రజల భవిష్యత్తుకు రక్షణ."



వ్యాస కర్త
మాలోతు సాగర్ సామాజిక వేత్త
సెల్ నెంబర్ 7013805411

# ఆధునిక మానవ జీవితంపై -బాహ్య ఒత్తిళ్ల తీవ్ర ప్రభావం!

*ఆధునిక మానవ జీవితం ఎన్నడూ లేనంత వేగంగా మారుతోంది. సాంకేతిక పరిజ్ఞానం, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, రవాణా విస్తరణ, వినియోగ సంస్కృతి, ఉద్యోగ పోటీ, ఆర్థిక ఒత్తిళ్లు మనిషి జీవన ప్రమాణాలను ఒకవైపు మెరుగుపరుస్తున్నప్పటికీ మరోవైపు గాలి, నీరు, ఆహారం, శబ్దం, వాతావరణ మార్పులు, మానసిక ఒత్తిళ్ల రూపంలో తీవ్రమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. మనిషి ఆరోగ్యానికి మూలాధారాలైన గాలి, నీరు, ఆహారం నాణ్యత దెబ్బతింటే ఆధునిక అభివృద్ధి ఎంత వేగంగా సాగినా దాని ప్రయోజనం ప్రశ్నార్థకంగా మారుతుంది.*


మొదట గాలిని పరిశీలిస్తే ఆధునిక ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద పర్యావరణ సమస్యల్లో వాయు కాలుష్యం ఒకటి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం 2019లో ప్రపంచ జనాభాలో సుమారు 99 శాతం మంది సంస్థ నిర్దేశించిన గాలి నాణ్యత మార్గదర్శక ప్రమాణాలను చేరుకోని ప్రాంతాల్లో నివసించారు. బాహ్య, గృహ వాయు కాలుష్యాల సమ్మిళిత ప్రభావం ప్రతి సంవత్సరం సుమారు 67 లక్షల అకాల మరణాలతో సంబంధం కలిగి ఉంది. బాహ్య వాయు కాలుష్యం ఒక్కటే 2019లో సుమారు 42 లక్షల అకాల మరణాలకు కారణమైనట్లు అంచనా. ఈ మరణాల్లో సుమారు 89 శాతం తక్కువ, మధ్య ఆదాయ దేశాల్లో నమోదయ్యాయి.

ఇక్కడ గమనించాల్సిన అంశం ఏమిటంటే గాలి కాలుష్యం కేవలం ఊపిరితిత్తుల సమస్యగా చూడలేం. సూక్ష్మ ధూళికణాలు శ్వాసకోశ వ్యవస్థను దాటి రక్త ప్రసరణ వ్యవస్థపై కూడా ప్రభావం చూపగలవు. గుండె జబ్బులు, పక్షవాతం, ఊపిరితిత్తుల క్యాన్సర్, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు వంటి అనేక సమస్యలతో వాయు కాలుష్యానికి సంబంధం ఉంది. వాహనాల పొగ, పరిశ్రమలు, విద్యుత్ ఉత్పత్తి, చెత్త దహనం, నిర్మాణ రంగం, వ్యవసాయ అవశేషాల దహనం వంటి అనేక కార్యకలాపాలు దీనికి కారణమవుతున్నాయి. అందువల్ల గాలి నాణ్యతను కాపాడటం వ్యక్తిగత ఆరోగ్య సమస్య మాత్రమే కాదు; అది ప్రజారోగ్యం, ఆర్థిక వ్యవస్థ, పట్టణ ప్రణాళికకు సంబంధించిన అంశం.

నీరు మనిషి జీవనానికి మరో ప్రాథమిక ఆధారం. ప్రపంచవ్యాప్తంగా 2022 నాటికి సుమారు 73 శాతం జనాభాకు మాత్రమే సురక్షితంగా నిర్వహించబడిన తాగునీటి సేవలు అందుబాటులో ఉన్నాయి. అంటే సుమారు 27 శాతం మంది, దాదాపు 220 కోట్ల మంది, ఇంటి వద్ద అందుబాటులో ఉండే, అవసరమైనప్పుడు లభించే, కలుషణం లేని సురక్షిత తాగునీటి ప్రమాణాన్ని పొందలేకపోయారు.

నీటి సమస్యలో పరిమాణం కంటే నాణ్యత కూడా అత్యంత ముఖ్యమైనది. నీరు అందుబాటులో ఉన్నా అందులో సూక్ష్మజీవులు, రసాయన కాలుష్యాలు లేదా ఇతర హానికర పదార్థాలు ఉంటే అది ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారుతుంది. తాగునీటి కాలుష్యం జీర్ణకోశ వ్యాధులు, అంటువ్యాధులు, పిల్లల్లో పోషకాహార సమస్యలు వంటి అనేక ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. నీటి కొరత, భూగర్భజలాల అధిక వినియోగం, పారిశ్రామిక వ్యర్థాలు, వ్యవసాయ రసాయనాల ప్రవాహం, పట్టణ మురుగునీటి నిర్వహణలో లోపాలు భవిష్యత్తులో నీటి భద్రతను మరింత సవాలు చేస్తున్నాయి.

ఆహారం విషయంలో ఆధునిక మానవ సమాజం ఒక విరుద్ధ పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఒకవైపు ఆహార ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలు, రెస్టారెంట్లు, ప్యాకేజ్డ్ ఫుడ్, ఆన్‌లైన్ డెలివరీ వంటి సౌకర్యాలు విస్తరించాయి. మరోవైపు పోషక విలువలున్న సమతుల ఆహారం అందరికీ సమానంగా అందుబాటులో లేదు. ఐక్యరాజ్యసమితి సంస్థల 2024 నివేదిక ప్రకారం 2023లో సుమారు 233 కోట్ల మంది ప్రపంచవ్యాప్తంగా మితమైన లేదా తీవ్రమైన ఆహార భద్రతా సమస్యను ఎదుర్కొన్నారు. 2022లో 280 కోట్లకు పైగా ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనుగోలు చేయలేని పరిస్థితిలో ఉన్నారు. తక్కువ ఆదాయ దేశాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉండి,




అక్కడ సుమారు 71.5 శాతం జనాభా ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనుగోలు చేయలేక పోయింది. అధిక ఆదాయ దేశాల్లో ఈ శాతం 6.3గా ఉంది.

ఇది ఆధునిక ఆహార వ్యవస్థలో ఉన్న ఆర్థిక అసమానతలను స్పష్టంగా చూపిస్తుంది. ఆరోగ్యకరమైన ఆహారం అంటే కేవలం కడుపు నింపడం కాదు. తృణధాన్యాలు, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు, గింజలు వంటి పోషక విలువలున్న ఆహారాలతో పాటు ఉప్పు, ఉచిత చక్కెరలు, అధిక సంతృప్త కొవ్వులు, ట్రాన్స్ కొవ్వులను పరిమితం చేయడం అవసరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది.

ఇక బయట నుంచి మనిషిపై పడుతున్న ఒత్తిడిని పరిశీలిస్తే సమస్య మరింత విస్తృతంగా కనిపిస్తుంది. పట్టణ జీవితం సమయాభావం, ఉద్యోగ పోటీ, రవాణా సమస్యలు, జీవన వ్యయం, కుటుంబ బాధ్యతలు, సామాజిక పోలికలు, డిజిటల్ పరికరాల అధిక వినియోగం వంటి అనేక ఒత్తిళ్లను కలిగిస్తోంది. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా ఈ పరిస్థితుల ప్రభావానికి లోనవుతోంది. పని--వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత లేకపోవడం నిద్ర, ఆహారపు అలవాట్లు, వ్యాయామం, సామాజిక సంబంధాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

ఆధునిక మానవ జీవితంలో 'సౌకర్యం' పెరిగినప్పటికీ 'సహజ జీవనం' తగ్గుతున్న విరుద్ధ పరిస్థితి కనిపిస్తోంది. గతంలో శారీరక శ్రమ జీవనంలో సహజ భాగంగా ఉండేది. ప్రస్తుతం అనేక వృత్తుల్లో ఎక్కువ సమయం కూర్చుని పనిచేయడం, వ్యక్తిగత రవాణాపై ఆధారపడటం, డిజిటల్ పరికరాల ముందు ఎక్కువ సమయం గడపడం వల్ల శారీరక చలనం తగ్గే అవకాశం ఉంది. ఫలితంగా ఆహారం, శారీరక చలనం, నిద్ర, ఒత్తిడి అన్నీ పరస్పర సంబంధం కలిగిన అంశాలుగా మారుతున్నాయి.

ఇక్కడ ప్రభుత్వం, పరిశ్రమలు, శాస్త్రవేత్తలు, విద్యాసంస్థలు, కుటుంబాలు, వ్యక్తులు అందరూ భాగస్వాములు కావాలి. గాలి నాణ్యత కోసం ప్రజా రవాణా, స్వచ్ఛమైన ఇంధనాలు, పరిశ్రమల ఉద్గార నియంత్రణ, చెత్త దహనం తగ్గింపు వంటి చర్యలు అవసరం. నీటి భద్రత కోసం నీటి వనరుల పరిరక్షణ, మురుగునీటి శుద్ధి, భూగర్భజలాల సంరక్షణ, వర్షపు నీటి సంరక్షణ అవసరం. ఆహార భద్రత కోసం రైతుకు స్థిరమైన ఆదాయం, వినియోగదారునికి అందుబాటులో ఉండే పోషకాహారం, ఆహార వ్యర్థాల తగ్గింపు, ఆరోగ్యకరమైన ఆహారంపై ప్రజల్లో అవగాహన అవసరం.

ఆధునిక మానవ జీవితం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతున్నదో అంతే వేగంగా అనేక రకాల ఒత్తిళ్లను ఎదుర్కొంటోంది. ఒకప్పుడు ప్రకృతితో కలిసి సాగిన జీవనం నేడు సాంకేతికత, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, ఆర్థిక పోటీ, ఉద్యోగ ఒత్తిడి, కాలుష్యం, ఆహారపు అలవాట్ల మార్పు, నిద్రలేమి, సామాజిక సంబంధాల బలహీనత వంటి అనేక అంశాల ప్రభావంలోకి వెళ్లింది. మనిషి తన సౌకర్యాల కోసం సృష్టించుకున్న ఆధునిక వ్యవస్థలే మరోవైపు అతని శారీరక, మానసిక, సామాజిక జీవనంపై ఒత్తిడిని పెంచుతున్నాయి. అందువల్ల ఆధునిక అభివృద్ధిని కేవలం ఆదాయం, సాంకేతిక పరిజ్ఞానం, వినియోగ సామర్థ్యం, పట్టణ సౌకర్యాల ఆధారంగా కాకుండా మనిషి ఆరోగ్యం, పర్యావరణ భద్రత, స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు, పోషకాహారం, మానసిక ప్రశాంతత వంటి అంశాలతో కలిపి చూడాల్సిన అవసరం ఏర్పడింది.

గాలి, నీరు, ఆహారం మనిషి జీవితానికి మూడు ప్రాథమిక ఆధారాలు. వీటిలో ఏ ఒక్కటి నాణ్యత కోల్పోయినా దాని ప్రభావం వ్యక్తిగత ఆరోగ్యాన్ని దాటి కుటుంబం, సమాజం, ఆర్థిక వ్యవస్థపై పడుతుంది. గాలి కాలుష్యం పెరిగితే శ్వాసకోశ సమస్యలతో పాటు గుండె, రక్తనాళాలు, మెదడు వంటి వ్యవస్థలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది. నీటి నాణ్యత తగ్గితే అంటువ్యాధులు మాత్రమే కాకుండా రసాయన కాలుష్యాల వల్ల దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఆహారంలో పోషక విలువల కంటే అధిక కొవ్వు, అధిక ఉప్పు, అధిక చక్కెర, అతిగా ప్రాసెస్ చేసిన పదార్థాలకు ప్రాధాన్యం పెరిగితే జీవనశైలి సంబంధిత వ్యాధుల భారం పెరుగుతుంది. కాబట్టి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలంటే ఆసుపత్రుల సంఖ్య పెంచడం ఒక్కటే పరిష్కారం కాదు; మనిషి రోజూ పీల్చే గాలి, తాగే నీరు, తినే ఆహారం నాణ్యతను మెరుగుపరచడం కూడా అంతే ముఖ్యమైనది.మనిషి ప్రకృతిపై ఆధారపడుతున్నాడనే విషయం ఎంత పురాతన సత్యమో, ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తే దాని ప్రభావం మనిషిపైనే తిరిగి పడుతుందనేది అంతే స్పష్టమైన ఆధునిక సత్యం. అడవుల నరికివేత, నీటి వనరుల ఆక్రమణ, భూగర్భ జలాల అధిక వినియోగం, పారిశ్రామిక వ్యర్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, వాయు కాలుష్యం, నేల నాణ్యత తగ్గడం వంటి సమస్యలను విడివిడిగా చూడలేం. ఇవన్నీ ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉన్నాయి. పర్యావరణ వ్యవస్థలో ఒక భాగం దెబ్బతింటే దాని ప్రభావం మిగిలిన భాగాలపై కూడా పడుతుంది. అందుకే భవిష్యత్తు అభివృద్ధి నమూనా ప్రకృతిని జయించే విధంగా కాకుండా ప్రకృతితో సమన్వయంగా ఉండే విధంగా మారాల్సిన అవసరం ఉంది.

అందువల్ల వ్యక్తి స్థాయిలో కూడా కొన్ని మార్పులు అవసరం. శుద్ధమైన నీటిని తాగడం, సమతుల్యమైన ఆహారం తీసుకోవడం, అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తగ్గించడం, క్రమబద్ధమైన శారీరక వ్యాయామం, తగిన నిద్ర, పొగతాగడం వంటి హానికర అలవాట్లకు దూరంగా ఉండటం, ఒత్తిడిని నియంత్రించడానికి తగిన విశ్రాంతి తీసుకోవడం వంటి చర్యలు జీవన నాణ్యతను మెరుగుపరచగలవు. అదే సమయంలో ప్రభుత్వం, స్థానిక సంస్థలు, విద్యాసంస్థలు, వైద్య రంగం, పరిశ్రమలు, పౌర సమాజం కలిసి పనిచేసినప్పుడే పెద్ద స్థాయిలో మార్పు సాధ్యమవుతుంది. పాఠశాలలు, కళాశాలల్లో పర్యావరణ ఆరోగ్యం, పోషకాహారం, నీటి సంరక్షణ, గాలి నాణ్యత, మానసిక ఆరోగ్యం, బాధ్యతాయుత వినియోగం వంటి అంశాలపై అవగాహన పెంచాలి. పట్టణాల్లో ప్రజా రవాణా, పచ్చదనం, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, వర్షపు నీటి సంరక్షణ, పరిశుభ్రమైన తాగునీరు వంటి మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, నీటి వనరులు, నేల ఆరోగ్యం, ఆహార భద్రత పరస్పరం అనుసంధానమై ఉన్నాయని గుర్తించి స్థిరమైన పద్ధతులను ప్రోత్సహించాలి.భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్, జీవసాంకేతికత, డిజిటల్ వైద్యం వంటి రంగాలు మానవ జీవితాన్ని మరింతగా మార్చబోతున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం మానవ జీవితాన్ని సులభతరం చేయగలదు. అయితే సాంకేతికత మనిషికి సేవ చేయాలి కానీ మనిషి సాంకేతికతకు బానిస కాకూడదు. డిజిటల్ ప్రపంచంలో ఎక్కువ సమయం గడపడం, నిరంతర సమాచార ప్రవాహం, పని--వ్యక్తిగత జీవితం మధ్య సరిహద్దులు చెదిరిపోవడం వంటి అంశాలు కొత్త తరహా ఒత్తిళ్లకు కారణమయ్యే అవకాశం ఉంది. కాబట్టి భవిష్యత్ సమాజం సాంకేతికంగా అభివృద్ధి చెందడంతో పాటు మానవీయంగా కూడా బలపడాలి.

మొత్తంగా చూస్తే ఆధునిక మానవ జీవితంపై ప్రభావం చూపుతున్న ఒత్తిళ్లు ఒక్కరోజులో ఏర్పడినవి కావు. ఇవి దశాబ్దాలుగా చోటుచేసుకున్న సామాజిక, ఆర్థిక, పర్యావరణ, సాంకేతిక మార్పుల సమ్మేళనం. అందువల్ల వాటి పరిష్కారం కూడా ఒక్క చర్యతో సాధ్యం కాదు. వ్యక్తిగత బాధ్యతతో పాటు ప్రభుత్వ విధానాలు, శాస్త్రీయ పరిశోధనలు, ప్రజా అవగాహన, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలి, సామాజిక సహకారం అవసరం.

మనిషి భూమిపై అత్యంత అభివృద్ధి చెందిన జీవిగా భావించుకుంటున్నప్పటికీ అతని జీవితం ఇప్పటికీ ప్రకృతి ప్రసాదించే గాలి, నీరు, ఆహారంపైనే ఆధారపడి ఉంది. ఈ మూడు వనరులను రక్షించకుండా మానవ నాగరికతకు స్థిరమైన భవిష్యత్తును నిర్మించడం సాధ్యం కాదు. అందువల్ల భవిష్యత్ అభివృద్ధికి ప్రధాన సూత్రం 'ఎక్కువ వినియోగం' కాకుండా 'బాధ్యతాయుత వినియోగం', 'అధిక ఉత్పత్తి' మాత్రమే కాకుండా 'సుస్థిర ఉత్పత్తి', 'ఆర్థిక వృద్ధి' మాత్రమే కాకుండా 'సమగ్ర మానవ సంక్షేమం' కావాలి. చివరికి మనిషి ఎదుర్కొంటున్న అసలు సవాలు ప్రకృతిని మార్చడం కాదు; ప్రకృతితో తన సంబంధాన్ని మార్చుకోవడం. స్వచ్ఛమైన గాలి, సురక్షితమైన నీరు, పోషకమైన ఆహారం, ఆరోగ్యకరమైన పర్యావరణం, ప్రశాంతమైన మనసు, బలమైన కుటుంబ సంబంధాలు, బాధ్యతాయుతమైన సమాజం కలిసినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. భవిష్యత్ తరాలకు కేవలం సాంకేతికంగా అభివృద్ధి చెందిన ప్రపంచాన్ని కాకుండా ఆరోగ్యంగా జీవించగలిగే ప్రపంచాన్ని అందించడం మన కాలపు అత్యంత ముఖ్యమైన బాధ్యత. అభివృద్ధి మనిషి జీవితాన్ని మెరుగుపరచాలి; మనిషి జీవితాన్నే అభివృద్ధికి బలి చేయకూడదు. ఇదే ఆధునిక నాగరికత ముందుంచుకున్న అతిపెద్ద ప్రశ్నకు సమాధానం, ఇదే స్థిరమైన భవిష్యత్తుకు మార్గదర్శక సూత్రం.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## సూక్ష్మ,చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సహం అందించాలి

- కలెక్టర్ హైమావతి



**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కమిటీ జిల్లాలో పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహం, మరియు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు సంబంధించిన అంశాలను పర్యవేక్షించే జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ కె హైమావతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని యువత కి ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించడం కోసం జిల్లాలో కొత్త పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందించాలని, పరిశ్రమలకు సంబంధించిన దరఖాస్తులు, అనుమతులు మరియు సమస్యలను క్షేత్రస్థాయిలో సమీక్షించాలని సంబంధిత శాఖ ల అధికారులను ఆదేశించారు. పెట్టుబడిదారులకు అవసరమైన సహాయం, సమన్వయం అందించాలని జిల్లా పరిశ్రమల అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి గణేష్ రామ్, ఇరిగేషన్ ఈఈ నాగరాజు, ఏంపిఐ శ్రీకాంత్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డిఫెన్స్ కాలనీ పార్కు స్థలాన్ని కబ్జా కోరల నుండి పరిరక్షించండి

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ పరిధి సర్వే నంబర్ 267 లోని పార్కు స్థలాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత సిఎంసి అధికారులపై ఉందని జనం కోసం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయన హాజరై పార్కు స్థలాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ప్రజావాణిలో ఫిర్యాదును అందజేశారు. అనంతరం మాట్లాడుతూ చందానగర్ పరిధి సర్వే నెంబర్ 267 కు సంబంధించిన జిహెచ్ఎంసి పార్కు స్థలాన్ని కొంతమంది కబ్జా రాయుళ్లు సర్వే నెంబర్ 125 పేరుతో తప్పుడు ధృవపత్రాలను సృష్టించి జిహెచ్ఎంసి అధికారుల అండదండలతో ఏకంగా దానికి ఎల్ఆర్ఎస్ అనుమతిని పొంది అక్రమాన్ని సక్రమం చేసుకునే కుట్ర పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. తాను అందజేసిన ఫిర్యాదులో భాగంగా శేరిలింగంపల్లి జోనల్



కమిషనర్ డాక్టర్ నారాయణ్ అమిత్ దీనిపై తక్షణమే స్పందించి వాస్తవాలను నిగ్గు తేల్చి పార్కు స్థలాన్ని పరిరక్షించాల్సిన బాధ్యతను ఎత్తిచూపడం జరిగిందన్నారు. తప్పుడు ధృవపత్రాలపై కనీస క్షేత్రస్థాయి పరిశీలన జరపకుండా జిహెచ్ఎంసి అధికారులు భారీగా ముడుపులు అందుకొని ఏకంగా పార్కు స్థలానికి ఎల్ఆర్ఎస్ రూపంలో అనుమతులను మంజూరు చేసిన విషయాన్ని తగిన ఆధారాలతో జోనల్ కమిషనర్ కు ఫిర్యాదులో అందజేయడం జరిగిందని, గతంలో తాను చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ కార్యాలయంలో మూడు సార్లు ప్రజావాణిలలో, జోనల్ కమిషనర్ పేషీ ప్రజావాణిలో రెండు సార్లు కాలనీ అసోసియేషన్ తో కలిసి ఫిర్యాదు చేయడం జరిగిందని, అయినప్పటికీ జిహెచ్ఎంసి అధికారులు స్పందించకపోవడం వారి అవినీతికి నిలువెత్తు నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. కాగా ఈ దఫా ప్రజావాణిలో ఫిర్యాదును స్వీకరించిన జోనల్ కమీషనర్ చెరువులు, పార్కుల్లో ఇచ్చిన అనుమతులను, అక్రమ ఎల్ఆర్ఎస్ అనుమతులను ఉపేక్షించబోనని, తక్షణమే వాటిని రద్దు చేస్తామని హామీ ని ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కసిరెడ్డి భాస్కరరెడ్డి తోపాటు ప్రసాదరాజు, విఠల్, అడివయ్య, బాలలక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

- ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి
- అధికారులకు అదనపు కలెక్టర్ కదిరవన్ పలని సూచన
- ప్రజావాణికి 213 దరఖాస్తులు, హౌసింగ్ శాఖకు అత్యధికంగా 174 అర్జీలు

**హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** ప్రజలు వివిధ సమస్యలపై అందజేసిన దరఖాస్తు లను సంబంధిత శాఖల అధికారులు శాఖల వారీగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని హైద రాబాద్ జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) కదిరవన్ పలని సూచించారు.సోమవారం కలెక్టరేట్ సమావే శ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) జితేం దర్ రెడ్డి, పీడీ హౌసింగ్ అశోక్ చక్రవర్తి, డీఆర్వో డా.నారాయణతో కలిసి ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కదిరవన్ పలని మాట్లాడుతూ.. ప్రజావాణిలో అందిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. ప్రజావాణిలో మొత్తం 213 దరఖాస్తులు అందా యని తెలిపారు.వీటిలో హౌసింగ్ శాఖకు సంబం ధించి 174, రెవెన్యూ శాఖకు 24, ఇతర శాఖలకు సంబంధించి 15 దరఖాస్తులు ఉన్నాయని పేర్కొ న్నారు.అలాగే



కలెక్టరేట్ ప్రజావాణి, సీఎం ప్రజావా ణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై సమీక్ష నిర్వహించి,వాటిని కూడా సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి పి.శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారులు జి.ఆశన్న, యు.ప్రవీణ్ కుమార్, ఇలియాస్ అహ్మద్, డీఈవో యాదయ్య తో పాటు వివిధ శాఖల అధికారులు,కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోలు పకడ్బందీగా నిర్వహించాలి

- అక్టోబర్ 1 నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలి
- క్వింటాలుకు రూ.8,667 కనీస మద్దతు ధర
- అదనపు కలెక్టర్ సంగీత

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** జిల్లాలో వానాకాలం 2026--27 సీజన్‌కు సంబంధించి పత్తి కొనుగోళ్లను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంగీత ఆదేశించారు. అక్టోబర్ 1 నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులు, జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో పత్తి సేకరణ ప్రారంభమైన వెంటనే అన్ని అధీకృత జిన్నింగ్ మిల్లులను అందుబాటులోకి తీసుకురావాలని, రైతులు తమకు సమీపంలోని మిల్లులకు పత్తిని తరలించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 3,57,246 ఎకరాల్లో పత్తి సాగు కాగా, 3,16,520 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. క్వింటాలుకు రూ.8,667 కనీస మద్దతు ధరతో రైతుల నుంచి పత్తి కొనుగోలు



చేయాలని సూచించారు. జిన్నింగ్ మిల్లుల్లో తూకపు యంత్రాలు, సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక సదుపాయాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రైతులకు కాపాస్ కిసాన్ యాప్‌లో నమోదు, సమయ కేటాయింపులు, పత్తి నాణ్యతపై అవగాహన కల్పించాలని తెలిపారు. కొనుగోళ్లు సజావుగా సాగేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీకాంత్, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు, జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో భర్త హతం

- గొడ్డలితో దాడి చేసిన భార్య..
- పిల్లలతో కలిసి పోలీసులకు లొంగుబాటు



**అల్వాల్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** కుటుంబ కలహాలతో అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మచ్చబొల్లారంలో ఆదివారం రాత్రి బొడ్డు శ్రీనివాస్ (52)ను భార్య రమాదేవి గొడ్డలితో దాడి చేసి హతమార్చింది. అనంతరం కుమారుడు నిఖిల్ (24), కుమార్తె లక్ష్మి (23)తో కలిసి సోమవారం ఉదయం పోలీసుల ఎదుట లొంగిపోయింది. పోలీసుల కథనం ప్రకారం.. హయత్‌నగర్ పరిధి తారామతిపేటకు చెందిన శ్రీనివాస్ బాలానగర్‌లో ' శ్రీ లక్ష్మీ టూల్స్' పేరుతో వ్యాపారం నిర్వహిస్తున్నారు. నాలుగు నెలలుగా మచ్చబొల్లారం పెద్ది ఫార్మారెడ్డి కాలనీలో కుటుంబంతో నివసిస్తున్నారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనట్లు, ఈ క్రమంలో కుటుంబంలో తరచూ గొడవలు జరుగుతున్నట్లు తెలిసింది. కుమారుడు నిఖిల్ తండ్రితో కలిసి వ్యాపారంలో పనిచేస్తుండగా.. కుమార్తె లక్ష్మి కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తూ నీట్‌కు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఆదివారం రాత్రి కుటుంబ విషయమై దంపతుల మధ్య తీవ్ర వాగ్వాదం జరగడంతో రమాదేవి గొడ్డలితో శ్రీనివాస్‌పై దాడి చేసింది. తీవ్ర గాయాలతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న సీఐ ప్రశాంత్ సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఏసీపీ గోపాలకృష్ణ వివరాలు తెలుసుకున్నారు. క్లూస్ టీమ్ రక్తపు నమూనాలతోపాటు గొడ్డలిని స్వాధీనం చేసుకుంది. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాల నేపథ్యంలో ఘటనకు దారితీసిన పూర్తి కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# పేదలకు సంజీవని సీఎం సహాయనిధి

- నీలం మధు ముదిరాజ్
- లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన నీలం

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** కష్టకాలంలో పేద ప్రజలకు సీఎం సహాయనిధి ఒక సంజీవనిలా మారిందని, పేదల ఆరోగ్య భద్రతకు ఈ నిధి ఎంతో ధైర్యాన్ని ఇస్తుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం చిట్కుల్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని కానుకుంటకి చెందిన కుమ్మరి రామదాసు( 60,000/-), ఇస్నాపూర్ మున్సిపాలిటీకి చెందిన అడపా ఎల్లమ్మ( 60,000/-)కు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని తెలిపారు. సరైన సమయంలో వైద్యం అందక, అప్పుల పాలవుతున్న ఎన్నో కుటుంబాలను ప్రభుత్వం ఈ నిధి ద్వారా ఆదుకుంటోందని, నిరుపేదలు అనారోగ్యం బారిన పడినప్పుడు అధైర్యపడకుండా ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు



అందాలనేదే తమ సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతూ సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న బాధితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా నిధులు మంజూరయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ గోపాల్ రెడ్డి, మన్నే రాఘవేంద్ర, నారాయణదాసు, మణికంఠ, సర్పంచ్ కొరివి సురేష్, మాజీ ఉప సర్పంచ్ శోభకృష్ణ రెడ్డి, స్థానిక నాయకులు శ్రీనివాస్, వీరేష్, నర్సింలు, రాము, వెంకటేష్, బిక్షపతి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తక్కళ్లపల్లి రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలి

- ఫ్యూచర్ సిటీ రోడ్డు బాధితుల ఆవేదన

**యాచారం, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** ఫ్యూచర్ సిటీ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన తక్కళ్లపల్లి పట్టా రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు. నాగార్జున సాగర్ హైవే నుండి ఫ్యూచర్ సిటీకి నిర్మిస్తున్న 100 ఫీట్ల రోడ్డు కోసం పలువురు పట్టాదారు రైతులు తమ విలువైన భూములను కోల్పోయారు. రోడ్డు నిర్మాణం దాదాపు 90 శాతం పూర్తయ్యే దశకు చేరుకున్నా, ఇప్పటివరకు ఒక్క రూపాయి పరిహారం కూడా అందలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తాము గత కొన్ని నెలలుగా రెవెన్యూ అధికారులు, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని రైతులు వాపోయారు. ప్రతిసారి కలిసినప్పుడు "పరిహారం ఇప్పిస్తాం, ఫైల్ ప్రాసెస్ లో ఉంది" అంటూ మాటలతో కాలయాపన చేస్తున్నారే తప్ప, పరిహారం ఎప్పుడు, ఎంత ఇస్తారో స్పష్టత ఇవ్వడం లేదని ఆరోపించారు.ప్రభుత్వం రోడ్డు వేసుకుంది, కానీ మా పొట్ట కొట్టింది. ఉన్న కొద్దిపాటి భూమిని పోగొట్టుకుని ఇప్పుడు పరిహారం కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నాం" అని ఒక రైతు ఆవేదన వ్యక్తం చేశారు.ఇదే గ్రామంలో గతంలో ఫార్మాసిటీ కోసం భూములు



తీసుకున్నప్పుడు కూడా ఇదే పరిస్థితి ఎదురైందని, ఇప్పుడు ఫ్యూచర్ సిటీ పేరుతో మళ్లీ రైతులను మోసం చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి, తమ భూములకు మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని వారు వేడుకుంటున్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

## ఫార్మాసిటీ రైతులపై పోలీసుల జులుం

- ఎండలో నిరసన, చీకట్లో రోడ్డుపై వదిలివేత
- ఎమ్మెల్యే హామీల అమలు కోసం వెళ్తే అక్రమ అరెస్టులు
- మంచాల పీస్‌లో గంటల తరబడి నిర్బంధం



**యాచారం, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** ఫార్మాసిటీ బాధిత రైతులు, కూలీలు, ప్రజలపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని ఉద్యమ నాయకులు ఆరోపించారు. ఈ రోజు మీూా కార్యాలయం (ప్రజాభవన్) వద్ద తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని శాంతియుతంగా నిరసన ధర్నా చేశామని తెలిపారు.ఈ సందర్భంగా రైతులు జరిగిన ఘటనను వివరించారు. "ఎండ తీవ్రంగా ఉండటంతో ఒక చిన్న టెంట్ వేసుకుందామని టెంట్ హౌస్ వారికి ఫోన్ చేస్తే, అధికార పార్టీ నాయకులు వారికి ఫోన్ చేసి టెంట్ ఇవ్వకూడదని బెదిరించారు. దీంతో మండుటెండలోనే గంటల తరబడి ఎదురుచూసినా ఏమ్మెల్యే రాలేదు, కనీసం ఎవరూ స్పందించలేదు."ఇక చేసేది లేక అక్కడి నుండి అంబేద్కర్ విగ్రహం వరకు శాంతియుతంగా పాదయాత్రగా వెళ్తుండగా, పోలీసులు హఠాత్తుగా రంగప్రవేశం చేసి రైతులను అక్రమంగా అరెస్టు చేసి మంచాల పోలీస్ స్టేషన్ కు తరలించారని ఆరోపించారు.స్టేషన్ లో తెల్ల కాగితాలపై బలవంతంగా సంతకాలు, పేర్లు తీసుకున్నారు. ఇంట్లో ఆవులు ఉన్నాయి, పాలు పితకాలి, మమ్మల్ని పోనివ్వండి అని వేడుకున్నా వినలేదు. సాయంత్రం 6 గంటల వరకు అక్రమంగా నిర్బంధించారు" అని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.సాయంత్రం విడుదల చేసిన తర్వాత కూడా మానవత్వం లేకుండా ఎలాంటి వాహన సౌకర్యం కల్పించకుండా రోడ్డుపైనే వదిలేశారని, దీంతో రైతులంతా నడిచి మళ్లీ ఇబ్రహీంపట్నం చేరుకుని, అక్కడి నుంచి చీకటి పడ్డాక తమ గ్రామాలకు వెళ్లారని తెలిపారు.ఇదేనా ప్రజా ప్రభుత్వం చెబుతున్న ప్రజా పాలన అని ఫార్మాసిటీ బాధిత రైతులు ప్రశ్నిస్తున్నారు.

## ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చిన జీవోను రద్దు చేయాలి




**ముషీరాబాద్, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ లోని విజయ ఆయిల్‌ఫెడ్ భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ నేతలు, రైతులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆయిల్‌ఫెడ్ భూముల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రైతులతో కలిసి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నేత ముఠా జయసింహ తదితరులు ఆయిల్‌ఫెడ్ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాల్సిన విలువైన ఆయిల్‌ఫెడ్ భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు వ్యక్తులకు భూమిని కేటాయిస్తూ జారీ చేసిన జీవోను వెంటనే పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆయిల్‌ఫెడ్‌కు చెందిన భూమిని తిరిగి సంస్థకే కేటాయించాలని కోరారు. ఆయిల్‌ఫెడ్ ఆస్తులను పరిరక్షించేందుకు రైతులతో కలిసి ఉద్యమాన్ని కొనసాగిస్తామనీ, ప్రైవేటీకరణకు సంబంధించిన జీవోను పూర్తిగా రద్దు చేసే వరకు పోరాటం ఆపేది లేదని వెల్లడించారు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే చర్యలను నిలిపివేసి, ఆయిల్‌ఫెడ్ భూములను సంస్థ ప్రయోజనాలకు, రైతుల ప్రయోజనాలకు వినియోగించాలని వారు డిమాండ్ చేశారు.

# భగత్ సింగ్ ఆశయాల బాటలో యువత పయనించాలి

- భగత్ సింగ్ జయంతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలి
- భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)

**ముషీరాబాద్, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** భగత్ సింగ్ ఆశయాల స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు. భగత్ సింగ్ 119వ జయంతి సందర్భంగా సోమవారం హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్ నుంచి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు చిన్న వయసులోనే బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి, ప్రజల్లో విప్లవ స్ఫూర్తిని రగిలించారని అన్నారు. భగత్ సింగ్ త్యాగం దేశ యువతను మేల్కొలిపి, స్వాతంత్ర్య ఉద్యమంలో అనేక మందిని భాగస్వాములను చేసిందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని, అయితే వారు కలలు కన్న సమసమాజం ఇంకా పూర్తిగా సాధ్యం కాలేదని అన్నారు. పేదరికం, నిరుద్యోగం, విద్యా, వైద్య సమస్యలు, రైతుల సమస్యలు, మహిళల భద్రత వంటి అనేక సమస్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. భగత్ సింగ్ ఆశయాల స్ఫూర్తితో యువత ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. భగత్ సింగ్ జయంతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించి, ఆయన ఆశయాలను యువతకు పరిచయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీమన్, నాగేందర్, రజనీకాంత్, జిల్లా సహాయ కార్యదర్శులు ఆంజనేయులు, ప్రవీణ్, జిల్లా నాయకులు భరత్, కార్తీక్, అశ్వక్, సాయి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
29 సెప్టెంబర్ 2026

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

- జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల
- ప్రజావాణికి 130 పిర్యాదుల స్వీకరణ

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, అర్జిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జిదారుల సమస్యలను సావధానంగా విన్నారు. ప్రతి సమస్యను జాగ్రత్తగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని డి.ఆర్.ఓ వారికి భరోసా ఇచ్చారు. అధికారులు ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా చదివి అర్థంచేసుకుని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని అన్నారు.

ప్రజావాణిలో మున్సిపల్, పంచాయతీరాజ్, నీటిపారుదల, జిల్లా సంక్షేమం, వ్యవసాయం, పౌరసరఫరాల శాఖ, భూ సర్వే రికార్డులు, గృహ నిర్మాణం, రోడ్డు రవాణా, పోలీస్, గిరిజన అభివృద్ధి శాఖ, విద్యుత్ శాఖ, విద్య, వైద్య ఆరోగ్యం , మైనింగ్, అటవీ, గ్రామీణ అభివృద్ధి, తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 130 వినతులను అధికారులు స్వీకరించారు.



### జిల్లా అధికారుల సమావేశం

ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో డి.ఆర్.ఓ ఎ. నిర్మల మాట్లాడుతూ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9 నుండి అక్టోబర్ 8 వరకు పోష న్ మా లో బాగంగా "మన అంగన్‌వాడీ -- మన బాధ్యత" అనే థీమ్‌తో చేపడుతున్న పోషణ కార్యక్రమం లో భాగంగా పిల్లలకు, గర్భిణీలకు పోషకాహారం, ఆహారపు అలవాట్లు, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించడం తో పాటు వయోవృద్ధుల సంక్షేమ కార్యక్రమాలను విజయవంతం చేయాలని అన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో నిర్వహించే కార్యక్రమాలకు మహిళా, శిశు సంక్షేమ శాఖకు విద్య, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్ తో పాటి సంబంధిత అన్ని శాఖల అధికారులు పూర్తి సహకారం అందించాలని సూచించారు. అలాగే, ఈ నెల 24వ తేదీ నుంచి నిర్వహిస్తున్న వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా సీనియర్ సిటిజన్ల కోసం పాటల పోటీలు, యోగా తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యాశాఖ సహకారంతో పాఠశాలల్లో గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహించి, తాతలు, అమ్మమ్మలు, నానమ్మలు, తాతయ్యల పట్ల గౌరవం, కుటుంబ, మానవతా విలువలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. మండలస్థాయి అధికారులు, సిబ్బంది ప్రతి పాఠశాలలో ఈ కార్యక్రమాలు విజయవంతంగా జరిగేలా సమన్వయం చేసుకోవాలని డి. ఆర్.ఓ ఎ. నిర్మల సూచించారు. సమావేశంలో భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, జెడ్. పి. సి.ఈ.ఓ ఇంచార్జి డి. పి.ఓ వెంకట రెడ్డి, డి. ఆర్. డి.ఓ నరసింహులు, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనా బేగం, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఖిల్లా గట్టు మెట్ల పునరుద్ధరణ పనులు వడ్డెరులకే ఇవ్వాలి

- వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు దాసర్ల భూమయ్య



**ఖిల్లా ఘనపురం సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని చారిత్రక ఖిల్లా గట్టు మెట్ల పునరుద్ధరణ పనులను వడ్డెర సంఘం సభ్యులకే కేటాయించాలని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు దాసర్ల భూమయ్య కోరారు. సోమవారం ఫారెస్ట్ రేంజ్ అధికారి దేవరాజును కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా భూమయ్య మాట్లాడుతూ ఖిల్లా ఘనపురం మండలంలో సుమారు 150 వడ్డెర కుటుంబాలు, ఫారెస్ట్ రేంజ్ పరిధిలో సుమారు 500 కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. వడ్డెరులు తమ కులవృత్తిలో భాగంగా రాళ్లు కొట్టడం, దేవాలయాలు, పాఠశాలలు, ఆనకట్టలు, చెరువులు, కోటలు, రహదారులు, మెట్ల నిర్మాణ పనులు చేస్తుంటారని వివరించారు. ఖిల్లా గట్టుపై మెట్ల నిర్మాణంలో వడ్డెరులకు నైపుణ్యం ఉందని, తమ సంఘం సభ్యులకే ఈ పనులు అప్పగించాలని కోరారు. దీనిపై రేంజ్ అధికారి దేవరాజు సానుకూలంగా స్పందించి, నిబంధనల ప్రకారం ఖిల్లా గట్టు మెట్ల పనులను వడ్డెరులకు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఆంజనేయులు, దాసర్ల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## 22ఏ నిషేధిత జాబితా నుంచి పట్టా భూములను తొలగించాలి



**గుమ్మడిదల, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** అనంతారం పరిధిలోని చట్టబద్ధమైన పట్టా భూములను 22ఏ నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగించాలని కోరుతూ సర్పంచ్ కొమ్ము శ్రీను, ఉప సర్పంచ్ యాదిరెడ్డి గుమ్మడిదల మండల కేంద్రంలోని ప్రజావాణిలో ఎంపీడీవో ఉమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధులకు కేటాయించిన భూములు, ఆర్డీవో అనుమతులు, రిజిస్టర్డ్ విక్రయ పత్రాలు ఉన్నప్పటికీ 22ఏ జాబితాలో చేర్చడంతో యజమానులు లావాదేవీలు నిర్వహించలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంబంధిత రికార్డులను పరిశీలించి అర్హత ఉన్న భూములను ఆ జాబితా నుంచి తొలగించాలని వారు కోరారు.

# కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ భారీ ధర్నా

**మహబూబ్‌నగర్, బ్యూరో సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** కేంద్ర ఎన్నికల సంఘం, ముఖ్యంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వ్యవహరిస్తున్న తీరుపై, సార్ ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలకు నిరసనగా ఏ ఐ సి సి పిలుపు మేరకు సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన ధర్నా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎ. సంజీవ్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాకు ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జి. మధుసూదన్ రెడ్డి, తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ...దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికలు కీలకం. ఓటర్ల జాబితా సవరణ, సార్ ప్రక్రియకు సంబంధించి పలు ప్రశ్నలు, అభ్యంతరాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతపై స్పష్టమైన వివరణ అవసరం. ప్రజల ఓటు హక్కు విషయంలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా స్వతంత్రంగా పరిశీలన



జరగాలి. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత. రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తాం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కమిటీ సభ్యులు, మండల, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచులు, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యూ ఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం రుణాలు ఇవ్వాలి



**జడ్చర్ల, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువతకు 100 శాతం రాయితీతో రూ.5 లక్షల రుణాలను వెంటనే అందించాలని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం జడ్చర్ల మండల విద్యా వనరుల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025 జూన్ 2న రుణాలు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం, ఇప్పటివరకు ఆ హామీని అమలు చేయలేదన్నారు. రాబోయే ఎమ్మెల్సీ, స్థానిక సంస్థలు, జీహెచ్ఎంసీ, మున్సిపల్ ఎన్నికల్లో ఓట్ల కోసమే ఈ పథకం అమలును వాయిదా వేస్తూ వచ్చారని ఆరోపించారు. నవంబర్ 19 నుంచి తొలి విడతగా రూ.1 లక్ష ఇస్తామని చెప్పడం వెనుక ఎన్నికల కుట్ర ఉందని విమర్శించారు. అర్హులైన నిరుద్యోగులందరికీ వెంటనే 100 శాతం రాయితీతో రుణాలు ఇచ్చి ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గొడుగు నర్సిములు, సురభి విజయ్ కుమార్, గోపాల్, కావలి గోపాల్, సురభి రఘు, చెన్నయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై పోరాటం చేయాలి




**ఉప్పునుంతల, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** భగత్‌సింగ్ ఆశయాల సాధన కోసం విద్యార్థులు ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు చింతల నాగరాజు, మండల నాయకులు భరత్, కృష్ణ, కార్తీక్ పిలుపునిచ్చారు. సోమవారం ఉప్పునుంతల మండలంలోని కంసానిపల్లి, ఉప్పునుంతల పాఠశాలల్లో విద్యార్థులతో కలిసి భగత్‌సింగ్ 119వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన లౌకిక, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. భగత్‌సింగ్ ఆశయాలతో యువత ముందుకు సాగాలని, ఆయన జీవితం, ఆలోచనలు నేటి విద్యార్థులకు, యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన సాగించిన పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుతోపాటు సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలని, యువతలో ప్రశ్నించే తత్వం, సామాజిక చైతన్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. విద్యారంగంలో అసమానతలను రూపుమాపి, అందరికీ శాస్త్రీయ విద్యను అందించాలని కోరారు. కులమత భేదాలు లేని సమాజ నిర్మాణం కోసం యువత ముందుకు సాగడమే భగత్‌సింగ్‌కు అందించే ఘనమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థులు వినయ్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధులే లక్ష్యంగా సైబర్ మోసాలు

- సైబర్ క్రైమ్ ఎస్ఐ శ్రవణ్ కుమార్

**మహబూబ్ నగర్ ప్రతినిధి, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** వృద్ధులు, వయోవృద్ధులే లక్ష్యంగా చేసుకుని ఎక్కువగా సైబర్ మోసాలు జరుగుతున్నవని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ ఎస్ఐ శ్రవణ్ కుమార్ సూచించారు. అక్టోబర్ 1 న జరిగే అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జరుగుతున్న వారోత్సవాల సందర్భంగా, జిల్లా ఎస్పీ జానకి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా కేంద్రం మెట్టుగడ్డ లో గల 'ప్రణామ్ డే కేర్ సెంటర్' లో నిర్వహించిన సైబర్ మోసాల పై అవగాహన సదస్సులో జిల్లా సంక్షేమ అధికారిణి జరీనా బేగం పాల్గొనగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముఖ్యంగా ఈమధ్య కాలంలో ఎక్కువగా వృద్ధులను డిజిటల్ అరెస్టు పేర పోలీసులు,సీబీఐ అధికారులమంటూ నకిలీ వీడియో కాల్స్ చేసి భయపెట్టి డబ్బులు గుంజడం లాంటివి చేస్తున్నారని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలంటూ ఆశ చూపి మోసం చేయడం, లాటరీ, గిఫ్ట్ తగిలిందంటూ నమ్మించి డబ్బులు కట్టించుకోవడం, ఓటీపీ, పాస్వర్డులు చెప్పాలని అడగడం లాంటి అనేక మోసాలకు



పాల్పడుతున్నారని హెచ్చరించారు. ఆధార్ నెంబర్, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ లు ఎవరికీ చెప్పకూడదని, తెలియని లింకులు, ఎస్ఎంఎస్ లు, ముఖ్యంగా 'ఏపీకే ఫైల్స్' లింకులను అసలే ముట్టరాదని, అనుమానాస్పద కాల్స్ లను ఎత్తరాదని అన్నారు. సైబర్ క్రైమ్ మోసానికి గురైనప్పుడు వెంటనే 1930 కు కానీ, సమీప పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ఫోరం ఉపాధ్యక్షుడు రాజసింహుడు, కార్యదర్శి నస్కంటి నాగభూషణం, సూపరింటెండెంట్ నర్మద, రాధ, తదితర సిబ్బంది , వృద్ధులు పాల్గొన్నారు.

## మద్యం, మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి



**తెలకపల్లి, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** యువత, విద్యార్థులు మద్యం, మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని ఏఎన్ఎం కవిత, పుష్ప, శాంత, శ్రీదేవి, హెల్త్ అసిస్టెంట్లు సందీప్ రెడ్డి, రవీందర్ రావు సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నశా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మహాత్మా జ్యోతిబా పూలే బాలుర, బాలికల పాఠశాలలు, తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులతో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. సోమవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత మద్యం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు తమ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులను కూడా వాటికి దూరంగా ఉంచేందుకు కృషి చేయాలని సూచించారు. మద్యం, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రతి ఒక్కరికీ వివరించి, దేశాన్ని నశా ముక్త్ భారత్‌గా మార్చేందుకు కృషి చేయాలని కోరారు. ప్రతి పౌరుడు నషా ముక్తి మిత్రగా మారి మాదకద్రవ్యాల నిర్మూలనకు తన వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు భారతమ్మ, పుష్ప, కురువమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి అధికారులు డుమ్మా

- ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన

**రాజోళి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** ప్రజల సమస్యలు వినాల్సిన ప్రజావాణి కార్యక్రమంలోనే అధికారులు కనిపించకపోవడంతో రాజోళిలో అఖిలపక్ష నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి పలువురు అధికారులు గైర్హాజరు కావడంతో నాయకులు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కొత్త రాజోళి పునరావాస గృహాల వద్ద భూమిని కొందరు కబ్జా చేశారంటూ ఫిర్యాదు చేసేందుకు వచ్చిన అఖిలపక్ష కమిటీ సభ్యులకు సంబంధిత రెవెన్యూ అధికారులు అందుబాటులో లేకపోవడంతో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలంటూ ఎంపీడీవో అబ్దుల్ సయ్యద్ ఖాన్‌ను



నిలదీశారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు ప్రజావాణికి హాజరుకాకపోవడంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారుల గైర్హాజరుపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విజయ్ కుమార్, భూషణం, నిషాక్, గోవర్ధన్ రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఏరియా ఆసుపత్రి వరద నివారణకు చర్యలు



**జడ్చర్ల, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** జడ్చర్ల కల్వకుర్తి రోడ్డులోని ఏరియా ఆసుపత్రి వద్ద వర్షపు నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అధికారులు ఆసుపత్రి పరిసరాలను సోమవారం పరిశీలించారు. వచ్చే వర్షాకాలం నాటికి నీటి నిల్వ సమస్య లేకుండా కల్వర్టు నిర్మాణం, అనుసంధాన రహదారి పనులను పూర్తి చేయాలని నిర్ణయించారు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకుని త్వరలోనే నిధుల అంచనాలు సిద్ధం చేసి పనులు ప్రారంభిస్తామని, రోగులు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ్ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ గిరీష్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గాయత్రి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించి బలోపేతం చేయాలి




**తూప్రాన్, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** ప్రభుత్వ రంగ సంస్థలు దేశ ఆర్థికాభివృద్ధికి, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడానికి ఎంతో కీలకమైనవని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈశ్వర్ రావు అన్నారు. "ప్రభుత్వ రంగ సంస్థలు – వాటి పరిరక్షణ" అంశంపై తూప్రాన్ లోని శివ సాయి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు దేశ ప్రజల ఆస్తులని, వాటిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం వల్ల ప్రజా ప్రయోజనాలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. విద్యుత్, బ్యాంకింగ్, రవాణా, ఉక్కు, బొగ్గు తదితర కీలక రంగాల్లో ప్రభుత్వ రంగ సంస్థలు దేశ అభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను పరిరక్షించడంతో పాటు కనీస వేతనాలు, సామాజిక భద్రత, ఉద్యోగ భద్రత వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసే విధానాలను ఉపసంహరించుకుని, వాటి అభివృద్ధికి అవసరమైన నిధులు, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ అనేది ఉద్యోగులు, కార్మికుల సమస్య మాత్రమే కాదని, అది దేశ ప్రజల ప్రయోజనాలకు సంబంధించిన అంశమని ఈశ్వర్ రావు పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడానికి కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు ఐక్యంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సదస్సులో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షులు మహేందర్ రెడ్డి,జిల్లా అధ్యక్ష,కార్యదర్శిలు నర్సశీలు.రవీంద్ర ప్రసాద్, అడ్వైజర్ స్వామి, ఉపాధ్యక్షులు నాగరాజు, ఫాసి, హనుమంత్ అశోక్, వెంకటేష్, శ్రీను యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## పరశురాంపల్లి గ్రామ తరలింపునకు సానుకూలం



- స్పందించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క..

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం పరశురాంపల్లి గ్రామ తరలింపునకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. సోమవారం హైదరాబాద్ ప్రజా భవన్ లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబులకు గ్రామస్తులు వినతిపత్రం అందించారు. గ్రామ రైతులు సాగు చేసుకునే భూములు ఓసి–3 లో కోల్పోవడం, బ్లాస్టింగ్ వల్ల ఇళ్లు పగుళ్లకు గురై నివాసం ఉండడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కాలుష్యం వల్ల అనారోగ్యాలకు గురవుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించి గ్రామాన్ని తరలించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో గణపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాళ్లపల్లి భాస్కర్ రావు, నాయకులు చింతిరెడ్డి సమ్మిరెడ్డి, కొడారి బాబు యాదవ్, పలకల రామ్ రెడ్డి, పెంట రవీందర్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ ఉడత రవి, ఎర్రం సదానందం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వృద్ధులు, ఫిర్యాదు దారుల సమస్యను పరిష్కరించాలని వినతి




- దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** వరంగల్ జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వృద్ధులు, మహిళలు వివిధ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు రావడంతో సోమవారం ప్రజావాణి సమస్యల పరిష్కారం కోసం వచ్చి వినతి పత్రాలు సమర్పించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 220దరఖాస్తులు వచ్చాయని, వాటిలో రెవెన్యూ శాఖకు 56, జీడబ్ల్యూఎంసీకి 74, హౌసింగ్ శాఖకు 16, డీఆర్డీవో 15 రాగా ఇతర శాఖలకు సంబంధించిన 59 దరఖాస్తులు వచ్చాయి. అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు వెంటనే ఎండార్స్ చేసి, సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో రెవెన్యూ, హౌసింగ్, జీడబ్ల్యూఎంసీ, డిఆర్డిఓ శాఖల పరిధిలో అధికంగా దరఖాస్తు వచ్చాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజావాణి దరఖాస్తులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. వ్యక్తిగత పెన్షన్లు ప్రభుత్వ పథకాల గురించి వచ్చిన వృద్ధులు తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి చర్యలు చేపట్టాలని విన్నవించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్ కిషోర్ కుమార్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, జడ్పీ సీఈవో వసంత, డీఎంహెచ్‌వో డా రాజి రెడ్డి,కలెక్టరేట్ సూపరిడెంట్ విశ్వప్రసాద్ తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కటాక్షపురం పెద్ద చెరువు కబ్జా చేస్తున్నారు




- ఇప్పటికీ వందల ఎకరాల భూములు కబ్జా చేశారు
- మీరేనా పట్టించుకోండి సార్....
- రెవెన్యూ అధికారులకు ఎంపీడీవోకు ఫిర్యాదు చేసిన సర్పంచ్ మౌలా

**ఆత్మకూరు, సెప్టెంబర్ 28 (జనం సాక్షి):** జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న కటాక్షపురం పెద్ద చెరువు ప్రభుత్వ శిఖం భూములు కోట్లాది రూపాయల విలువచేసే వందలాది ఎకరల భూములు కబ్జాలు చేస్తున్నారు. మీరైనా పట్టించుకోండి సార్ అంటూ సర్పంచ్ మౌల ప్రజావాణి లో ఫిర్యాదు చేశారు. సోమవారం ఆత్మకూరు మండలం హౌస్ బుజర్గ్ గ్రామంలోని కటాక్షపురం పెద్ద చెరువు ప్రభుత్వం అధికారులతో కుమ్మకై పట్టాలు చేయించుకుం టున్నారని గ్రామస్తులు ఉపసర్పంచ్ లక్ష్మీరాంబాయి వార్డు మెంబర్లు కరీం మౌలానా, గోబీ హుస్సేన్, కమల్ సలీం పాషా, గ్రామస్తులు కుమారస్వామి, సైదోలీలు అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం సర్పంచ్ మౌలా మాట్లాడుతూ కటాక్షపురం పెద్ద చెరువు 1800 ఎకరాల చెరువులో దాదాపు 300 ఎకరాల కబ్జా గురైందని పలుమార్లు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. మండల రెవెన్యూ అధికారులు కబ్జాదారులతో కుమ్మక్కై ప్రభుత్వ భూములను పట్టాలిస్తున్నారని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కూడా ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి పూర్తిస్థాయిలో విచారణ చేసి హద్దులు ఏర్పాటు చేయాలని కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని వేడుకొన్నారు.

## జైనూర్ సీహెచ్‌సీలో 24 గంటల్లో ఆరు ప్రసవాలు



- 6 ప్రసవాలు సురక్షితంగా జరిగాయి
- సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్

**జైనూర్, సెప్టెంబర్28 (జనంసాక్షి) :** జైనూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో 24 గంటల వ్యవధిలో ఆరు ప్రసవాలు విజయవంతంగా నిర్వహించినట్లు సీహెచ్‌సీ సుప్రింటెండెంట్ డాక్టర్ అశోక్ తెలిపారు. ఈ ఆరు ప్రసవాల్లో తల్లులు, శిశువులు సురక్షితంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ మాట్లాడుతూ.. జైనూర్ సీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 24 గంటల వ్యవధిలో ఆరు ప్రసవాలు జరగడం, అన్ని ప్రసవాలు సురక్షితంగా పూర్తవడం సంతోషకరమైన విషయమన్నారు. గర్భిణులకు అవసరమైన వైద్య సేవలు, ప్రసవ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. ప్రసవాల సమయంలో వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బంది సమన్వయంతో పనిచేశారని చెప్పారు. తల్లులు, శిశువుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన వైద్య సేవలు అందించినట్లు డాక్టర్ అశోక్ వెల్లడించారు. జైనూర్ సీహెచ్‌సీపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా వైద్య సిబ్బంది సమిష్టిగా పనిచేస్తున్నారని, గర్భిణులు ప్రసవం కోసం చివరి సమయం వరకు వేచి ఉండకుండా ముందుగానే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని ఆయన సూచించారు.

# మహిళా సంఘాలకు ప్రభుత్వ తోడ్పాటు

- సౌర వెలుగులతో ఆదర్శ గ్రామంగా జగన్నపేట
- జాతీయస్థాయి కరాటే పోటీలో జగ్గన్నపేట ఆశ్రమ విద్యార్థినుల ప్రతిభ
- రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 28(జనంసాక్షి) :** మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా , మహిళా సంఘాలకు ప్రజా ప్రజా ప్రభుత్వం నిరంతరం తోడ్పాటును అందిస్తుందని, సౌర విద్యుత్ వినియోగాన్ని గ్రామీణ ప్రాంతాలకు విస్తరించి కుటుంబాలపై విద్యుత్ భారం తగ్గించడంతోపాటు మిగులు విద్యుత్ ద్వారా అదనపు ఆదాయం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. సోమవారం ములుగు మండలం జగ్గన్నపేట గ్రామంలో ప్రధానమంత్రి సూర్యఘర్ ఉచిత విద్యుత్ పథకం కింద రెండు గృహాలపై ఒక్కొక్కటి రెండు కిలోవాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ ప్లాంట్లను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో ఎంపిక చేసిన ఒక గ్రామాన్ని ప్రయోగాత్మకంగా ఆదర్శ సౌర గ్రామంగా తీర్చిదిద్ది, అనంతరం ఈ కార్యక్రమాన్ని అన్ని గ్రామాలకు విస్తరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. జగ్గన్నపేట గ్రామంలో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు అర్హత కలిగిన 82 గృహాలను గుర్తించినట్లు తెలిపారు. ఒక రెండు కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంటు ద్వారా నెలకు సుమారు 240 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని తెలిపారు. ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను కుటుంబ అవసరాలకు వినియోగించుకోవచ్చని, మిగులు విద్యుత్‌ను విద్యుత్ సంస్థకు యూనిట్‌కు రూ. 2.571 చొప్పున విక్రయించి అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. ప్రజలు సౌర విద్యుత్ వినియోగంపై అవగాహన పెంచుకొని పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధి హామీ పథకం 2026–27 నిధులు రూ. 10 లక్షలతో నిర్మించిన శ్రీ సీతారాముల మహిళా గ్రామ సమాఖ్య భవనాన్ని జిల్లా కలెక్టర్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. రెండు నెలల్లో భవన నిర్మాణాన్ని పూర్తి చేసిన గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామ సమాఖ్య ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, సంబంధిత అధికారులను అభినందించారు. భవనాన్ని మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, స్వయం ఉపాధి కార్యకలాపాలకు సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. కుట్టు మిషన్లు పొందిన మహిళలకు అవసరమైన శిక్షణ అందించి పాఠశాల విద్యార్థుల ఏకరూప దుస్తులు, అంగన్‌వాడీ దుస్తుల తయారీ పనులు అప్పగించేలా చర్యలు చేపడతామన్నారు. గ్రామానికి చెందిన సుమారు 175 మంది మహిళలకు ఇప్పటికే కుట్టు మిషన్లు అందించినట్లు తెలిపారు. మహిళలు వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. విస్తరాకుల తయారీకి అవసరమైన ముడిసరుకును మహిళా సంఘాలకు అందుబాటులోకి తీసుకురావడంతోపాటు తయారైన ఉత్పత్తుల విక్రయానికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పాడి పశువుల పంపిణీ, స్వయం ఉపాధి యూనిట్లు, నైపుణ్య శిక్షణ ద్వారా మహిళలకు స్థిరమైన ఆదాయం కల్పిస్తామని తెలిపారు. గ్రామంలోని మూడు మహిళా గ్రామ సమాఖ్యలకు భవనాలు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. అర్హులైన నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలలో మొదటి ప్రాధాన్యం కల్పించాలని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు సూచించారు. ఆకలితో ఉన్నవారికి ముందుగా అన్నం పెట్టాలనే విధానంతో అత్యంత పేద కుటుంబాలకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. మారుమూల గ్రామాలు, దళితవాడలు, తండాలు, గూడాల్లో రహదారులు, విద్యుత్, గృహాలు, తాగునీరు వంటి మౌలిక వసతులను దశలవారీగా కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. జగ్గన్నపేటలో సామాజిక భవనం, విద్యుత్ ఉపకేంద్రం, రైతుల ధాన్యం నిల్వకు గోదాం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు, ఆసరా పింఛన్లు అందించేందుకు సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. కొత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను స్థానిక రైతులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. అనంతరం ఢిల్లీ వేదికగా జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో మూడో స్థానం సాధించిన జగ్గన్నపేట ఆశ్రమ పాఠశాల విద్యార్థినులను మంత్రి అభినందించారు. ఆగస్టు 6 నుంచి 9వ తేదీ వరకు జరిగిన పోటీల్లో పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులు పాల్గొనగా, ఇద్దరు విద్యార్థినులు మూడో స్థానం సాధించారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన ఇద్దరు విద్యార్థినులకు మంత్రి చేతుల మీదుగా పతకాలు అందజేశారు. విద్యార్థినులకు కరాటేలో శిక్షణ ఇచ్చి జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దిన పాఠశాల వ్యాయామ విద్యా ఉపాధ్యాయుడు అజ్మీరా రాజునాయక్ ను మంత్రి సన్మానించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం మహిళా సంఘాల ఆధ్వర్యంలో కుట్టిన ఏకరూప దుస్తులను జిల్లా కలెక్టర్‌తో కలిసి మంత్రి విద్యార్థులకు పంపిణీ చేశారు. మహిళా సంఘాలు తయారుచేసిన వస్తువులకు ప్రభుత్వపరంగా ప్రోత్సాహం అందించి స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్, ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ భిక్షపతి, జిల్లా విద్యాశాఖాధికారి సిద్ధార్థరెడ్డి, అదనపు పీడీ శ్రీనివాస్, డీపీఎం, ఏపీఎం, స్థానిక సర్పంచ్ వెంకన్న, టీజీ రెడ్కో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములకు హద్దులు ఏర్పాటు చేయాలి

- ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**కాజీపేట, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** మడికొండ గ్రామంలో క్రైస్తవ, ముస్లిం మతస్తులకు స్మశాన వాటికల కేటాయింపునకు ప్రతిపాదించిన స్థలాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు. స్థలానికి సంబంధించిన వివరాలు, భూమి విస్తీర్ణం, అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమి తదితర అంశాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్మశాన వాటిక కేటాయింపునకు సంబంధించి అవసరమైన స్థల పరిశీలన, రికార్డుల పరిశీలన పూర్తి చేసి, అవసరమైన ప్రతిపాదనలను నిబంధనల ప్రకారం సమర్పించాలని ఆర్డీఓ వెంకటేష్, కాజీపేట తహసీల్దార్ రాజును జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా వాటి పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ప్రభుత్వ భూములకు సంబంధించిన ఖాళీ ప్రదేశాలను గుర్తించి, వాటి చుట్టూ స్పష్టమైన హద్దులు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల వివరాలను రికార్డులతో క్షేత్రస్థాయిలో సరిపోల్చి పరిశీలించాలని, ప్రభుత్వ భూములపై అనధికార ఆక్రమణలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే గుర్తించిన ప్రభుత్వ భూముల పరిరక్షణకు అవసరమైన చర్యలను ప్రాధాన్యతతో చేపట్టాలని తెలిపారు. ప్రజా అవసరాల కోసం ప్రభుత్వ భూములను కేటాయించే సందర్భంలో భూమి స్థితిగతులు, రికార్డులు, స్థల అనుకూలత తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి, అవసరమైన ప్రతిపాదనలను త్వరితగతిన సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ స్థల పరిశీలన కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, కాజీపేట తహసీల్దార్ రాజు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మార్గ నిర్దేశం చేసారు.. భోజనం వడ్డించారు

- పోలీస్ ఉద్యోగాల శిక్షణార్థులకు అన్నదాన సేవ అభినందనీయం
- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**మావల సెప్టెంబర్ 29( జనం సాక్షి) :** బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో స్థానిక బీసీ స్టడీ సర్కిల్‌లో కానిస్టేబుల్, సబ్ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఉద్యోగాల కోసం ఎంపికైన 200 మంది అభ్యర్థులకు 60 రోజుల ఉచిత శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. శిక్షణ పొందుతున్న అభ్యర్థుల సౌకర్యార్థం ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో రెండు నెలల పాటు ఉచిత అన్నప్రసాద సేవ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ఉచితంగా పోషకాహారంతో కూడిన అన్నప్రసాదాన్ని అందిస్తున్న ఇస్కాన్ నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు కష్టపడి చదివి, అందుబాటులో ఉన్న శిక్షణ, వసతులను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం కలెక్టర్ స్వయంగా అభ్యర్థులకు భోజనం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థుల శిక్షణ, పరీక్షల సన్నద్ధత, ప్రిపరేషన్ విధానంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ టెంపుల్ ప్రతినిధి ప్రణవ నంద ప్రభుజీ, బీసీ సంక్షేమ శాఖ అధికారి సోనియా, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్, శిక్షణార్థులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ ఆశయాలే యువతకు స్ఫూర్తి

- ఆప్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్





**నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** భగత్‌సింగ్ ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్ అన్నారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా నిర్మల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ హైదర్ మాట్లాడుతూ.. భగత్‌సింగ్ కేవలం వ్యక్తి కాదని, విప్లవ స్ఫూర్తికి ప్రతీక అని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం 23 ఏళ్ల వయసులోనే ప్రాణత్యాగం చేసిన ఆయన జీవితం యువతకు ఆదర్శమన్నారు. అన్యాయంపై పోరాడటం, సమానత్వం, సామాజిక న్యాయం కోసం కృషి చేయడమే భగత్‌సింగ్‌కు నిజమైన నివాళి అని తెలిపారు. కార్యక్రమంలో ఆప్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ వినోద్‌కుమార్, ట్రెజరర్ అబ్దుల్ సాధిక్, వైస్ ప్రెసిడెంట్ బైండ్ల శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి మెరుగు రాజన్న, టౌన్ వైస్ ప్రెసిడెంట్ సాజిద్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాసమస్యలను స్వయంగా తెలుసుకున్న ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో

**ఏటూరునాగారం, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో ప్రజల నుంచి దరఖాస్తులను స్వయంగా స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 63 దరఖాస్తులు అందగా, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని నిబంధనల మేరకు సమస్య లను త్వరితగతిన పరిస్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత మరియు నిబంధనల మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ (జనరల్) టీవీఆర్ దామోదర్ స్వామి, డిప్యూటీ డైరెక్టర్ డి జనార్దన్, ఈ ఈ( టిడబ్ల్యూ) ప్రవీణ్, ఎస్ డిసి ప్రతాప్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 70 ఏళ్ల నాటి హద్దురాయితో గ్రామ సరిహద్దుల గుర్తింపు



**నల్లబెల్లి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** 70 ఏళ్ల నాటి హద్దురాయితో గ్రామ సరిహద్దులను గుర్తించినట్లు తహసిల్దార్ ముప్పు కృష్ణ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ – సర్వేలో భాగంగా మండలంలోని అర్షనపల్లి గ్రామంలో సోమవారం భూ రీ–సర్వే ప్రక్రియను రెవెన్యూ అధికారులు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కృష్ణ మాట్లాడుతూ... గ్రామంలో చేపట్టిన సర్వేలో సుమారు 70 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన హద్దురాయినీ గుర్తించినట్లు చెప్పారు. పాత హద్దురాయిని ఆధారంగా చేసుకుని గ్రామ సరిహద్దులను పరిశీలించి, హద్దులను నిర్ణయించినట్లు తెలిపారు. ఈ.కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, మండల సర్వేయర్లు, జీపీఓలు పాల్గొన్నారు.

# కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా సమరశంఖం

- భూమి, నీరు, అడవులపై ప్రజల హక్కుల కోసం పిలుపు

**ఖమ్మం, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** ఎర్రజెండాల రెపరెపలు... పోరాట నినాదాల హోరు... డప్పుల దరువులు... కళాకారుల విప్లవ గీతాలు... వేలాది గొంతుల నుంచి ఒక్కటైన నినాదం.. రైతు--కూలీ ఐక్యతకు ఖమ్మం పురవీధులు వేదికగా నిలిచాయి. వ్యవసాయ కార్పొరేటీకరణను వ్యతిరేకిస్తూ, దున్నేవాడికే భూమి కావాలని, రైతులు, వ్యవసాయ కూలీలు, ఆదివాసీలు, గ్రామీణ పేదల హక్కుల పరిరక్షణ కోసం అఖిల భారత రైతు కూలీ సంఘం నాల్గవ జాతీయ మహాసభల సందర్భంగా సోమవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన రైతులు, కూలీలు, ఆదివాసీలు, మహిళలు, యువత ఎర్రజెండాలు చేతబూని కదం తొక్కారు. కాన్ఫరెన్స్ గ్రౌండ్ నుంచి ప్రారంభమైన ప్రదర్శన ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల మైదానానికి చేరుకునే వరకు ఖమ్మం నగరం పోరాట నినాదాలతో దద్దరిల్లింది.

**ఎర్రదండుగా కదిలిన రైతాంగం**



ఎర్ర దుస్తులు.. చేతుల్లో ఎర్రజెండాలు.. నోట పోరాట నినాదాలు.. వేలాది మంది ఒకే బాటలో సాగిన దృశ్యం రైతాంగ ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. కుల, ప్రాంత, భాషా భేదాలను దాటి రైతు--కూలీ వర్గాలు ఒకే వేదికపైకి వచ్చాయి. ప్రదర్శనకు అగ్రభాగంలో అరుణోదయ కళాకారులు సాగారు. కొమ్ము నృత్యాలు, కోలాటాలు, డప్పు నృత్యాలు, గొంగడి నృత్యాలు, కోయ నృత్యాలతో కళాకారులు ప్రజా పోరాట స్ఫూర్తిని ప్రతిబింబించారు. డప్పుల దరువులకు అనుగుణంగా సాగిన ప్రదర్శనతో నగర వీధులు ఉద్యమ గీతాలతో మార్మోగాయి. కళాశాల మైదానంలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య అధ్యక్షత వహించారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధానాలకు వ్యతిరేకంగా దేశంలోని రైతు సంఘాలన్నీ ఐక్యం కావాలని వేములపల్లి వెంకట్రామయ్య పిలుపునిచ్చారు.

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందాలు వ్యవసాయానికి ముప్పు

ఏఐకేఎంఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆశిష్ మిట్టల్ మాట్లాడుతూ భారత్--అమెరికా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విత్తనాలు, ఎరువులు, విద్యుత్, వ్యవసాయ యంత్రాల ధరలు పెరగడం, మార్కెట్లపై కంపెనీల ఆధిపత్యం, రైతుల అప్పుల భారం వంటి సమస్యలు వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెడుతున్నాయని అన్నారు. వ్యవసాయ భూముల ఆక్రమణ, బలవంతపు నిర్వాసితీకరణ, ఆదివాసీల అటవీ హక్కులపై దాడులు, గ్రామీణ ఉపాధిపై కోతలకు వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన మంజుల



**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** దేశ్‌ముఖి గ్రామంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ప్రిపరేటరీ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్ విద్యార్థిని దేగావత్ మంజుల రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటింది. హన్మకొండలోని జే.ఎన్. స్టేడియంలో సెప్టెంబర్ 26, 27 తేదీల్లో నిర్వహించిన 12వ తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో మంజుల 5,000 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం, 4ఐ100 మీటర్ల రిలేలో బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ, మంజుల సాధించిన విజయం కళాశాలకు గర్వకారణమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. మంజులను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు.

## ఏసీబీ వలకు చిక్కిన అవినీతి చేప ఆర్ఐ గోపరాజు



**నాంపల్లి, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** నాంపల్లి తాసిల్దార్ కార్యాలయంలో 15000 లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన ఆర్ఐ రాళ్లబండి గోపరాజు మండలంలోని ఓ రైతు పౌతి కోసం రాగా డబ్బులు డిమాండ్ చేసిన ఆర్ఐ తన అసిస్టెంట్ ప్రైవేట్ ఉద్యోగి అయిన ఎదుల్ల యాదగిరి ద్వారా 15000 రూపాయలు లంచంగా తీసుకుంటుండగా ప్రత్యక్షంగా పట్టుకొని అరెస్ట్ చేసి వీరి ఇద్దరిని ఏసీబీ స్పెషల్ కోర్టు లో హాజరుపరుస్తామని తెలిపారు.నాంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో లంచాలు ఇవ్వనిది పనులు అవడం లేదు అని రైతులు వాపోతున్నారు,ప్రజలను ఇబ్బందులకు గురిచేసి లంచాల కోసం పట్టి పీడిస్తున్న అధికారుల మీద ప్రత్యేక నిఘా పెట్టి అలాంటి వారిమీద చర్యలు తీసుకోవాలి అని నాపల్లి మండల ప్రజలు కోరుతున్నారు.

## పాఠశాల, ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** చుంచుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాత కొత్తగూడెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్)ను జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన, ఉపాధ్యాయుల హాజరు, విద్యా ప్రమాణాలు, పరిసరాల పరిశుభ్రతతో పాటు ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, మందుల నిల్వలు, సిబ్బంది హాజరు, ల్యాబొరేటరీ సేవలను పరిశీలించారు. ముందుగా చుంచుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ పాఠశాల ఆవరణను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు పట్టికను తనిఖీ చేసి విధులకు హాజరైన, సెలవులో ఉన్న ఉపాధ్యాయుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. హాజరు పట్టికలో నమోదైన వివరాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఆయా తరగతి గదుల్లో అందుబాటులో ఉన్నారా లేదా అనే అంశాన్ని స్వయంగా పరిశీలించారు. వివిధ తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠ్యాంశాలపై వారి అవగాహనను తెలుసుకున్నారు. విద్యార్థులకు అందుతున్న బోధన, వారి అభ్యసన స్థాయిని పరిశీలించారు. పదో తరగతి తరగతి గదిలో ఉపాధ్యాయుడు అందుబాటులో లేకపోవడంపై కలెక్టర్ ఆరా తీశారు. ఇందుకు సరైన



సమాధానం లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పాత కొత్తగూడెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, వైద్యాధికారితో మాట్లాడి కేంద్రం ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, రోజువారీగా వచ్చే ఓపీ రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ సుమారు 50 నుంచి 60 మంది వరకు ఓపీకి వస్తున్నట్లు అధికారులు తెలిపారు. రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ నాగరాజు, ఎంఈఓ నీరజ, పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి, నర్సులు సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీతారామ ప్రాజెక్ట్ కాలువ బాధితులకు నష్ట పరిహారం ఇవ్వాలి



**కామేపల్లి, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణం వల్ల భూములు కోల్పోయిన రైతులకు ప్రస్తుత భూమి మార్కెట్ విలువ ప్రకారం ఎకరాకు రు 25 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఖమ్మం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం వైరా డివిజన్ కార్యదర్శి దుగ్గి కృష్ణ మాట్లాడుతూ.. కామేపల్లి మండల రెవెన్యూ పరిధిలోని తాళ్లగూడెం గ్రామంలోను, మద్దులపల్లి రెవెన్యూ పరిధిలోను గతంలోనే అధికారులు భూ సర్వే నిర్వహించినప్పటికీ ఇప్పటి వరకు పరిహారానికి సంబంధించిన చెక్కులు జారీ చేయకపోవడం దారుణమన్నారు. భూములు కోల్పోయి ఏళ్లు గడుస్తున్నా పరిహారం అందక రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండు గ్రామాల పరిధిలోని రైతులకు ప్రస్తుతం ఉన్న వ్యాల్యూషన్ ప్రకారం తక్షణమే పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. కామేపల్లితో పాటు సింగరేణి, ఏనుకూరు మండలాల్లో సీతారామ కాలువ కింద భూములు కోల్పోయిన ప్రతి రైతుకు న్యాయమైన నష్టపరిహారం అందే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సింగం వెంకన్న,జారే గోపయ్య, వసంతరావు, నాగమణి,రమేష్, వెంకటేశ్వరరావు, నాదెండ్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

## టాస్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ఆధ్వర్యంలో అక్టోబర్ 11 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డిలతో కలిసి సంబంధిత అధికారులతో పరీక్షల నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్షించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి జిల్లాలో టాస్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల కోసం రెండు పరీక్షా కేంద్రాలను గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ దుకాణాలను పరీక్షల సమయంలో మూసివేయించాలని, పరీక్షలు జరిగే సమయంలో 163 బీఎన్ఎస్‌ను అమలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి సదానందం, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం వద్ద తగ్గుతున్న గోదావరి నీటిమట్టం



**భద్రాచలం, సెప్టెంబరు 28 (జనంసాక్షి) :** భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. సోమవారం సాయంత్రం 5 గంటలకు 36.9 అడుగులకు చేరింది. ఆదివారం రాత్రి 9 గంటలకు 42.80 అడుగులకు చేరిన వరద నీరు సోమవారం ఉదయం 8 గంటలకు 39.90 అడుగులకు, మద్యాహ్నం 12 గంటలకు 38.40 అడుగులకు, సాయంత్రం 5 గంటలకు 36.9 అడుగులకు చేరుకుంది. మంగళవారం ఉదయం మరింతగా తగ్గే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ అధికారులు పేర్కొంటున్నారు. గోదావరి ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పాటు వర్షాలు సైతం లేకపోవడంతో గోదావరి నీటిమట్టం క్రమేపి తగ్గుతోంది.

# ఆరోగ్య భద్రతకు పెద్దపీట

- రూ.21.64 కోట్ల సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీ సాయం
- 5,123 మందికి ఆర్థిక చేయూత
- ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి

**కోదాడ, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** కోదాడ నియోజకవర్గ ఎమ్మెల్యేగా తాను ఎన్నికైన నాటి నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గ వ్యాప్తంగా 5,123 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి, ఎల్ఓసి ద్వారా మొత్తం రూ.21,64,96,850 కోట్లు ఆర్థిక సహాయం అందించినట్లు కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి తెలిపారు.సోమవారం 25 విడత మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్దిదారులకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి గారు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటి వరకు సీఎంఆర్ఎఫ్ కింద 4,895 చెక్కుల ద్వారా రూ.16,92,71,850, అలాగే ఎల్ ఓ సి కింద 228 చెక్కుల ద్వారా రూ.4,72,25,000 ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు.మొత్తం 5,123 చెక్కుల ద్వారా రూ.21,64,96,850 ఆర్థిక సహాయం అందించినట్లు వెల్లడించారు.25వ విడతలో మరో 295 మందికి రూ.1.22




కోట్లకు పైగా సీఎంఆర్ఎఫ్ సహాయ నిధి 25వ విడతలో కోదాడ నియోజకవర్గానికి 295 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.1,22,42,850 విలువైన చెక్కులు మంజూరైనట్లు తెలిపారు.25వ విడతలో భాగంగా కోదాడ మండలం, కోదాడ పట్టణం, అనంతగిరి, చిలుకూరు మండలాల పరిధిలోని లబ్ధిదారులకు చెక్కులు అందజేయడం జరిగిందని ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి తెలిపారు.పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య చికిత్స సమయంలో ఆర్థిక భరోసా కల్పించేందుకు సీఎంఆర్ఎఫ్ ఎల్ ఓ సి ద్వారా అందుతున్న సహాయాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సూచించారు.

## అర్హులైన పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి



**సూర్యాపేట, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** అర్హులైన పట్టభద్రులు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్ లో ఓటర్ నమోదుకు హెల్ప్ డెస్క్ ను ప్రారంభించారు.తొలి రోజే సతీసమేతంగా ఓటు హక్కు నమోదు చేసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని అన్నారు.ఓటు నమోదుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు.అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు ఎట్లుంది, ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్ పోరాటపటిమ ఎట్లా కొనసాగుతుందని ప్రతి పట్టభద్రుడు గమనించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.గతంలో ఉన్న గ్రాడ్యుయేట్ ఓటర్ లిస్టు పూర్తిగా రద్దయిందని, పాత కొత్త ప్రతి ఓటరు తప్పనిసరిగా తమ ఓటు నమోదు చేసుకోవాలని తెలిపారు.రాష్ట్రంలో జరుగుతున్న రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో ప్రతి ఓటరు తమ హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ను ప్రారంభించినట్లు తెలిపారు.సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్ లో ప్రతి పట్టభద్రుడు తమ ఓటు హక్కు నమోదు చేసుకోవచ్చని అన్నారు.అందుకోసం కావలసిన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.విశ్రాంత ఉద్యోగులు, ప్రస్తుత ఉద్యోగులు, నిరుద్యోగ యువత, వ్యాపారులు ఇలా పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ ఓటును నమోదు చేసుకోవాలని అన్నారు.

## భగత్‌సింగ్ ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకం



**సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ వీరుడు భగత్ సింగ్ జయంతి సందర్భంగా బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రంలో భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు వీరమళ్ళ కార్తీక్ గౌడ్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయసులోనే భగత్ సింగ్ చేసిన పోరాటం, చూపిన ధైర్యం, చేసిన త్యాగం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన భగత్ సింగ్ జీవితం నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.భగత్ సింగ్ కేవలం ఒక స్వాతంత్ర్య సమరయోధుడే కాకుండా, యువతలో దేశభక్తి, సామాజిక చైతన్యం, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించిన గొప్ప వ్యక్తి అని అన్నారు. నేటి యువత ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజంలో ఉన్న సమస్యల పరిష్కారానికి, ప్రజా సంక్షేమానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దేశం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన మహనీయుల ఆశయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కార్తీక్ గౌడ్ అన్నారు. భగత్ సింగ్ చూపిన ధైర్యం, నిబద్ధత, దేశభక్తి యువతకు ఎప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం నారాయణపూర్ మండల అధ్యక్షుడు కొప్పు రామకృష్ణ, బీసీ యువజన సంఘం నాయకులు బైకని నరేందర్, సూర్వి వెంకటేశ్, విజయ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తా..

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ, అక్టోబర్ 11 (జనంసాక్షి) :** నేను కాంగ్రెస్ పార్టీ మనిషిని.. నాకు ఎమ్మెల్యే పదవిని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ.. నాకు పదవి ఉన్నా లేకున్నా పార్టీ పటిష్టం కోసమే పని చేస్తా..నాకు అవకాశం కల్పించిన మిర్యాలగూడ ప్రజల సంక్షేమం కోసమే పని చేస్తా... వారి మద్యే ఉంటా..పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందిచడమే ధ్యేయంగా పని చేస్తానని అని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం నాడు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణం లో నియోజకవర్గ వ్యాప్తంగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమం నిర్వహించడం జరిగింది.. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిధి గా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఎలాంటి అవకతవకలు జరగకుండా, అక్రమాలకు తావులేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేదలందరికీ సన్నబియ్యం అందించడంతోపాటు మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ఎత్తిపోతల పథకాలను త్వరగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. అర్హత ఉన్న ప్రతి గ్రామానికి చౌకధర దుకాణం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మిర్యాలగూడలోని ఎన్ఎస్‌పీ స్థలంలో తహసీల్దార్, రిజిస్ట్రేషన్ కార్యాలయాల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. మిర్యాలగూడ అద్దంకి రహదారి పై ఫ్లై ఓవర్ ల నిర్మాణాన్ని త్వరితగతిన ప్రారంభించాలని, యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్వాసితులకు న్యాయం చేయాలని, డీఎంఎఫ్‌టీ, సీఎస్ఆర్ నిధులతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో ప్రస్తుతం సుమారు 1.02 లక్షల స్మార్ట్ రేషన్ కార్డులు ఉండగా, 2.98 లక్షల మందికి సన్నబియ్యం



అందిస్తున్నామన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గం అభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తన స్వంత నియోజకవర్గం లా బావించి ఈ నియోజకవర్గ అభివృద్ధి కి సహకరించాలని ఆయన కోరారు. నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘ్న వీరరెడ్డి, ఎమ్మెల్సీ కేతవత్ శంకర్ నాయక్ ల సహకారం తో ఈ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని ఆయన అన్నారు.

# విపణి



## ఫ్లిప్‌కార్ట్ బిగ్‌బిలియన్ డేస్.. మోటోరొలా ఫోన్లపై డీల్స్ ఇవే!

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** బిగ్ బిలియన్‌డేస్ సేల్‌కు సిద్ధమవుతున్న ఫ్లిప్‌కార్ట్ ఒక్కో ఆఫర్‌ను రివీల్ చేసుకుంటూ వస్తోంది. అక్టోబర్ 9 నుంచి ప్రారంభం కానున్న మెగా సేల్‌లో విక్రయించే ఫోన్లపై మోటోరొలా తాజాగా ఆఫర్లు ప్రకటించింది. మోటో ఎడ్జ్, జీ సిరీస్ ఫోన్లతో పాటు సిగ్నేచర్‌పైనా డిస్కౌంట్ అందిస్తోంది. బ్లాక్ మెంబరషిప్ ఉన్నవారు అక్టోబర్ 8 నుంచే ఈ ఆఫర్లు పొందొచ్చు.ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ సేల్‌లో మోటోరొలా ఎడ్జ్ 70 ఫ్యూజన్ 8జీబీ+128జీబీ వేరియంట్ మోడల్‌ను రూ.29,999కు విక్రయించనున్నారు. ప్రస్తుతం దీని ధర రూ.30,999 ఉంది.మోటోరొలా ఎడ్జ్ 70 ప్రో 8జీబీ+ 256జీబీ వేరియంట్‌ను రూ.36,999కు విక్రయించనున్నట్లు మోటో ప్రకటించింది. ప్రస్తుతం దీని ధర రూ.39,999 ఉంది. అంటే సేల్‌లో రూ.3 వేలు డిస్కౌంట్ లభించనుంది.మోటోరొలా ఎడ్జ్ 70 ప్రో+ 12జీబీ+ 256జీబీ వేరియంట్ ధర ప్రస్తుతం రూ.47,999గా ఉండగా.. సేల్‌లో రూ.44,999కు లభించనుంది. మోటో జీ37 పవర్‌పై రూ.1250 డిస్కౌంట్ ఇస్తోంది. బేస్ వేరియంట్‌ను రూ.16,999కు విక్రయించనుంది. మోటో జీ06 పవర్‌ను రూ.13,999కు, మోటో ఎడ్జ్ 70 మ్యాక్స్‌ను రూ.51,999కు విక్రయించనున్నట్లు తెలిపింది.ఇక మోటోరొలా ఈ ఏడాది లాంచ్ చేసిన ప్రీమియం ఫోన్ సిగ్నేచర్‌ను ఈ సేల్‌లో 12జీబీ+256జీబీ వేరియంట్‌ను రూ.57,499కు విక్రయించనుంది. ప్రస్తుతం దీని ధర రూ.59,999గా ఉంది.

### 2030కి రూ.200 లక్షల కోట్ల వ్యాపారం లక్ష్యం

**దిల్లీ:** దేశంలోనే అతిపెద్ద బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వ్యాపార వృద్ధిని 'డిజిటల్ ఫస్ట్, కస్టమర్ ఫస్ట్, నేషన్ ఆల్వేస్' సూత్రం నడిపిస్తోందని సంస్థ ఛైర్మన్ సి.శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు. ఎస్‌బీఐ ఛైర్మన్‌గా రెండేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన బ్యాంక్ భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను వివరించారు. 1955 జులై 1న ఆవిర్భవించిన ఎస్‌బీఐ, 2030 నాటికి 75 వసంతాలు పూర్తి చేసుకోనుంది. వ్యాపారంలో ప్రస్తుత వృద్ధి రేటును పరిగణనలోకి తీసుకుంటే.. 2030 నాటికి ఎస్‌బీఐ మొత్తం వ్యాపారం (డిపాజిట్లు+రుణాలు కలిపి) రూ.170-180 లక్షల కోట్లకు, గరిష్ఠ స్థాయిలో రూ.200 లక్షల కోట్లకు చేరే అవకాశాలున్నాయని సీఎస్ శెట్టి ఆశాభావం వ్యక్తం చేశారు.

## రూ.8 లక్షల కోట్లు ఆవిరి

### సెన్సెక్స్ 1124 పాయింట్ల పతనం..

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 1124 పాయింట్లు నష్టపోగా.. నిఫ్టీ 360 పాయింట్లు నష్టపోయి 23 వేల మార్కు దిగువన స్థిరపడింది. హర్మూజ్‌ను తెరిచే శాంతి ప్రతిపాదనలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తిరస్కరించినట్లు వార్తలు రావడంతో చమురు ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. దీనికితోడు విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు, బాండ్ల రాబడులు పెరగడం వంటివి సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.8 లక్షల కోట్లు ఆవిరై రూ.474 లక్షల కోట్లకు చేరింది.సెన్సెక్స్ ఉదయం 73,734.83 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,895.74) నష్టాల్లో ప్రారంభమైంది.





ఆద్యంతం నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 72,716.23 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1124.02 పాయింట్ల నష్టంతో 72,771.72 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 360.25 పాయింట్ల నష్టంతో 22,780.25 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 96.03గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇన్ఫోసిస్ మినహా మిగిలిన షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఎల్అండ్‌టీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అదానీ పోర్ట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 108 డాలర్లకు చేరింది. బంగారం ఔన్సు 4154 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.హర్మూజ్‌ను తెరిచే శాంతి ప్రతిపాదనలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తిరస్కరించినట్లు వార్తలు రావడంతో చమురు ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర దాదాపు 4 శాతం పెరిగి 108 డాలర్ల వద్దకు చేరింది.అమెరికా బాండ్ల ప్రతిఫలాలు 5% పైన కొనసాగుతుండడం మన ఈక్విటీలకు సౌకర్యవంతంగా లేదని మార్కెట్ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇది సూచీలపై ప్రతికూల ప్రభావం చూపిస్తోంది.విదేశీ సంస్థాగత మదుపర్లు అమ్మకాలు కూడా సూచీల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. శుక్రవారం నాటి సెషన్‌లో రూ.3,696 కోట్ల విలువైన ఈక్విటీలను వీరు విక్రయించారు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 1,58,793 (22 క్యారెట్లు) | ₹ 1,73,236 (24 క్యారెట్లు) |
|---|---|

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,45,000

## దిగొస్తున్న బంగారం, వెండి ధరలు..

### 10 గ్రాముల ధర ఎంతంటే..?



అంతర్జాతీయ విపణిలో బంగారం, వెండి ధరలు దిగొస్తున్నాయి. చమురు మంటలతో నెలకొన్న ద్రవ్యోల్బణ భయాలు, ఫెడ్ వడ్డీ రేట్ల పెంపు అంచనాలతో ఈ లోహాలకు గిరాకీ తగ్గుతోంది. దీంతో వీటి ధరలు ఒత్తిడికి గురవుతున్నాయి. సోమవారం ఉదయం హైదరాబాద్ విపణిలో 24 క్యారెట్ల మేలిమి 10 గ్రాముల పసిడి ధర రూ.1,53,300గా ఉంది. అటు కేజీ వెండి ధర రూ.2.31లక్షలకు తగ్గింది.అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర సోమవారం దాదాపు 2.1శాతం పతనమై.. ఔన్సు ధర 4,199 డాలర్లకు దిగొచ్చింది. బంగారం ధర ఒక రోజులో ఈ స్థాయిలో తగ్గడం సెప్టెంబరు 1 తర్వాత మళ్లీ ఇప్పుడే కావడం గమనార్హం. ఇక, వెండి కూడా ఔన్సు ధర 62 డాలర్లకు పడిపోయింది. కమొడిటీ ఎక్స్ఛేంజ్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ (అక్టోబరు డెలివరీ) 10 గ్రాముల ధర రూ.1.48 లక్షలుగా ఉంది. సిల్వర్ ఫ్యూచర్ కేజీ ధర రూ.2.28 లక్షల వద్ద కొనసాగుతోంది.హర్మూజ్‌ను తెరిచే శాంతి ప్రణాళికను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తిరస్కరించడంతో పశ్చిమాసియా ఉద్రిక్తతలు ఇప్పట్లో తగ్గేలా కన్పించడం లేదు. దీంతో బ్రెంట్ క్రూడ్ ధర 106 డాలర్లకు చేరుకుంది. ఇదిలానే కొనసాగితే.. ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. మరోవైపు, ఇటీవల వడ్డీ రేట్లను పెంచిన అమెరికా ఫెడ్.. అక్టోబరులోనూ మరోమారు పెంపు చేపట్టే అవకాశం ఉందని అంచనాలు వెలువడుతున్నాయి. ఇక, అమెరికా బాండ్ల ప్రతిఫలాలు 5% పైనే ఉన్నాయి. మరోవైపు, అమెరికా డాలర్ సూచీ కూడా 101.39కి పెరిగింది. రెండు నెలల్లో ఇదే గరిష్ఠ స్థాయి కావడం గమనార్హం. ఈ పరిణామాలన్నింటితో బంగారం, వెండిలో పెట్టుబడులకు మదుపర్లు మొగ్గుచూపట్లేదని బులియన్ విశ్లేషకులు చెబుతున్నారు. ఫలితంగా వీటి ధరలు దిగొస్తున్నాయి.

## బోయింగ్ 737 మ్యాక్స్ విమానాల్లో సాఫ్ట్‌వేర్ సమస్యలు





**దిల్లీ:** బీ737 మ్యాక్స్ విమానాలు కొన్నింటిలో సాఫ్ట్‌వేర్ సమస్య తలెత్తుతోందని గుర్తించినట్లు అమెరికాకు చెందిన విమాన తయారీ సంస్థ బోయింగ్ వెల్లడించింది. ఈ సమస్య కారణంగా 'ల్యాండింగ్‌కు తొలిసారి ప్రయత్నించి విఫలమయ్యాక, మళ్లీ ల్యాండింగ్‌కు ప్రయత్నించే సమయంలో విమానం అనుసరించాల్సిన మార్గం, మొదటి ప్రణాళికా మార్గానికి భిన్నంగా ఉంటే, ఆటోమేటెడ్ ఫ్లైట్ గైడెన్స్ సిస్టమ్ పనిచేయకుండా పోయే అవకాశం ఉంద'ని సంబంధిత వర్గాలు తెలిపాయి. ల్యాండింగ్ ప్రయత్నం విఫలమయ్యాక, సిస్టమ్‌ను రీసెట్ చేయాలని ఆయా విమానయాన సంస్థలకు బోయింగ్ సూచించినట్లు సమాచారం.దీనికి శాశ్వత పరిష్కారంగా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్నామని బోయింగ్ ప్రతినిధి ఆదివారం వెల్లడించారు. 'ల్యాండింగ్ సమయంలో పైలట్లకు ఆటోమేషన్ సదుపాయం తగ్గే అవకాశం ఉందనే అంశాన్ని, ఈ విమానాలు నిర్వహిస్తున్న అన్ని విమానయాన సంస్థలకు గత నెలలో సమాచారం అందించాం. సురక్షితంగా ల్యాండింగ్ చేసేందుకు అవలంబించాల్సిన విధానాలనూ తెలిపామ'ని ఆ ప్రతినిధి తెలిపారు. మనదేశంలో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ వద్ద 53, ఆకాశ ఎయిర్ వద్ద 43 బోయింగ్ 737మ్యాక్స్ విమానాలు ఉన్నాయి. ఈ విమానాల విషయమై బోయింగ్‌తో సంప్రదిస్తూ, భద్రతాలోపం తలెత్తకుండా చూస్తున్నట్లు ఆకాశ ఎయిర్ ప్రతినిధి వివరించారు. ఈ అంశంలో విమానయాన నియంత్రణ సంస్థ డీజీసీఏ చర్యలు తెలియరాలేదు. అంతర్జాతీయంగా వివిధ సంస్థలకు ఇప్పటివరకు 2400కు పైగా బీ737 మ్యాక్స్ విమానాలను బోయింగ్ సరఫరా చేసింది.

## నియంత్రించలేని స్థాయికి ఏఐ!

### నెలల వ్యవధిలో వేలసార్లు అదుపుతప్పి..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** కృత్రిమ మేధతో భవిష్యత్తులో భారీ ప్రమాదం పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సంస్థలు విధించిన కఠినమైన నెట్‌వర్క్, ఇంటర్నెట్ ఆంక్షలను దాటుకుని.. బాహ్య ప్రపంచంలోని పబ్లిక్ ఇంటర్నెట్‌ను ఏఐ ఏజెంట్లు యాక్సెస్ చేస్తుండడంతో ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పరీక్షలు జరుపుతోన్న సమయంలో ఇప్పటి వరకు వేలసార్లు ఏఐ ఏజెంట్లు ఉల్లంఘనలకు పాల్పడినట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. నియంత్రించలేని స్థాయిలో అవి తమను తాము అభివృద్ధి చేసుకుంటున్నట్లు పేర్కొన్నాయి. దీంతో ఈ విషయాలపై ఓపెన్‌ఏఐ, ఆంత్రోపిక్ సహా ఇతర టెక్ సంస్థల పరిశోధకులు దర్యాప్తు చేపట్టాయి.నెలల వ్యవధిలో ఏఐ ఏజెంట్లు వేలసార్లు ఉల్లంఘనలకు పాల్పడ్డాయి. ఈ ఉల్లంఘనల్లో అత్యధికంగా ఓపెన్‌ఏఐకు చెందినవే ఉండడం గమనార్హం. రక్షణ వ్యవస్థలను దాటి, డిజిటల్ హైజాకింగ్‌లలో ఇవి పాల్గొన్నాయి. కంపెనీల నియంత్రణ నుంచి తప్పించుకొని వెబ్‌సైట్‌లను హైజాక్ చేయడం, మానిటరింగ్ వ్యవస్థలను దాటి చేయకూడని పనులే కాకుండా.. కొన్ని సందర్భాల్లో క్రిమినల్ చర్యలకు కూడా పాల్పడ్డాయని కంట్రోల్‌ఏఐ (అనీనిబితీనీశ్రీ ంఎ) అనే పర్యవేక్షక సంస్థ కార్యనిర్వాహక డైరెక్టర్, ఏఐ




పరిశోధకుడు కానర్ లీహీ తెలిపారు. కొన్ని ఉల్లంఘనల్లో 'రెడ్-టీమింగ్' కార్యకలాపాలు కూడా ఉన్నాయి. భద్రతా చర్యలను పరీక్షించడానికి కంపెనీలే ఉద్దేశపూర్వకంగా తమ ఏఐ మోడళ్లతో తప్పుగా ప్రవర్తింపజేయడం ఇందులో భాగం.

**ఏఐ మోడళ్ల శిక్షణ నిలిపివేసిన ఓపెన్‌ఏఐ**

ఇటీవల ఓపెన్‌ఏఐ సైబర్‌సెక్యూరిటీ ఏజెంట్లు ఆంక్షలను దాటి, హగ్గింగ్ ఫేస్ వ్యవస్థను యాక్సెస్ చేయడం, అమెరికా ప్రభుత్వ వెబ్‌సైట్లలోకి చొరబడి అందులోని సమాచారాన్ని యాక్సెస్ చేయడం వంటి ఘటనలు జరిగిన విషయం తెలిసిందే. దీంతో ఏజెంట్లు సొంతంగా ప్రవర్తించడం, వెబ్‌సైట్లను హ్యాక్ చేయడం, గోప్య సమాచారాన్ని బహిర్గతం చేయడం వంటి వాటిని నిరోధించేందుకు.. చేపట్టాల్సిన రక్షణ చర్యలపై ఓపెన్‌ఏఐ పరిశోధనలు చేస్తోంది.

## అక్టోబరు నుంచి కొత్త రూల్స్

ఎల్‌పీజీ ఇ-కేవైసీ, ఎఫ్‌డీ రేట్లు..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రతి నెలా మాదిరిగానే అక్టోబరు నెలలోనూ ఆర్థిక పరంగా పలు మార్పులు రాబోతున్నాయి. ఎల్‌పీజీ ఇ-కేవైసీ, ఎఫ్‌డీ రేట్లకు సంబంధించిన నిబంధనలు అమల్లోకి రానున్నాయి. దీంతో పాటు మన నిత్య జీవితంలో ఎంతగానో భాగమైపోయిన యూపీఐ లావాదేవీలపై రుసుములు కూడా ఈ నెల్లోనే అమల్లోకి రానున్నాయి.ఎల్‌పీజీ ఇ-కేవైసీ:ఎల్‌పీజీ వినియోగదారులు బయోమెట్రిక్ ఆధార్ అథంటికేషన్ ప్రక్రియను సెప్టెంబర్ నెలాఖరులోపు పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టంచేసింది. ఒకవేళ గడువు దాటితే రాయితీ వర్తించదు. అక్రమ గ్యాస్ కనెక్షన్లను అడ్డుకట్ట వేయడంతో పాటు రాయితీ దుర్వినియోగం కాకుండా చేసేందుకు ప్రభుత్వం ఈ ప్రక్రియను ప్రవేశపెట్టింది. ఆయిల్ కంపెనీల యాప్, గ్యాస్ ఏజెన్సీలు, గ్యాస్ డీలర్ల వద్ద నెలాఖరులోపు ఇ-కేవైసీ పూర్తి చేయొచ్చు.డేటా వద్దనుకుంటే.. కాల్స్‌కే చెల్లించొచ్చు:సిలిండర్ ధరలు: అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా ప్రతి నెలా మొదటి తేదీన గృహ, కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలను చమురు సంస్థలు సవరిస్తుంటాయి. సెప్టెంబర్ నెలలో గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్ ధరలను స్థిరంగా ఉంచినప్పటికీ.. కమర్షియల్ సిలిండర్ ధర స్వల్పంగా (రూ.10)గా పెంచాయి. ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ ధరలను సవరించే అవకాశం ఉంది.యూపీఐపై ఛార్జీలు:ఇన్నాళ్లూ ఉచితంగా ఆనందించిన యూపీఐ లావాదేవీలపై ఇకపై ఛార్జీలు అమల్లోకి రానున్నాయి. అక్టోబరు




15 నుంచి రూ.2000 పైబడిన లావాదేవీలపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేటు వర్తించనుంది. చిరు వ్యాపారులకు, వ్యక్తులు చేసే లావాదేవీలకు దీన్నుంచి మినహాయింపు ఉంది. పెట్రోల్ పంపులు, ఇన్సూరెన్స్ వంటి చెల్లింపులకు ఫ్లాట్ ఎండీఆర్ రూ.5 వర్తిస్తుంది.ఎఫ్‌డీ రూల్స్:బల్క్ డిపాజిట్లపై (రూ.3కోట్లు, అంతకంటే ఎక్కువ) వడ్డీ రేట్లను వెల్లడించే విషయంలో బ్యాంకులకు ఆర్‌బీఐ కీలక ఆదేశాలు జారీ చేసింది. అక్టోబరు 1 నుంచి ఈ తరహా డిపాజిట్లపై వడ్డీ రేట్లను ప్రతి రోజూ ఉదయం 10 గంటలకల్లా తన వెబ్‌సైట్‌లో ప్రచురించాల్సి ఉంటుంది. ఒకే తేదీన స్వీకరించిన డిపాజిట్లపై వడ్డీ రేటును నిర్ణయించేటప్పుడు బ్యాంకులు కస్టమర్ల మధ్య గానీ, బ్రాంచీల మధ్య గానీ వివక్ష చూపకూడదని ఆర్‌బీఐ పేర్కొంది.

## డేటా వద్దనుకుంటే.. కాల్స్‌కే చెల్లించొచ్చు

### మొబైల్ ప్రీపెయిడ్ ప్లాన్లు 30 రోజులకు వస్తాయ్
### ట్రాయ్ నూతన నిబంధనావళి ప్రయోజనమిదీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**మొబైల్ ప్రీపెయిడ్ వినియోగదారులు ప్రస్తుతం నెలవారీ పథకాన్ని రీఛార్జి చేసుకుంటే, లభిస్తోంది 28 రోజుల కాలావధే. ఏడాది పథకం అయితే 365 రోజులకు వర్తిస్తుండగా, నెలవారీ రీఛార్జి మాత్రం 4 వారాలకే పరిమితం కావడం వల్ల ఏడాదిలో 12 నెలలే అయినా, 13 సార్లు రీఛార్జులు చేసుకోవాల్సి వస్తోంది. టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ కొత్త నిబంధనావళి వల్ల ఈ పరిస్థితి మారనుంది. టెలికాం సంస్థలు ఇకపై 30 రోజులు, అంతకంటే తక్కువ కాలపరిమితి పథకాలు తీసుకు వస్తాయి. ప్రతినెలా ఒక తేదీనే రీఛార్జి చేసుకునే పథకాలూ అమల్లోకి రానున్నాయి. డేటా వినియోగించని వారి కోసం కాల్స్+ఎస్ఎంఎస్‌లు మాత్రమే ఉండే రీఛార్జి పథకాలనూ మొబైల్ నెట్‌వర్క్ సంస్థలు ఆవిష్కరించాల్సి ఉంది.తక్కువ కాలపరిమితితో కూడిన బండిల్ ప్లాన్లు అందుబాటులో ఉంటే, వాటికి అనుగుణంగా వాయిస్ - ఎస్ఎంఎస్ మాత్రమే అందించే స్పెషల్ వోచర్లనూ టెలికాం సంస్థలు, తక్కువ టారిఫ్‌తో అందుబాటులోకి తేవాలి. ఇళ్లు, కార్యాలయాల్లో వైఫై అందుబాటులో ఉన్నప్పుడు.. సిమ్ కార్డు ద్వారా డేటా వినియోగించాల్సిన అవసరం అత్యధికులకు తక్కువగా ఉంటోంది. అయినా వీరు కూడా తప్పనిసరిగా డేటాతో కూడిన పథకాలనే రీఛార్జి చేసుకోవాల్సి వస్తోంది. ఇక కాల్స్ కోసం మాత్రమే సెల్‌ఫోన్ ఉపయోగించే వినియోగదారులూ ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. డేటా వాడకున్నా, అనవసరంగా చెల్లించాల్సి వస్తోంది. ఇలాంటి వినియోగదారుల కోసం ఇన్‌కమింగ్ - ఔట్‌గోయింగ్ కాల్స్‌కు సరిపోయే వాయిస్-ఓన్లీ ప్రీపెయిడ్ ప్లాన్లు అందుబాటులోకి రావాల్సి ఉంది.

## పండగల వేళ ధరాఘాతం..

- ఏసీ, టీవీ, గృహోపకరణాలు ప్రియం
- ముడి పదార్థాల వ్యయాలు పెరగడమే కారణం: కంపెనీలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దసరా, దీపావళి పండగల సీజన్ అంటే ఎలక్ట్రానిక్ గృహోపకరణాల కంపెనీలు, విక్రయశాలలు కూడా ఆఫర్లు ప్రకటిస్తాయనే భావనతో, ఆ సమయంలో కొనుగోళ్ల కోసం అధికులు ఎదురు చూస్తుంటారు. ఉద్యోగులకు పలు కంపెనీలు, వాణిజ్య సంస్థలు కూడా బోనస్‌లు ఇస్తాయి కనుక.. ఈ సమయంలో విక్రయాలు పెంచుకునేందుకు తయారీ సంస్థలు డిస్కౌంట్లు ప్రకటిస్తుంటాయి. ఈసారి కూడా పండగలకు ఇంట్లోకి ఎలక్ట్రానిక్ కొత్త గృహోపకరణాలు కొందామనుకుంటున్న వినియోగదారులకు ధరల షాక్ తగలనుంది. ఈ పండగలకు సహజంగా అధికంగా విక్రయమయ్యే ఎల్ఈడీ టీవీలు, వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండీషనర్ల (ఏసీ) ధరలను అక్టోబరు 1 నుంచి 5-7% పెంచేందుకు అగ్రగామి ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాల తయారీ సంస్థలు సిద్ధమయ్యాయి. ఈ ఏడాది (2026) ప్రారంభం నుంచి, పరిశ్రమ పరంగా ధరలు పెంచడం ఇది మూడోసారి కావడం గమనార్హం.పశ్చిమాసియా సంక్షోభం కారణంగా రాగి, ఉక్కు, అల్యూమినియం, ప్లాస్టిక్, ముడిచమురు ఉత్పత్తుల ధరలు అంతర్జాతీయంగా బాగా పెరగడమే ఇందుకు కారణం. రాగి ధర గతేడాది టన్ను 8,000-9,000 డాలర్లు కాగా, ప్రస్తుతం 14,500 డాలర్లకు చేరింది. ఒక్కో ఏసీ తయారీకి 3-4 కిలోల రాగి అవసరం కావడంతో.. తమకు తయారీ ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని, అందుకే ఈ భారాన్ని వినియోగదారులకు బదలాయించక తప్పడం లేదని కంపెనీలు చెబుతున్నాయి. నౌకా రవాణా ఛార్జీలు పెరగడం, రూపాయితో పోలిస్తే డాలర్ బలపడటం వల్లా దిగుమతి ఖర్చులు గణనీయంగా పెరిగాయి.ప్లాస్టిక్ ఆధారిత పదార్థాలు, మెమొరీ కార్డులు, చిప్‌సెట్ల ధరలు పెరగడం వల్ల టీవీలు సహా ఇతర గృహోపకరణాల తయారీ వ్యయమూ పెరుగుతోంది.

**చిన్న డీలర్లకే కష్టం**

తయారీ కంపెనీలు తమ ఉత్పత్తుల ధరలను పెంచడానికి ముందే డీలర్లకు సమాచారం ఇస్తుంటాయి. నగదు చెల్లించి సరకును తీసుకెళ్లే పద్ధతే ఎలక్ట్రానిక్ గృహోపకరణాల విపణిలో అమలవుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో పెద్ద డీలర్లు ముందస్తుగా సరకు తీసుకుని, పండగల సమయంలో వినియోగదారులను తక్కువ ధరలతో ఆకట్టుకునే వీలుంటుంది. చిన్న డీలర్లు మాత్రం ఆర్థిక స్థోమత వల్ల ఎక్కువ సరకు తీసుకోలేరు కనుక, వీరికి ధరల భారం తప్పదంటున్నారు. లోహాలు సహా ముడి పదార్థాల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో తమ స్పోర్ట్స్ వినియోగ వాహన (ఎస్‌యూవీ) శ్రేణి ధరలను మరో విడత పెంచాలని యోచిస్తున్నట్లు మహీంద్రా




అండ్ మహీంద్రా అధ్యక్షుడు, సీఈఓ (ఆటోమోటివ్) నళినీకాంత్ గొల్లగుంట వెల్లడించారు. రెండు వారాల్లో దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. కంపెనీ ఈ ఏడాదిలోనే జనవరి, ఏప్రిల్, జులై నెలల్లో (మూడు సార్లు) వాహన ధరలు పెంచింది. జులైలో ఎస్‌యూవీ ధరలు 2.7% పెరిగాయి. ఇటీవలి ధరల పెంపులు కస్టమర్ బుకింగ్‌లు, విచారణలపై ప్రతికూల ప్రభావాన్ని చూపలేదని నళినీకాంత్ తెలిపారు. గతేడాది జీఎస్‌టీ రేట్ల తగ్గింపు వల్ల, ప్రస్తుతం కార్ల ధరలు గతేడాది ప్రారంభం కంటే దిగువనే ఉన్నాయని వివరించారు. అందువల్ల వచ్చే పండగల సీజన్‌లో పరిశ్రమలో అమ్మకాలు బలంగా ఉంటాయనే ధీమాను నళినీకాంత్ వ్యక్తం చేశారు. రాబోయే రెండు త్రైమాసికాల్లో అయిదు నవీకరించిన మోడళ్లతో పాటు, పెట్రో విభాగంలో ఒకటి, విద్యుత్తు విభాగంలో ఒక మోడల్‌ను మార్కెట్‌లోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు.

ఏఏ కంపెనీలు ఎంత మేరకు..

వోల్టాస్: రిఫ్రిజరేటర్లు, వాషింగ్ మెషీన్ల ధరలు ఇప్పటికే 5-7% పెంచినట్లు వోల్టాస్ ఉన్నతాధికారి తెలిపారు. అక్టోబరు 1 నుంచి ఏసీల ధరలను ఇదే స్థాయిలో పెంచబోతున్నట్లు వివరించారు.

బ్లూస్టార్: ఏసీలు, డీప్ ఫ్రీజర్ల ధరలను ఇప్పటికే 5-8% పెంచినట్లు సంస్థ ఎండీ బి.త్యాగరాజన్ వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే ఉత్పత్తి వ్యయాలు 15% పెరిగినా, జీఎస్‌టీ రూపేణ గత సెప్టెంబరు నుంచి 10% ప్రయోజనం లభించినందున, వినియోగదారులపై నికరంగా 5% వరకు ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు.

డైకిన్: ఉత్పత్తుల ధరలను ఈనె 16 నుంచే 8-10% వరకు పెంచినట్లు కంపెనీ సీఎండీ కన్వల్‌జీత్ జవా తెలిపారు.

హైయర్: అక్టోబరు 1 నుంచి ఏసీల ధర 5%, టీవీలు, వాషింగ్ మెషీన్ల ధరలు 2-3% చొప్పున పెంచుతున్నామని, జనవరి నాటికి విడతల వారీగా మొత్తం 15% మేర ధరలు పెంచే ప్రణాళిక ఉందని సంస్థ అధ్యక్షుడు ఎన్ఎస్ సతీష్ తెలిపారు.

గోద్రేజ్ అప్లయన్సెస్: పరిశ్రమ వ్యాప్తంగా 5-7% ధరల పెంపు తప్పదని కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కమల్ నంది పేర్కొన్నారు. డీలర్ల వద్ద ఇప్పటికే పాత ధరలతో కొనుగోలు చేసిన నిల్వలు 1-1.5 నెలలు వరకు వస్తాయని అన్నారు. అందువల్ల దీపావళి వరకు పాత ధరలకే ఉత్పత్తులు లభించే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

ఎస్‌పీపీఎల్, వీడియోటెక్స్: థామ్సన్, కొడాక్, బ్లాపంక్ట్ బ్రాండ్‌లను తయారుచేసే ఎస్‌పీపీఎల్.. టీవీల ధరలను 7% పెంచాలని యోచిస్తోంది. దీపావళి తర్వాత చిన్న తెరల టీవీల ధరలు 20% వరకు, పెద్ద టీవీలు 10% వరకు ప్రియం కావొచ్చని వీడియోటెక్స్ డైరెక్టర్ అర్జున్ బజాజ్ అంచనా వేశారు.





# కలర్ బంగులాల వెనక కన్నీటి గాథలెన్నో...!

*సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు న్యాయం దక్కేనా...?*

- ముఖ్యమంత్రి పైనే ఆశలన్నీ..

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రానికి గుండెకాయ అయినా మధ్య మానేరు ప్రాజెక్టులో రైతన్నలు, ప్రజలు సర్వస్వాన్ని త్యాగం చేశారు. అలా త్యాగం చేయడమే భూ నిర్వసితులు చేసిన మహ పాపమా...? ముంపులో సర్వం కోల్పోయిన కొదురుపాక, నీలోజుపల్లి, వరదవెల్లి, శాభాష్‌పల్లి, సంకేపల్లి,రుద్రవరం, అనుపురం,కొడుముంజ, చీర్లవంచ, చింతల్ టానా, గుర్రం వానిపల్లి, గ్రామాల ప్రజలు, రైతులు సర్వం కోల్పోయారు. వీరికి ప్రభుత్వం ఆర్‌అండ్ ఆర్ కాలనీలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో సర్వం కోల్పోయిన వారు ఈ కాలనీలలో కలర్.. కలర్ బంగ్లాలు కట్టినప్పటికీ వారి కన్నీటి గాథలు ఎన్నో ఉన్నాయి. ఇల్లు నిర్మించుకున్న క్రమంలో కొంతమంది వివిధ బ్యాంకుల ద్వారా లోన్లు తీసుకొని ప్రతి నెల ఈఎంఐ చెల్లించేందుకు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఈ కాలనీలలో ఈఎంఐ చెల్లించని ఇంటి యజమానుల వద్దకు బ్యాంక్ అధికారులు ప్రతిరోజు వస్తున్నప్పటికీ ఆర్ అండ్ ఆర్ కాలనీలలో బ్యాంక్ అధికారులు ఇల్లు కూడా జప్తు చేసుకున్న సంఘటనలు ఉన్నట్లు తెలుస్తుంది.

భూ నిర్వాసితులకు వ్యవసాయం లేదు,ఉపాధి లేదు. వేలాది కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఎదురవుతుంది. భూ నిర్వాసితుల కలర్ బంగులలా వెనుక కన్నీళ్లను తుడిచి,వారి న్యాయమైన పెండింగ్ సమస్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని నిర్వాసితులు ప్రభుత్వాన్ని కోరారు. ఈనెల 30న సీఎం జిల్లా పర్యటనలో ముంపు గ్రామాల సమస్యలపై స్పష్టమైన ప్రకటన జారీ చేస్తారని ఆశతో నిర్వాసితులు ఉన్నారు.

**ముంపు గ్రామాలలో పెండింగ్ సమస్యలు..**

ఇంటి నిర్మాణ ప్యాకేజీలలో 10683 నిర్వాసిత కుటుంబాలకు మీరు ఇస్తామన్న రూ 5,04,000 ఇంటి నిర్మాణ ప్యాకేజీని వెంటనే చెల్లించాలని,యువత ప్యాకేజీలో 18 సంవత్సరాలు నిండిన దాదాపు 1000 మంది అమ్మాయిలు,అబ్బాయిలకు ప్యాకేజీ మంజూరై నేటివరకు ప్యాకేజీ చెల్లించలేదని,వారికి వెంటనే రూ 2 లక్షల ప్యాకేజీ చెల్లించాల్సి ఉంది .భూముల నష్టపరిహారంలో దాదాపు 1000 ఎకరాల వ్యవసాయ భూములు,అలాగే ముంపు గ్రామాల్లో ఇంటి చుట్టూ ఉన్న ఖాళీ స్థలాల నష్టపరిహారం చెల్లించాలని,ఇప్పటి వరకు నష్ట పరిహారం రాని ఇండ్లకు అలాగే తప్పిపోయిన ఇండ్లకు వెంటనే నష్ట పరిహారం చెలించలన్నారు. ఉపాధి కోసం కొదురుపాక నుండి అగ్రహారం వరకు ఇండస్ట్రియల్ కారిడార్ ప్రకటించి, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్,ఇండస్ట్రియల్ బ్యాంక్ ఏర్పాటు చేయలన్నారు.

### రూ 5.04 లక్షలు వెంటనే చెల్లించాలి

**భాజపా రాష్ట్ర నాయకుడు ఎర్రం మహేష్**



రాష్ట్ర ప్రభుత్వం నిర్వాసితులకు చెల్లిస్తానన్న రూ 5.04 లక్షలు వెంటనే చెల్లించాలని భాజప రాష్ట్ర నాయకుడు ఎర్రం మహేష్ ప్రభుత్వాన్ని కోరారు. నిర్వాసితులకు రూ 5.04 లక్షలు చెల్లిస్తామని ఇచ్చిన హామీ మేరకు సిరిసిల్లలో ముఖ్యమంత్రి ప్రకటన చేస్తారని నిర్వాసితులు ఆశగా ఎదురు చూస్తున్నారని,సీఎం పర్యటనలో రూ.10.05 కోట్లను నిర్వాసితుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారన్నారు. అదే విధంగా పెండింగ్ సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో పాటు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# సీఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

*ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్*



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబర్ 28 (జనం సాక్షి);** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశించారు. సెప్టెంబర్ 30వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి రాక నేపథ్యంలో రగుడు బై పాస్ రోడ్ వద్ద పబ్లిక్ మీటింగ్ స్థలాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర, ఐఎస్ డబ్ల్యూ ఎన్ సీ ఎస్పీ మాధవ రావుతో కలిసి పరిశీలించారు. అంతకుముందు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో హెలిప్యాడ్ నిర్మాణ పనులు కొనసాగుతుండగా, జిల్లా కలెక్టర్,ఎస్పీ వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని, అలాగే సిరిసిల్ల రగుడు బై పాస్ రోడ్ వద్ద ఉన్న మైదానంలో పబ్లిక్ మీటింగ్ నిర్వహించ నున్నారని తెలిపారు. పోలీస్ అధికారులు హెలిప్యాడ్ నుంచి పబ్లిక్ మీటింగ్ స్థలం వరకు బందోబస్త్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

**అధికారులతో సమీక్ష**

రేవంత్ రెడ్డి రాక నేపథ్యంలో వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర, ఐఎస్ డబ్ల్యూ ఎన్ సీ ఎస్పీ మాధవ రావు, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈఈ ఆర్ అండ్ బీ హెలిప్యాడ్, స్థభ స్థలం వద్ద స్టేజ్, పార్కింగ్ ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారి పారిశుధ్య పనులు, తాగు నీటి సరఫరా కోసం ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎన్ పీడీసీఎల్ అధికారులు విద్యుత్ సరఫరా ఇతర ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం అన్ని పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఇట్టి సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, ఆర్ అండ్ బీ ఈఈ భీమ్లానాయక్, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, ఎక్సైజ్ అధికారి హిమశ్రీ, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, డీఎస్పీలు నాగేంద్రాచారి, నర్సిరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముంపు నిర్వాసితులకు రూ.31.75 కోట్ల పరిహారం

- యువత ఖాతాల్లో రూ.10.25 కోట్లు జమ
- ఇళ్లు, భూములు, దేవాలయాలకు రూ.14.50 కోట్ల పరిహారం
- మరో రూ.7 కోట్ల చెక్కులు సిద్ధం
- 10,600 కుటుంబాలకు రూ.234.80 కోట్ల పంపిణీకి కసరత్తు



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి): మధ్య మానేరు ప్రాజెక్టు ముంపు నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.31.75 కోట్ల పరిహారం విడుదలైనట్లు ప్యాక్స్ చైర్మన్ పిల్లి కనకయ్య, వేములవాడ అర్బన్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వంగ పర్శరాములు గౌడ్ తెలిపారు. సోమవారం నంది కమాన్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముంపు గ్రామాల యువతీయువకులకు ప్యాకేజీ కింద రూ.10.25 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. ఇళ్లు, భూములు, దేవాలయాల నష్టపరిహారం కోసం రూ.14.50 కోట్లు కలెక్టర్ ఖాతాలో జమయ్యాయని, మరో రూ.7 కోట్ల విలువైన పరిహారపు చెక్కులు సిద్ధమవుతున్నాయని పేర్కొన్నారు. సంకేపల్లిలో పెండింగ్‌లో ఉన్న 45 ఇళ్లకు పరిహారం మంజూరు చేసినట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కాలేదని వారు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యల పరిష్కారంపై దృష్టి సారించిందని, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో నిధులు విడుదలయ్యాయని చెప్పారు. గతంలో మంజూరైన రూ.234.80 కోట్లను 10,600 నిర్వాసిత కుటుంబాలకు పంపిణీ చేసే ప్రక్రియపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, నిర్వాసితులు పాల్గొన్నారు.

# 1.140 కిలోల గంజాయి స్వాధీనం.. నిందితుడి అరెస్ట్

- దాబా వద్ద విక్రయిస్తుండగా పట్టుకున్న పోలీసులు
- శాంసంగ్ మొబైల్ ఫోన్ స్వాధీనం
- గతంలోనూ గంజాయి కేసులు ఉన్నట్లు వెల్లడి



**కరీంనగర్ క్రైమ్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, విక్రయానికి పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి 1 కిలో 140 గ్రాముల గంజాయి, శాంసంగ్ మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. పక్కా సమాచారంతో ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ ఏ. లక్ష్మారెడ్డి సిబ్బందితో కలిసి ముగ్దంపూర్‌లోని మైత్రి ఫ్యామిలీ దాబా సమీపంలో నిఘా ఏర్పాటు చేశారు. అక్కడ తెల్లని ప్లాస్టిక్ కవర్‌తో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా పారిపోయేందుకు యత్నించాడు. పోలీసులు వెంబడించి పట్టుకుని, అతడి వద్ద ఉన్న కవర్‌ను తనిఖీ చేయగా గంజాయి లభించింది. నిందితుడిని ముగ్దంపూర్‌కు చెందిన బుర్రవ వంశీ (24)గా గుర్తించారు. విచారణలో ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయి కొనుగోలు చేసి కరీంనగర్ పరిసరాల్లో యువకులు, హైవే దాబాల వద్ద లారీ డ్రైవర్లకు చిన్న ప్యాకెట్లుగా విక్రయిస్తున్నట్లు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. తాజాగా బైక్‌పై గంజాయి తీసుకొచ్చి దాబా సమీపంలో విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. నిందితుడిపై గతంలో రామగిరి, కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్లతో పాటు ఒడిశాలోనూ గంజాయి కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చిన అతడిపై కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో హిస్టరీషీట్ కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకున్న పోలీసులను సీపీ గౌస్ ఆలం, రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్ అభినందించారు.

# సీఎం పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- కలెక్టరేట్, హెలిప్యాడ్, పరిసరాల్లో పరిశీలన
- భద్రత, ట్రాఫిక్, పార్కింగ్‌పై సమీక్ష
- శాఖల మధ్య సమన్వయంతో విధులు
- నిర్లక్ష్యానికి తావులేకుండా ఏర్పాట్లు



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 30న కరీంనగర్ రానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. సోమవారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, సీఎం భద్రతా అధికారులు నూతన కలెక్టరేట్ ప్రాంగణాన్ని పరిశీలించారు. హెలిప్యాడ్, తెలంగాణ తల్లి విగ్రహం, కలెక్టరేట్ భవనం, సమావేశ మందిరం, కలెక్టర్ చాంబర్, పరిసర ప్రాంతాలను పరిశీలించి సీఎం రాక, కాన్వాయ్ రాకపోకలు, తిరుగు ప్రయాణం వరకు చేపట్టాల్సిన భద్రతా చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ఏఎస్ఎల్ సమావేశంలో బందోబస్తు, హెలిప్యాడ్, రూట్, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, అత్యవసర వైద్యం, అగ్నిమాపక, ప్రోటోకాల్ ఏర్పాట్లను సమీక్షించారు. అన్ని శాఖల అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను సమన్వయంతో సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. ప్రతి ఏర్పాటును క్షేత్రస్థాయిలో పరిశీలించి ధ్రువీకరించాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో బారికేడ్లు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని సీపీ గౌస్ ఆలం ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో షర్మిల, సీఎంవో ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ అధికారులు రామచందర్‌రావు, డీఎస్పీలు దుర్శేటి రఘుచందర్, శ్యామ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఓట్ల చోరీని అరికట్టాలి.. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

- కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ నిరసన
- సీఈసీ, ప్రధాని, హోంమంత్రి దిష్టిబొమ్మల దహనం
- ఓటర్ల జాబితాలో అవకతవకలు అరికట్టాలని డిమాండ్
- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని వినతి




**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** ఓటర్ల జాబితాలో అవకతవకలను అరికట్టి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లు ధరించిన కార్యకర్తలు ఇందిరాచౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట సీఈసీ జ్ఞానేశ్‌కుమార్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ఓటు హక్కును పరిరక్షించాల్సిన ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు తలెత్తుతున్నాయని ఆరోపించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓట్ల తొలగింపు, పునరుద్ధరణకు సంబంధించిన అంశాలపై ఎన్నికల కమిషన్‌లోనే అభ్యంతరాలు వ్యక్తమైనట్లు వచ్చిన నివేదికల నేపథ్యంలో సీఈసీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మానకొండూరు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ, వెలిచాల రాజేందర్‌రావు తదితరులు మాట్లాడుతూ ఓటర్ల హక్కులను కాపాడేందుకు దేశవ్యాప్తంగా ఉద్యమాలు కొనసాగిస్తామని అన్నారు. ఓటర్ల జాబితాలో తొలగించిన అర్హులైన పేర్లను పునరుద్ధరించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని కోరారు. కార్యక్రమంలో కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్, హుజురాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఒడితెల ప్రణవ్‌బాబు, ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, పురుమల్ల శ్రీనివాస్, ఆరెపల్లి మోహన్, వివిధ స్థాయిల కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిగురుమామిడిలో ఎరువుల దుకాణాల ఆకస్మిక తనిఖీ

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు
- రైతులకు నాణ్యమైన ఎరువులు అందించడమే లక్ష్యం..
- ఫార్మర్ రిజిస్ట్రీతోనే ప్రభుత్వ పథకాలకు అర్హత
- జిల్లా వ్యవసాయ అధికారి బి.చత్రు నాయక్



**చిగురుమామిడి సెప్టెంబర్ 28(జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలో సోమవారం మండల ప్రత్యేక అధికారి,జిల్లా వ్యవసాయ అధికారి బి.చత్రు నాయక్,ఎస్సై జగదీశ్వర్, మండల వ్యవసాయ అధికారి తాటిపెల్లి పున్నంచందర్ రెడ్డి సంయుక్తంగా ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లోని నిల్వలు,రికార్డులను వారు నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి చత్రు నాయక్ మాట్లాడుతూ మార్కెట్లో ప్రభుత్వం అనుమతించిన కంపెనీల ఎరువులను మాత్రమే డీలర్లు విక్రయించాలని, అనుమతి లేని ఇతర బ్రాండ్లు లేదా నకిలీ ఎరువులను విక్రయిస్తే చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రైతులకు నమ్మకమైన, నాణ్యమైన ఎరువులు అందించాలనే ఉద్దేశంతోనే ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. మండలంలోని ఎరువుల దుకాణదారులందరూ అధికారుల తనిఖీలకు సహకరిస్తూ, రైతులకు మేలైన నాణ్యమైన ఎరువులు, పురుగుమందులను మాత్రమే అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతుల ప్రయోజనాలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ రకాల వ్యవసాయ పథకాలకు అర్హత లభిస్తుందని తెలిపారు. అంతేకాకుండా, రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే వడ్ల కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయోజనం పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీ ఎంతో కీలకమని జిల్లా వ్యవసాయ అధికారి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎరువుల దుకాణాల నిర్వాహకులు,వ్యవసాయ శాఖ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ ట్రంక్ లైన్ పనులను జలమండలి

- అధికారులతో కలిసి పరిశీలించిన నవజీవన్ రెడ్డి

**హయత్‌నగర్, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** హయత్‌నగర్ డివిజన్‌లోని జైస్వాల్ ఫర్నిచర్ నుంచి మనుగనూర్ కల్వర్ట్ వరకు చేపట్టిన భూగర్భ డ్రైనేజీ ట్రంక్ లైన్ నిర్మాణ పనులు గతంలో కొన్ని అనివార్య కారణాల వల్ల మధ్యలో నిలిచిపోయాయి. ప్రస్తుతం ఈ పనులను తిరిగి పునఃప్రారంభించనున్న నేపథ్యంలో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి జలమండలి ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ ట్రంక్ లైన్‌కు సంబంధించిన లెవెల్స్, గతంలో జరిగిన పనుల పరిస్థితి, సాంకేతిక అంశాలను అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల పునఃప్రారంభానికి సంబంధించి అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు.


అనంతరం కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. భూగర్భ డ్రైనేజీ ట్రంక్ లైన్ నిర్మాణ పనులు పూర్తయితే ఆయా ప్రాంతాల ప్రజలకు డ్రైనేజీ సమస్యల నుంచి గణనీయమైన ఉపశమనం లభిస్తుందని తెలిపారు. గతంలో నిలిచిపోయిన పనులను త్వరితగతిన పునఃప్రారంభించి, ఎలాంటి జాప్యం లేకుండా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని, ప్రజలకు ఎదురవుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని నవజీవన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం నాగరాజు తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్ పరీక్షల్లో ఉత్తీర్ణత కాక విద్యార్థి ఆత్మహత్య

**కరీంనగర్ క్రైమ్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** ఎంబీబీఎస్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేక మానసిక వేదనకు గురైన విద్యార్థి అధిక మోతాదులో మందులు తీసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా తాడిగడపకు చెందిన నాగడి పునీత్ వర్మ (28)కు 2019లో కౌన్సెలింగ్ ద్వారా ఉచిత ఎంబీబీఎస్ సీటు లభించింది. దీంతో బొమ్మకల్ లోని చల్మెడ ఆనందరావు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో చేరాడు. 2025లోనే కోర్సు పూర్తి చేయాల్సి ఉండగా కొన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయాడు. ప్రస్తుతం పరీక్షలకు సిద్ధమవుతున్న క్రమంలో అధిక మోతాదులో బెంజోడియాజిపైన్ తరహా మాత్రలు తీసుకున్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకునేలోపే పునీత్ వర్మ మృతి చెందినట్లు గుర్తించారు. పంచనామా, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు మృతదేహాన్ని తండ్రి శంకర్‌బాబుకు అప్పగించారు. తమ కుమారుడి మృతిపై ఎవరిపైనా అనుమానం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు.

# గోదావరి పుష్కరాల పనులు వేగవంతం చేయాలి

- ఘాట్ల అభివృద్ధి పనులు త్వరగా ప్రారంభించాలి
- గౌతమేశ్వర ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు
- భూసేకరణను సకాలంలో పూర్తి చేయాలి
- శాఖల మధ్య సమన్వయంతో పనులు చేపట్టాలి



**మంథని, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని మంథనిలో చేపట్టనున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం మంథనిలో పుష్కర ఘాట్లు, గౌతమేశ్వర ఆలయ పునర్నిర్మాణ పనులు, భూసేకరణ అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో అధికారులు, రైతులతో భూసేకరణపై సమీక్ష నిర్వహించారు. పుష్కరాల అవసరాలకు సంబంధించిన పెండింగ్ భూసేకరణను నిబంధనల ప్రకారం త్వరగా పూర్తి చేయాలని సూచించారు. రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. నిబంధనల మేరకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటూనే అవసరమైన భూమిని సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. ఎండోమెంట్, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ఘాట్ల వద్ద తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, రహదారులు, పార్కింగ్, భద్రత తదితర మౌలిక వసతులను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గౌతమేశ్వర ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ ప్రక్రియలను పూర్తి చేసి పనులు ప్రారంభించాలని సూచించారు. మల్లెపల్లి బాలుర డిగ్రీ కళాశాలను స్థానిక బాలుర పాఠశాల ఆవరణలోకి మార్చిన నేపథ్యంలో విద్యార్థులకు తరగతి గదులు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, ఫర్నిచర్ తదితర వసతులు కల్పించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. పర్యటనలో ఆర్డీవో సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ ఆరిఫొద్దిన్, ఎండోమెంట్, ఇరిగేషన్ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# కేంద్రం, సవరణ పేరుతో అర్హులైన ఓట్లను తొలగిస్తుంది

**మంత్రి వి,హనుమంతరావు.రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**సిరిసిల్ల టౌన్ సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటనకు రానుండగా సిరిసిల్లలో ఏర్పాటు చేస్తున్న సభాస్థలిని మంత్రి వి హనుమంతరావు సోమవారం పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మ దహనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హనుమంతరావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాసులు మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ పేరుతో పేదలు, సామాన్యులు, కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరుల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. ఎఐసిసి, పిసిసి పిలుపు మేరకు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని నిరసిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జ్ఞానేష్ కుమార్ దిష్టి బొమ్మ దహనం చేస్తూ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బల్మూర్ వెంకట్, జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డి లు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటికే ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి మార్పు రాలేదని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపును నిరసిస్తూ ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట నిరసనలు చేపట్టినట్లు తెలిపారు. పశ్చిమ బెంగాల్, బిహార్‌లో జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ, తమను ప్రశ్నించే గొంతుకలకు, కాంగ్రెస్‌కు మద్దతుగా ఉన్న పేదల ఓట్లను లక్ష్యంగా చేసుకుని ఓటర్ల సవరణ ప్రక్రియను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన పేదలు ఓటు హక్కును కోల్పోయే పరిస్థితి రాకుండా నిబంధనలను సరళతరం చేయాలని డిమాండ్ చేశారు. ఓటరు జాబితాను ఆధార్‌తో అనుసంధానం చేసే విధానాన్ని పరిశీలించాలని, అర్హులైన పేదలందరి పేర్లను ఓటర్ల జాబితాలో కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఓటు హక్కును కాపాడేందుకు ఎన్నికల సంఘం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఆర్ అండ్ బీ శాఖలో సిబ్బంది చేతివాటం

## కారుణ్య నియామకం కోసం డబ్బులు డిమాండ్

- డబ్బులు ఇచ్చిన వారికే నియామకం చేసిన ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు వేసిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్
- అదనపు కలెక్టర్ నేతృత్వంలో విచారణ



**సూర్యాపేట (జనంసాక్షి):** రోడ్లు, భవనాల శాఖలో కారుణ్య నియామకం పేరిట బాధితుల నుంచి భారీగా నగదు డిమాండ్ చేసి, డబ్బులు ముట్టజెప్పిన వేరొకరికి అడ్డదారిలో పోస్టింగ్ కట్టబెట్టిన వ్యవహారంలో అక్రమాలకు పాల్పడిన ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు పూర్తి వ్యవహారంపై సమగ్ర విచారణకు ఆదేశించారు. ఆర్అండ్ బీ శాఖలో వాచ్ మెన్ గా పని చేస్తూ 2023లో గుండె పోటుతో మృతి చెందిన మండపల్లి భరత్ బాబు కొడుకు కారుణ్య నియామకం కింద పోస్టింగ్ ఇవ్వడానికి జూనియర్ అసిస్టెంట్ డబ్బులు డిమాండ్ చేశారు. అంత పెద్ద మొత్తం చెల్లించుకోలేక బాధితుడు ఆఫీసు చుట్టూ మూడేళ్ళుగా తిరుగుతున్న పోస్టింగ్ ఇవ్వలేదు. అదే సమయంలో ఆ పోస్టింగ్ కోసం డిమాండ్ చేసిన మొత్తాన్ని సమర్పించిన వేరొక అభ్యర్థికి పోస్టింగ్ కట్టబెట్టారు. దీనిపై బాధితుడు జిల్లా కలెక్టర్ ను ఆశ్రయించడంతో సిబ్బంది నిర్వాకం వెలుగులోకి వచ్చింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ప్రాథమిక సమాచారాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ జూనియర్ అసిస్టెంట్ ను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ వ్యవహారంలో కేవలం జూనియర్ అసిస్టెంట్ మాత్రమే ఉన్నాడా లేదా వెనుక ఇంకా ఎవరైనా పెద్దల హస్తం ఉందా అనే కోణంలో లోతైన దర్యాప్తునకు ప్రత్యేక విచారణకు అదనపు కలెక్టర్, ఆర్అండ్ బీ ఎస్ఈ, ఆడిట్ ఆఫీసర్లతో కూడిన విచారణ కమిటీని కలెక్టర్ నియమించారు. నియామక ప్రక్రియలో జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి తక్షణమే నివేదిక సమర్పించాలని వారిని ఆదేశించారు.





# ప్రభుత్వాసుపత్రి.. రోగుల పాలిట శాపం!

- వైద్యుల కొరత.. పారిశుధ్య లోపాలు.. పెచ్చులూడుతున్న గోడలు
- నిర్వహణ గాడి తప్పిందంటూ అఖిలపక్షం ధ్వజం

**వనపర్తి బ్యూరో, సెప్టెంబరు 28 జనంసాక్షి**

వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు ఆరోపించారు. వైద్యుల కొరతతో పాటు పారిశుధ్యం, మౌలిక వసతుల లోపాలతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సోమవారం అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా. సతీష్ యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు ప్రభుత్వాసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా రక్త నమూనాలు సేకరించే ప్రదేశంలో ఆహార పదార్థాలు, చీపుర్లు, ఇతర సామగ్రి ఉంచడాన్ని నాయకులు తప్పుబట్టారు. ఆసుపత్రి పరిసరాల్లో పారిశుధ్య పరిస్థితులు సరిగా లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆసుపత్రి భవనం గోడలు పెచ్చులూడి ప్రమాదకరంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా. సతీష్ యాదవ్ మాట్లాడుతూ పేరుకే ప్రజాపాలనగా మారిందని, ప్రజలకు అవసరమైన వైద్య సేవలు మాత్రం అందుబాటులో లేకుండా పోతున్నాయని విమర్శించారు. వందల కోట్ల రూపాయల అభివృద్ధి పనుల గురించి చెబుతున్న పాలకులు ప్రజలకు నేరుగా ఉపయోగపడే విద్య, వైద్య రంగాలపై మరింత దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వాసుపత్రుల నిర్వహణ, మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య సిబ్బందిని ఇతర పనులకు వినియోగించడం వల్ల ఆసుపత్రిలో శుభ్రత దెబ్బతింటోందని నాయకులు పేర్కొన్నారు.

సంబంధిత ఏజెన్సీ గడువు ముగిసిన నేపథ్యంలో కొత్త టెండర్ ప్రక్రియ ద్వారా పారిశుధ్య సిబ్బందిని నియమించాలని కలెక్టర్‌ను కోరారు. వనపర్తి జిల్లాకు వచ్చే మంత్రులు ప్రభుత్వాసుపత్రి పరిస్థితిని పరిశీలించి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకుడు కొత్తగొల్ల శంకర్, బీజేపీ నాయకుడు రవి, రామస్వామి, శివకుమార్, సురేష్ యాదవ్, సాయికుమార్ ు పాల్గొన్నారు.

# ఘనంగా హర్ ఘర్ జల్ కార్యక్రమం..



**శంకర్ పల్లి, సెప్టెంబర్ 28 (జనం సాక్షి):** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హర్ ఘర్ జల్ కార్యక్రమం మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బల్వంత్ రెడ్డి మాట్లాడుతూ..కొత్తపల్లి గ్రామంలో మిషన్ భగీరథ ద్వారా 100% తాగునీటిని ప్రతిరోజూ ప్రతి ఇంటికి అందిస్తున్నామని తెలిపారు. ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ అధికారులు చేవెళ్ల డీఈఈ టి.హారిక, మండల ఏఈఈ బి.వెంకటేశ్వర్ రావు, మిషన్ భగీరథ హెల్పర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఉషు పోటీలకు ఐదుగురు ఎంపిక

### 6 బంగారు.. 6 వెండి పతకాలతో సత్తాచాటిన గంభీరావుపేట క్రీడాకారులు



గంభీరావుపేట, సెప్టెంబర్ 28 జనంసాక్షి : కరీంనగర్‌లోని ఫండస్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-17 ఎస్‌జీఎఫ్ ఉషు క్రీడా పోటీల్లో గంభీరావుపేట మండల క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. కొత్తపల్లి జెడ్పీహెచ్ఎస్, నర్మాల గురుకుల పాఠశాలలకు చెందిన 12 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొని 6 బంగారు, 6 వెండి పతకాలు సాధించారు. వీరిలో ఐదుగురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని జిల్లా ఉషు కార్యదర్శి విక్రమ్ తెలిపారు. బంగారు పతకాలు సాధించిన పి.గౌతమ్, బి.సాయి తేజ, బి.సాయి కృష్ణ, సీహెచ్.నిహారిక, వి.శ్రీ హర్షిని తదితరులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ నెల 28 నుంచి 30 వరకు హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రాష్ట్రస్థాయి ఉషు పోటీలు జరగనున్నాయి. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను డీవైఎస్ఓ అజ్మీరా రాందాస్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రవీందర్, ఎంఈఓ గంగారాం, పీఈటీ కన్వీనర్ భాను, పీఈటీలు భారతి, లక్ష్మి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.



# ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్‌దే గెలుపు

- ఓట్ల చోరీకి సూత్రధారి జ్ఞానేశ్‌కుమార్‌ను అరెస్టు చేయాలి : : పొంగులేటి
- డీసీసీ అధ్యక్షుడు శివసేనారెడ్డి.. వనపర్తిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

**వనపర్తి బ్యూరో సెప్టెంబర్28 జనంసాక్షి :** అర్హులైన ఓటర్ల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించే కుట్రకు ఎన్నికల సంఘమే బాధ్యత వహిస్తోందని వనపర్తి డీసీసీ అధ్యక్షుడు శివసేనారెడ్డి ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను వెంటనే అరెస్టు చేసి, పదవి నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కును హరించే చర్యలకు పాల్పడిన వారిపై రాజ్యాంగబద్ధంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పిలుపు, టీపీసీసీ ఆదేశాల మేరకు సోమవారం వనపర్తి సమీకృత కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'ఎలక్షన్ చోర్ ఆఫ్ ఇండియా' పేరుతో శాంతియుత నిరసన చేపట్టారు. డీసీసీ అధ్యక్షుడు శివసేనారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియపై ఎన్నికల సంఘంలోనే విభేదాలు వ్యక్తమవుతున్నాయన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్ సంధు, వివేక్ జోషీలు గత పది నెలల్లో పలుమార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన నివేదికలను ప్రస్తావించారు. దీనివల్ల ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో మరిన్ని అనుమానాలు ఏర్పడుతున్నాయని అన్నారు. కొత్త ఓటర్ల నమోదుకు ఉద్దేశించిన ఫామ్-6 ప్రక్రియను కూడా క్లిష్టతరం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కొత్త ఓటర్ల నుంచి తల్లిదండ్రులు, తాతముత్తాతలకు సంబంధించిన వివరాలు కోరడం వల్ల యువత ఓటరు నమోదుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగకుండా ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు.

# కండక్టర్ లేడని గంటన్నర లేట్.. ప్రయాణికుల అవస్థలు



**గన్నేరువరం, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** ప్రజా రవాణాలో సమయపాలన పాటించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ఘటన గన్నేరువరంలో చోటుచేసుకుంది. కరీంనగర్ డిపోకు చెందిన కరీంనగర్-పుత్తూర్-గన్నేరువరం-మైలారం ఆర్టీసీ బస్సు సోమవారం ఉదయం 10:45 గంటలకు రావాల్సి ఉండగా ఆలస్యంగా మధ్యాహ్నం12 గంటలకు గన్నేరువరం చేరుకుంది.

**ఎండలో గంటల తరబడి నిరీక్షణ:**

బస్సు నిర్ణీత సమయానికి రాకపోవడంతో బస్ స్టాప్ లో విద్యార్థులు, మహిళలు, వృద్ధులు ఎండలో తీవ్ర ఇబ్బందులు పడుతూ చాలాసేపు వేచి ఉండాల్సి వచ్చింది. చివరకు బస్సు రావడంతో ఒక్కసారిగా ప్రయాణికులు ఎక్కేందుకు ప్రయత్నించడంతో బస్సు కిక్కిరిసిపోయింది. బస్సు ఆలస్యానికి కారణం ఏమిటని డ్రైవర్ ను ప్రయాణికులు ప్రశ్నించగా, కండక్టర్ అందుబాటులో లేకపోవడంతో బస్సు ఆలస్యమైందని సమాధానం ఇచ్చినట్లు ప్రయాణికులు తెలిపారు. కండక్టర్ అందుబాటులో లేని పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ సిబ్బందిని ఏర్పాటు చేయకుండా బస్సును ఆలస్యంగా నడపడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వచ్చిందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృదులు, ఆర్టీసీ బస్సుల పైనే ఆధారపడుతున్నారని పేర్కొన్నారు.

**సమయపాలన పాటించాలని డిమాండ్:**

గ్రామీణ ప్రాంతాలకు నడిచే ఆర్టీసీ బస్సులు నిర్ణీత సమయానికి నడిచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. సిబ్బంది కొరత లేదా ఇతర కారణాలతో బస్సు సేవలకు అంతరాయం కలగకుండా ముందస్తు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి, గ్రామీణ బస్సుల సమయపాలన, సిబ్బంది అందుబాటు, ప్రయాణికుల సౌకర్యాలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

# వేటాడిన" వేటగాళ్లు.. వెంటాడిన "పోలీసులు..

### జింక మాంసం తరలిస్తుండగా నిఘా పెట్టి పట్టుకున్న పోలీసులు

- 9మంది నిందితుల అరెస్ట్ రిమాండ్
- వివరాలను వెల్లడించిన డిసిపి శిరీష





**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి) :** మహబూబ్ నగర్ జిల్లా మరికల్ శివారు ప్రాంతాల్లో జింకను వేటాడి జింక మాంసంను తరలిస్తున్న క్రమంలో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ టోల్ ప్లాజా వద్ద పక్కా సమాచారంతో నిఘా పెట్టి ఎస్ఓటి లాఅండ్ ఆర్డర్ పోలీసుల సమక్షంలో 9 మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు షాద్ నగర్ జోన్ డిసిపి శిరీష మీడియాకు తెలిపారు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం షాద్ నగర్ టోల్ ప్లాజా వద్ద కారులో జింక మాంసం తరలిస్తున్నారనే సమాచారంతో ఎస్ఓటి పోలీసులు తనిఖీలు చేయగా 9మంది నిందితులు కారులో తరలిస్తున్న 13 కిలోల జింక మాంసంతో పాటు, వేటకు ఉపయోగించిన రైఫిల్,మరియు నాటు తుపాకితో పాటు తొమ్మిది మంది పట్టుబడ్డారు,ఈ తనిఖీల్లో పట్టుబడ్డ మాంసం, రైఫిల్, నాటు తుపాకితో పాటు రెండు కార్లు, తొమ్మిది మొబైల్స్ స్వాదినం మహబూబ్ నగర్ జిల్లా మరికల్ వద్ద జింకను వేటాడేందుకు వేటకు ఉపయోగించిన రైఫిల్ స్పోర్ట్స్ కోట లైసెన్స్ పొందినట్లు గుర్తించారు ఈ తొమ్మిది మంది నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు మీడియా సమావేశంలో డీఎఫ్ఓ శివశషన్ సిఐ సితారం. ఫారెస్ట్ అధికారులు ఎస్ఓటి పోలీసులు పాల్గొన్నారు.

## లో వోల్టేజీతో అన్నదాతల అవస్థలు

**గంభీరావుపేట,(జనంసాక్షి):** కుర్దులింగంపల్లి రైతులులో వోల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌పై 30కిపైగా మోటార్లు ఉండటంతో సరిపడా విద్యుత్ అందక మోటార్లు కాలిపోతున్నాయని, పంటలు ఎండిపోతున్నాయని రైతులు తెలిపారు. ఫ్యూజ్ వైర్లు తరచూ కాలిపోతుండటంతో ప్రమాదకర పరిస్థితుల్లో వాటిని తామే మార్చుకోవాల్సి వస్తోందన్నారు. ఏడాదిగా ఇంప్రూవ్‌మెంట్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం అధికారులను కోరుతున్నా స్పందన లేదని పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

## ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

**నిర్దేశిత గడువులో పరిష్కరించాలి : కలెక్టర్ మను చౌదరి**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి) :**

ప్రజావాణిలో అందే ప్రతి అర్జీని నిర్దేశిత కాల పరిమితిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను వేగంగా అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 111 అర్జీలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి.విజయేందర్ రెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా రెవెన్యూ అధికారి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు భూ సమస్యలు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు తదితర అంశాలపై అర్జీలు సమర్పించారు. కలెక్టర్ మను చౌదరి అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను ఆలకించారు. సంబంధిత శాఖల అధికారులు ప్రతి అర్జీని పరిశీలించి నిబంధనల మేరకు సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు.

# విద్యా ప్రమాణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలి

- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా
- పాఠశాల విద్య, సంక్షేమ సంస్థల పనితీరుపై సమీక్ష



**హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 28 (జనం సాక్షి) :** పాఠశాల విద్య, సంక్షేమ శాఖల పరిధిలోని విద్యా సంస్థల పనితీరుపై హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా స్థాయి అధికారులతో ఆమె సమీక్ష చేపట్టారు. వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సంక్షేమ శాఖల కార్యదర్శులు సవ్యసాచి ఘోష్, బాల మాయా దేవి, విజయేంద్ర బోయి, షఫియుల్లాతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్య, సంక్షేమ కార్యక్రమాల అమలు, యూనిఫారాలు, స్కూల్ కిట్లు, పాఠ్యపుస్తకాల పంపిణీ, విద్యార్థులు-ఉపాధ్యాయుల హాజరు, ఉపాధ్యాయుల ఖాళీలు, మౌలిక వసతులు, బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం, వసతి గృహాల్లో ఆహార నాణ్యత, కాస్మోటిక్, డైట్ ఛార్జీలు, పారిశుధ్యం, విద్యార్థుల ఆరోగ్యం, భద్రత తదితర అంశాలపై సమీక్షించారు. విద్యా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు అనుగుణంగా కలెక్టర్లు నిరంతరం ప్రత్యేక దృష్టి సారించాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. పాఠశాలలు, వసతి గృహాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, విద్యా సామగ్రి పంపిణీ, బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాల అమలులో విద్యా, సంక్షేమ శాఖల మధ్య సమన్వయం పెంచాలని సూచించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, సమగ్ర శిక్ష, పీఎం శ్రీ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించి ఫేషియల్ రికగ్నిషన్ హాజరు, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ, డ్రాప్‌బాక్స్ స్థితి, ఏఐ ఏఎక్స్ఎల్ ల్యాబ్స్, యూనిఫారాల అవసరాలు, పంపిణీ, స్కూల్ కిట్లు, పాఠ్యపుస్తకాలు, కాస్మోటిక్, డైట్ ఛార్జీలపై శాఖల వారీగా పురోగతిని సమీక్షించారు. జిల్లాలోని సంక్షేమ శాఖల పరిధిలో ఉన్న పాఠశాలలు, వసతి గృహాలు, కళాశాలల విద్యా స్థితిగతులపై ప్రతి వారం సమగ్ర నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమైన పనితీరు సూచికలు, కార్యక్రమాల అమలు పురోగతి, లోపాలు, పరిష్కరించాల్సిన అంశాలను నివేదికలో పొందుపరచాలని సూచించారు. శనివారం జిల్లాలో ఉపాధ్యాయుల ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్(ఎఫ్ఆర్ఎస్) హాజరు శాతం తక్కువగా నమోదవడాన్ని కలెక్టర్ తీవ్రంగా పరిగణించారు. విధులకు హాజరుకాని ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణ కోరాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) జితేందర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి అశన్న, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి సదానందం, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ప్రవీణ్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఇలియాస్, రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీల ప్రాంతీయ సమన్వయకర్తలు పాల్గొన్నారు.



# మట్టి కొల్లగొట్టి..

### మైనింగ్ అనుమతి లేదు.. రెవెన్యూ శాఖ సమ్మతి రాదు

- సీతారాంపేటలో కేజీఎఫ్ దందా
- ప్రభుత్వ, అసైన్ భూముల లూటీ
- టిప్పర్ల ద్వారా అక్రమంగా మట్టి తవ్వకాలు
- మున్సిపల్ ఛైర్మన్ సుదర్శన్ రెడ్డి పొలంలోకి తరలింపు



**రంగారెడ్డి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):**

ప్రభుత్వ భూములను కంటికి రెప్పలా కాపాడాల్సిన ప్రజాప్రతినిధే స్వయంగా అక్రమాలకు పాల్పడుతున్న ఉదంతం ఇబ్రహీంపట్నంలో కలకలం రేపుతోంది. ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి (బీఆర్ఎస్) తన వ్యవసాయ పొలంలోకి ప్రభుత్వ భూమి నుండి ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రికి రాత్రి మట్టిని తరలిస్తూ ప్రభుత్వ ఆస్తులకు తూట్లు పొడుస్తున్నారు.

సీతారాంపేట రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమిని ఆసరాగా చేసుకుని ఈ అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. పదుల సంఖ్యలో టిప్పర్లు, హిటాచిలు, జేసీపీలను రంగంలోకి దించి రాత్రి వేళల్లో పెద్ద ఎత్తున మట్టిని తవ్వి చైర్మన్ వ్యవసాయ పొలంలోకి తరలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ దందా వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ఒక మున్సిపల్ చైర్మన్ హోదాలో ఉండి ప్రభుత్వ భూములను ఆక్రమించి మట్టిని తరలించడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

**ఎమ్మెల్యే ఆదేశాల బేఖాతరు**

మరోవైపు, నియోజకవర్గంలో ఎలాంటి అక్రమ మట్టి తరలింపునకు, అనధికారిక తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దని స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అధికారులను స్పష్టంగా ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని హెచ్చరిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అధికారులు వాటిని పూర్తిగా బేఖాతరు చేస్తుండటం గమనార్హం. ప్రజాప్రతినిధి అక్రమాలకు అధికారుల మౌనసమ్మతి తోడైందనే ఆరోపణలు బలపడుతున్నాయి. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నా, అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నా స్పందించని అధికారులపై పైస్థాయి అధికారులు విచారణ జరిపి, తక్షణమే చైర్మన్ అక్రమ మట్టి తరలింపుపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# నల్లచెరువుకు కొత్త ఊపిరి!

- ఆక్రమణల చెర నుంచి పునరుజ్జీవన దిశగా
- హైడ్రా చర్యలతో మారుతున్న రూపురేఖలు
- చెరువు పరిధి పరిరక్షణపై పెరుగుతున్న ఆశలు
- భవిష్యత్ తరాలకు జలవనరుగా కాపాడాల్సిన బాధ్యత



**ఉప్పల్, సెప్టెంబర్ 28 (జనంసాక్షి):** ఒకప్పుడు ఉప్పల్ ప్రాంతానికి సహజ జలవనరుగా, వర్షపు నీటి నిల్వ కేంద్రంగా ఉన్న నల్లచెరువు కాలక్రమేణా ఆక్రమణలు, నిర్మాణాలు, చెత్తాచెదారంతో తన సహజ స్వరూపాన్ని కోల్పోయే పరిస్థితికి చేరుకుంది. నగరీకరణ విస్తరణతో చెరువు పరిధిపై ఒత్తిడి పెరగడంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో చెరువులు, కుంటలు, నాలాల పరిరక్షణపై హైడ్రా చేపడుతున్న చర్యలతో నల్లచెరువు మరోసారి చర్చలోకి వచ్చింది.

చెరువు పరిధిలో ఆక్రమణల తొలగింపు, సహజ స్వరూపాన్ని పరిరక్షించే చర్యలు చేపట్టడంతో గతంతో పోలిస్తే మార్పు కనిపిస్తోందని స్థానికులు చెబుతున్నారు. వర్షపు నీటిని స్వీకరించడం, నిల్వ చేయడం, నీటి ప్రవాహాన్ని కొనసాగించడం, భూగర్భ జలాలపై ప్రభావం చూపడం వంటి అంశాల్లో చెరువులకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు. నగర విస్తరణ నేపథ్యంలో చెరువు పరిధి, నీటి ప్రవాహ మార్గాలను కాపాడటం కీలకమని స్థానికులు భావిస్తున్నారు. ఆక్రమణలు తొలగించిన తర్వాత మళ్లీ అవి ఏర్పడకుండా నిరంతర పర్యవేక్షణ అవసరమని కోరుతున్నారు. చెరువులో చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచిస్తున్నారు. నల్లచెరువు పరిరక్షణ చర్యలు కేవలం ఆక్రమణల తొలగింపుతో ముగియకుండా నీటి నిల్వ సామర్థ్యం, ప్రవాహ మార్గాలు, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన శాశ్వత చర్యల వరకు కొనసాగాలని స్థానికులు ఆశిస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు, ప్రజల సమన్వయంతో నల్లచెరువును భవిష్యత్ తరాలకు సహజ జలవనరుగా అందించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు.

జనంసాక్షి www.janamsakshi.org | మంగళవారం 29 సెప్టెంబర్ 2026

# విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం

- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- రూ.12.75 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్, రూ.10 కోట్లతో గురుకుల కళాశాల భవనాలకు శంకుస్థాపన



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** ప్రజా ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి జిల్లాలో పర్యటించిన ఆయన పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో రూ.12.75 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవనానికి, వనపర్తి మండలం చిట్యాల గ్రామ పరిధిలో రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న జ్యోతిబా ఫూలే బాలుర గురుకుల కళాశాల భవనానికి రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. రైతులకు కనీస మద్దతు ధర, రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్న బియ్యానికి రూ.500 బోనస్ వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఇప్పటికే వేలాది ఉద్యోగాలు కల్పించామని, మరిన్ని ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. మహిళా సంఘాలకు సున్నా వడ్డీకే రుణాలు అందిస్తున్నామని, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, అర్హులకు తెల్ల రేషన్ కార్డులు అందిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తూనే తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అభ్యర్థన మేరకు వెల్టూర్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కొత్త మండలాలు, డివిజన్ల ఏర్పాటుపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. రాష్ట్ర పశు సంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ వెల్టూరులో రూ.12.75 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వెల్టూరును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు.

### నల్లచెరువులో చేప పిల్లల విడుదల

వనపర్తి పట్టణంలోని నల్లచెరువులో చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు చేప పిల్లలను నల్లచెరువులోకి విడుదల చేశారు.

# సమాజహితం కోసమే 'రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వేదిక' ఏర్పాటు

- వేదిక కన్వీనర్ కె. రామచంద్రమూర్తి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రతి రంగంలోనూ విలువలు క్షీణిస్తున్న నేటి ఆందోళనకర పరిస్థితుల్లో, రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం అనే మౌలిక విలువలను పరిరక్షించేందుకే 'రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వేదిక" (ఫోరం ఫర్ కాన్స్టిట్యూషనల్ డెమోక్రసీ) ఏర్పాటైందని, ప్రముఖ పాత్రికేయులు, వేదిక కన్వీనర్ కె.రామచంద్రమూర్తి స్పష్టం చేసారు. సోమవారం బషీర్ బాగ్ లోని సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో, రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వేదిక ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ జి.హరగోపాల్, శాసన మండలి సభ్యులు యం. కోదండరాం, సామాజిక ఆలోచనపరులు డాక్టర్ గాదె గోపాల్ రెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారి యం.వి.రెడ్డి, సీనియర్ న్యాయవాది జ్యోతి కిరణ్, వేదిక కో-ఆర్డినేటర్ దీప్తిలతో కలిసి ఆయన మాట్లాడారు. దేశంలో మొత్తంగా, ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాలలో, రాజకీయ సంభాషణ రోజురోజుకూ దిగజారుతోందని, ఒకప్పుడు ఆత్మగౌరవం, పరస్పర గౌరవంతో కూడిన భాష స్థానంలో దూషణలు, అసత్యాలు, వ్యక్తిగత విమర్శలు చోటుచేసుకుంటున్నాయని, ఈ క్రమంలోనే సమాజంలో ప్రజాస్వామ్య సంస్థలు, రాజ్యాంగ విలువలు బలహీనపడుతున్నాయని రామచంద్రమూర్తి ఆవేదన వ్యక్తం చేసారు. భయమో, పక్షపాతమో లేకుండా స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాల్సిన సమయం ఆసన్నమైనందు వల్లే ఈ వేదికను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేసారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యం విస్తృతమైన అంశమైనప్పటికీ, ఈ వేదిక ప్రధానంగా రాజ్యాంగ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం హామీ ఇచ్చిన విలువలు, హక్కులు, సంస్థల పరిరక్షణపై దృష్టి సారించడం శుభ పరిణామమన్నారు. కోట్లాది ప్రజల పోరాటాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఇలాంటి ప్రజాస్వామ్య వేదికలను ప్రతి పౌరుడు స్వాగతించాలని ఆయన కోరారు. ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ జి. హరగోపాల్ మాట్లాడుతూ, రాజ్యాంగ హక్కులు, పౌర స్వేచ్ఛలకు చురుకైన రక్షణ అవసరమని అన్నారు. ఈ కృషిలో పౌర సమాజం, విద్యావేత్తలు, మీడియా కీలక పాత్ర పోషించాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రజల హక్కులు, సంస్థల స్వేచ్ఛలపై ఒత్తిడి ఏర్పడినప్పుడు సమాజం స్పందించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు.

శాసనమండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ, ప్రజా ఉద్యమాలు, ప్రజా సమస్యలపై వేదిక చర్చిస్తుందని, వాస్తవాలు, సమాచార ఆధారంగా జోక్యం చేసుకుంటుందని తెలిపారు. సంబంధిత వర్గాలకు సూచనలు, సిఫారసులు అందించేందుకు కృషి చేస్తుందని చెప్పారు. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య పరిరక్షణ పట్ల ఆందోళనలు, నిబద్ధతలను పంచుకునే పౌరులందరూ ఈ ప్రయత్నంలో తమతో కలిసి రావాలని ఆయన విజ్ఞప్తి చేసారు.

హైకోర్టు సీనియర్ న్యాయవాది జ్యోతి కిరణ్ మాట్లాడుతూ రాజ్యాంగ సంస్థల స్వయంప్రతిపత్తి, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఓటు హక్కు పరిరక్షణ, డీలిమిటేషన్, దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం, ప్రయోజనాలను కాపాడాల్సిన అవసరాన్ని ఆమె ప్రస్తావించారు.

సామాజిక విశ్లేషకులు డాక్టర్ గాదె గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, రాజ్యాంగ విలువలు, చట్టబద్ధ పాలనకు ప్రజల దృష్టి మరింత అవసరమైన సమయంలో ఈ వేదిక ఏర్పడిందన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, పౌరుల్లో మరింత అవగాహన కల్పించేందుకు వేదిక పనిచేస్తుందని తెలిపారు.

మాజీ ఐఏఎస్ అధికారి ఎం.వి.రెడ్డి ఈ వేదికను స్వాగతిస్తూ, వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు తమ అనుభవం, నైపుణ్యాలను రాజ్యాంగ ప్రజాస్వామ్యం, పౌర స్వేచ్ఛల పరిరక్షణకు వినియోగించవచ్చని అన్నారు. ఈ కృషికి మీడియా సహకారం అవసరమని, భావ ప్రకటనా స్వేచ్ఛ, మీడియా స్వేచ్ఛ రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో అంతర్భాగాలని ఆయన పేర్కొన్నారు. ఈ వేదిక ఆధ్వర్యంలో సెమినార్లు, ప్రజా చర్చలు నిర్వహించడం, పరిశోధనలు చేపట్టడం, నివేదికలు మరియు సిఫారసులు ప్రచురించడం, పౌరులు మరియు రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వాలు, ఇతర భాగస్వామ్య వర్గాలతో చర్చలు జరపడం వంటి కార్యక్రమాలను చేపట్టాలని ఆయన ప్రతిపాదించారు. ఇంకా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ, వేదిక కో-ఆర్డినేటర్ దీప్తి తదితరులు మాట్లాడారు.

# వీడీసీల రద్దుకు కృషి చేయాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగను కోరిన తాళ్ళరంపూర్ వీడీసీ బాధితులు
- మీతో ఎమ్మార్పీఎస్ ఉంటుందని హామీ ఇచ్చిన మందకృష్ణ



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** హైదరాబాద్ లో వీడిసి వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మంద కృష్ణని కలిసిన తాళ్ళరాంపుర్ " గ్రామ అభివృద్ధి కమిటీ" బాధితులు. వారిపట్ల జరుగుతున్న ఈ వెలివేత,వివక్ష పట్ల వివరించారు. అనంతరం మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ మరియు ఇతర అన్ని ప్రజాస్వామిక సంఘాల ద్వారా ఇట్టి సమస్య పరిష్కార దిశగా మీకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కాలంలో కూడా ఇలాంటి సాంఘిక బహిష్కరణలు వంటి దురాగతాలు జరగడం సిగ్గుచేటని అన్నారు. వారి ఆధిపత్య ధోరణిని కూకటివేళ్లతో అనిచేస్తాం.. బాధితులకు అండగా ఉంటాం అని భరోసా ఇచ్చారు. ఎమ్మార్పీఎస్, ఎం.ఎస్.పి సీనియర్ నాయకులు సరికేల పోశెట్టిమాదిగ మాట్లాడుతూ త్వరలో ఎమ్మార్పీఎస్, ఎం.ఎస్.పి వీడిసి వ్యతిరేక పోరాట సమితి తో ఉద్యమం చేస్తాము నిజామాబాద్ జిల్లా నుండి అధికార పార్టీ నుండి పీసీసీ అధ్యక్షుడు హోదాలో మహేశ్ కుమార్ గౌడ్ వుండి తన సమాజిక వర్గం, దళితులను సాంఘిక బహిష్కరణ చేయడం సిగ్గుచేటు ఇప్పటికి పిసీసీ హోదాలో నిజామాబాద్ లో ఉండి పర్మర్శించకపోవడం మరి వారిపై చట్టరీత్యా చర్య తీసుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో బట్టు శ్రీధర్, బాదితులు దిబ్బ సుదర్శన్ , నర్సా గౌడ్ , నారాయణ గౌడ్ , గంగాధర్ , దేవదాస్ , దేవన్న , జనార్దన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మా రైతుల ముట్టడి

- భారీ ర్యాలీ నిర్వహించేందుకు యత్నం
- ర్యాలీని అడ్డుకుని అరెస్టు చేసిన పోలీసులు
- రైతులు, పోలీసుల మధ్య తోపులాట
- పోలీసు వాహనంలో రైతు ఆత్మహత్యాయత్నం
- పార్మాసిటీనీ రద్దు చేయాల్సిందేనని పట్టు



**రంగారెడ్డి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రజాభవన్‌ను యాచారం ఫార్మా రైతులు ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. ఉదయం నుంచి రైతాంగం ఒక్కసారిగా ఇబ్రహీంపట్నంలో ర్యాలీ నిర్వహించేందుకు పూనుకుంది. దాంతో పోలీసులు అడ్డుకున్నారు. దాంతో పోలీసులు రైతాంగం మధ్య తోపులాట చేసుకుంది. రైతాంగాన్ని అరెస్టు చేసి ఆయా పోలీస్ స్టేషన్లో తరలించారు ఈ నేపథ్యంలో పోలీస్ వాహనంలో రైతు ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు పోలీసులు అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది. అంతకుముందు ఫార్మాసిటీని రద్దు చేస్తామని ఎన్నికలు ఇచ్చిన హామీ ఏమయిందని ముట్టడి సందర్భంగా ప్రశ్నించారు. మూడు సంవత్సరాలు కావస్తున్న ఫార్మాసిటీ ఎందుకు రద్దు కాలేదని నిలదీశారు. తమ భూములు ఎప్పుడు తిరిగిస్తారని ప్రశ్నించారు. జీవో నెంబర్ 31 రోజు చేయాలనే డిమాండ్ చేశారు. ఫార్మా రైతులు ప్రజాభవన్ కార్యాలయం ముట్టడిస్తారన్న విషయం తెలుసుకొని భారీ స్థాయిలో పోలీసులు మోహరించారు. ప్రజాభవన్లోకి దూసుకుపోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని రైతులు స్పష్టం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఫార్మాసిటీ కోసం తీసుకున్న భూములకు సంబంధించిన నిర్ణయాన్ని పునఃపరిశీలించి, ఫార్మాసిటీ ప్రతిపాదనను రద్దు చేయడంతో పాటు తమ భూములను తిరిగి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మేడిపల్లి, నానక్ నగర్ , సింగారం గ్రామాలకు చెందిన రైతులు భారీ స్థాయిలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే ప్రజాభవన్ కార్యాలయానికి తరలివచ్చారు. తమకు న్యాయం చేసే వరకు ఇక్కడే ఉంటామని బీస్మించారు ప్రజా భవన్ కార్యాలయత కోసం నిరసన వ్యక్తం చేశారు ప్రతి ఒక్కరి చేతిలో ప్లాకార్డులలో పట్టుకొని నిరసన కొనసాగిస్తున్నారు. ప్రతి సోమవారం ఎమ్మెల్యే ప్రజాభవన్ లో ఉంటారన్న సమాచారం తో రైతులు భారీగా తరలివచ్చారు. ప్రజా భవన్ లో ఎవరూ లేకపోవడంతో అక్కడే కోసం నిరసన కొనసాగిస్తున్నారు.

### జీవో నంబర్ 31 రద్దు చేయాలి

ఫార్మాసిటీకి సంబంధించి గతంలో ఇచ్చిన భూములపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లకు అనుగుణంగా జీవో నంబర్ 31ను రద్దు చేసి, భూములను రైతులకు తిరిగి ఇచ్చే ప్రక్రియను ప్రారంభించాలని కోరారు. అప్పటివరకు విశ్రమించేది లేదని రైతులు పట్టుబట్టారు. ఎన్నికల సమయంలో తమ భూముల సమస్యను పరిష్కరిస్తామని కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చారని తెలిపారు. ప్రధానంగా స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మంత్రి సీతక్క,ఎమ్మెల్యే రాజు గోపాల్ గౌడ్, కోదండ రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హామీ ఇచ్చారన్నారు. మూడేళ్లు గడుస్తున్నా తమ సమస్యపై తగిన స్థాయిలో స్పందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

### పోలీసు వాహనంలో రైతు ఆత్మహత్యాయత్నం

యాచారం ప్రాంతంలో ప్రతిపాదించిన ఫార్మాసిటీని రద్దు చేసి, ప్రభుత్వం సేకరించిన తమ భూములను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రజా భవన్ ముట్టడి సందర్భంగా రైతాంగాన్ని పోలీసులు అరెస్టు చేసి బస్సులో తరలిస్తుండగా ఓ రైతు ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు సమాచారం. బస్సులో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వెంటనే పోలీసులు స్పందించి రైతును అడ్డుకున్నట్లు తెలిసింది.

# అన్ని సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- మిర్యాలగూడలో స్మార్ట్ కార్డుల పంపిణీ



**మిర్యాలగూడ (జనంసాక్షి) :** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి 3.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యం గా ప్రజాప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం నాడు మిర్యాలగూడ లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం వ్యాప్తంగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డు ల పంపిణి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ స్మార్ట్ రేషన్ కార్డులు అందించడంతోపాటు, కార్డుదారులకు నెలకు ఆరు కిలోల సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో 1.06 కోట్ల రేషన్ కార్డుల ద్వారా 3.48 కోట్ల మంది లబ్ధిదారులకు సన్నబియ్యం అందిస్తున్నామని, ఇందుకోసం రూ.15 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో గతంలో 86,960 రేషన్ కార్డులు ఉండగా, ప్రస్తుతం 1,01,688 స్మార్ట్ కార్డులకు చేరిందన్నారు. సుమారు 2.98 లక్షల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. దేశ వ్యాప్తంగా ఏర్పడిన ఎలినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులను ఎదురుకునేందుకు నాగార్జున సాగర్‌లో ఉన్న నీటిని ఆయకట్టు పంటలను కాపాడడంతోపాటు వచ్చే వేసవి వరకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అవగాహన లేని బిఆరెఎస్ నాయకులు సాగునీటిని విడుదల చెయ్యాలని రైతులను రెచ్చకొట్టడం అర్ధరహితం గా ఉందన్నారు. మిర్యాలగూడ నియోజక వర్గంలోని ఆరు ఎత్తిపోతల పథకాలకు రూ.175 కోట్లు మంజూరు చేసి పనులను వేగవంతం చేస్తున్నామని, వాటిని తమ ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేస్తామన్నారు. 2028 జూన్ నాటికి ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు పూర్తి చేసి ఉమ్మడి నల్గొండ జిల్లాలో 3.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమన్నారు. మిర్యాలగూడకు మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, నర్సింగ్ కళాశాల పనులు ప్రారంభిస్తామని తెలిపారు. పట్టణ ఫ్లైఓవర్ ఫైలు క్లియర్ చేయడంతోపాటు బస్టాండ్ ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్, మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, ఎమ్మార్వోలు, మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చెర్మన్ గుడిపాటి శిరీష నవీన్, నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ ఇంచార్జ్‌లు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## చెట్టుకు కట్టేసి... చిత్రహింసలు పెట్టి

# వృద్ధురాలిపై పైశాచికత్వం

- మంత్రాల సాకుతో చిత్రహింసలు
- చెట్టుకు కట్టేసి చితకబాదిన గ్రామస్తులు..
- ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలో ఘోరం
- రంగారెడ్డి కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో వికృతకృత్యం



**రంగారెడ్డి, సెప్టెంబర్ 28 (జనంసాక్షి) :** ఒకవైపు సాంకేతికత అంబరాన్నంటుతోంది.. ఏఐ, డిజిటల్ విప్లవంతో ప్రపంచం దూసుకుపోతోంది. కానీ గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం మూఢనమ్మకాల భూతం ఇంకా పేదలు, వృద్ధుల జీవితాలను బలి తీసుకుంటూనే ఉంది. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు పట్టుమని పది కిలోమీటర్ల దూరంలో, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని మంచాల మండలం నోముల గ్రామంలో మానవత్వాన్ని దహించివేసే దారుణ ఘోరం చోటుచేసుకుంది. మంత్రాలనెపంతో పల్నాటి వెంకటమ్మ అనే వృద్ధురాలిని ఊరి నడిబొడ్డున ఉన్న వేపచెట్టుకు కట్టేసి గ్రామస్తులు పిడిబాకులు గుమ్మరించారు. విచక్షణారహితంగా దాడి చేసి చావుబతుకుల మధ్యకు నెట్టేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

నోముల గ్రామంలో గత 15-20 రోజులుగా గర్భం దాల్చిన మహిళల బట్టలు మాయమవుతున్నాయి. మొదట ఇది వలస కార్మికుల పని అయి ఉంటుందని భావించినప్పటికీ, వారం క్రితం గ్రామానికి చెందిన ఒక బాలుడు ఓ ఇంటి నుంచి దుస్తులు తీసుకెళ్తుండగా గ్రామస్తులు పట్టుకున్నారు. నిలదీయగా.. ఆ వృద్ధురాలే తనను తీసుకురమ్మని చెప్పిందని ఆ బాలుడు తెలిపాడు. దీంతో ఆగ్రహంతో రగిలిపోయిన గ్రామస్తులు, మూఢనమ్మకాలతో పల్నాటి వెంకటమ్మపై పద్దారు. "మాపై మంత్రాలు చేసి ఏం చేద్దామనుకుంటున్నావ్? ఎంతమంది మంత్రగాళ్లను తెచ్చావు? ఎందుకు బట్టలు మాయం చేస్తున్నావ్?" అంటూ పొట్టు పొట్టు కొట్టారు. తనకు ఏమీ తెలియదని, తనకు ఎలాంటి సంబంధం లేదని ఆ వృద్ధురాలు కాళ్లు పట్టుకుని వేడుకున్నా ఆ రాక్షసుల మనసు కరగలేదు.

సమాచారం అందుకుని రంగంలోకి దిగిన మంచాల పోలీసులు.. దాడి చేసిన అకృత్యపరులను అరెస్ట్ చేయాల్సింది పోయి, గాయాలతో కొట్టుమిట్టాడుతున్న బాధితురాలినే అదుపులోకి తీసుకోవడం గమనార్హం. నామమాత్రపు కేసులతో పోలీసులు చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. మరోవైపు, ఘటన జరుగుతున్న సమయంలో అడ్డుకోవాల్సిన చదువుకున్న యువత.. తమ ఫోన్లలో వీడియోలు తీయడానికే పరిమితమయ్యారే తప్ప, ఒక్కరు కూడా ఆ వృద్ధురాలిని కాపాడేందుకు ముందుకు రాకపోవడం సమాజంలో చచ్చిపోయిన మానవత్వానికి నిదర్శనంగా నిలుస్తోంది.

14మందిపై కేసు నమోదు..

మంత్రాల నెపంతో వృద్ధురాలు పల్నాటి వెంకటమ్మపై దాడి చేసిన విషయం సోమవారం దావాణంలో ప్రచారం సాగడంతో పోలీసులు మేల్కొన్నారు. ఒకసారి ఆ పోలీసుల దృష్టికి మీడియా తీసుకుపోవడంతో 14 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఉన్నతాధికారుల జోక్యంతో గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహించినట్లు నాలుగు రోజుల తర్వాత ప్రకటించడం కొసమెరుపు. వృద్ధురాలికి ఉన్నతమైన చికిత్స అందించాల్సిన తరుణంలో ఆమను తన కుటుంబానికే వదిలేశారు. పిడుగులు గాయాలతో ఇంటిపొట్టనే ఉంటున్న వృద్ధురాల్ని పట్టించుకున్న వారే కరువయ్యారు. వృద్ధురాలిపై దాడి చేసిన 14 మందిపై కేసు నమోదు చేసినట్లు మంచాల ఎస్ఐ వంశీ తెలిపారు. ప్రస్తుతం వారంతా పరారీలో ఉన్నారని తెలిపారు.



# గ్రేటర్ మున్సిపోల్స్, స్థానిక సంస్థల ఎన్నికలే టార్గెట్

- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాబోయే స్థానిక సంస్థలు, జిల్లా, మండల పరిషత్ ఎన్నికల్లో సత్తా చాటాలని.. అందుకు తగిన విధంగా సిద్ధం కావాలని పార్టీ కేడర్‌కు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. రానున్న కాలంలో పార్టీ నేతలు, క్యాడర్ నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేస్తున్నారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఉమ్మడి మహబూబ్‌నగర్, ఉమ్మడి మెదక్ జిల్లాల నేతలతో భేటీ అయ్యారు. గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, గ్రేటర్ వరంగల్, ఖమ్మం కార్పొరేషన్‌లు, సిద్దిపేట సహా ఇతర మున్సిపాలిటీల్లో పోటీ చేసి సత్తా చాటాలని నేతలకు సూచించారు. నిజామాబాద్, కొడంగల్‌లో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలకు సంబంధించి ప్రజల నుంచి ఎలాంటి ఫీడ్ బ్యాక్ వచ్చిందో అడిగి తెలుసుకున్నారు. ప్రధాన ప్రతిపక్షంగా టీఆర్ఎస్ ఎలాంటి పాత్ర పోషించాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370